


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 156

సోమవారం 26-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**సాహో స్టోక్స్...**

‘యాషెస్’ 3వ టెస్టులో ఇంగ్లండ్‌ను సెంచరీతో గెలిపించిన ఆల్‌రౌండర్ –స్పోర్ట్స్‌లో



**మీ ‘ఫిక్స్‌డ్’ భద్రమేనా?**

సంక్షోభాలు వెలుగు చూస్తున్న పరిస్థితుల్లో మీ డిపాజిట్ సురక్షితంగా ఉన్నట్టేనా? –బిజినెస్‌లో

# చరిత్ర సృష్టించిన పీవీ సింధు...

**ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్ టైటిల్ సొంతం**


**ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలు** -స్పోర్ట్స్‌లో

గతంలో ఏ భారతీయ బ్యాడ్మింటన్ ప్లేయర్‌కు సాధ్యంకాని ఘనతను తెలుగు తేజం పూసర్ల వెంకట (పీవీ) సింధు సాధించింది. నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెరదించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించింది. స్విట్జర్లాండ్‌లో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ సింధు 21–7, 21–7తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, మాజీ విశ్వవిజేత నొజోమి ఒకుహారా (జపాన్)పై గెలిచింది. ఓవరాల్‌గా ప్రపంచ చాంపియన్ షిప్ చరిత్రలో సింధుకిది ఐదో పతకం. గతంలో ఆమె రెండు రజతాలు (2017, 2018), రెండు కాంస్యాలు (2013, 2014) సాధించింది. తాజా ప్రదర్శనతో సింధు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అత్యధికంగా ఐదు పతకాలు గెలిచిన ప్లేయర్‌గా జాంగ్ నింగ్ (చైనా) పేరిట ఉన్న రికార్డును సమం చేసింది.

**10** ప్రపంచ చాంపియన్ షిప్ చరిత్రలో భారత్ సాధించిన పతకాల సంఖ్య. ఈ పతకాల్లో ఐదు సింధునే గెలవడం విశేషం.

**5** ఓవరాల్‌గా ప్రపంచ చాంపియన్ చరిత్రలో సింధుకిది ఐదో పతకం.

**2** గతంలో రెండు రజతాలు, రెండు కాంస్యాలు..





## పంట లెక్కలకు శాటిలైట్ సాయం

- పంటల అంచనాకు ఉపగ్రహ చిత్రాలు
- జిల్లా స్థాయిలో పంటల విస్తీర్ణం, పరిస్థితి, దిగుబడి మదింపు
- శాటిలైట్ డేటా, ఏఐ ఆధారంగా పంట నష్టం అంచనా
- ఈ ఏడాది అమలు చేయాలని రాష్ట్రానికి కేంద్రం మార్గదర్శకాలు
- సకాలంలో పరిహారం ఇవ్వకపోతే 12% వడ్డీ చెల్లించాలని బీమా కంపెనీలకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రైతుల పంటలను అంచనా వేసేందుకు ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యవసాయశాఖను ఆదేశించింది. జిల్లా స్థాయిలో పంటల విస్తీర్ణం, వాటి పరిస్థితి, దిగుబడిని అంచనా వేయడానికి ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించాలని పేర్కొంది. తద్వారా వ్యవసాయ ఉత్పాదకత, వాతావరణ పరిస్థితులను అంచనా వేయొచ్చని సూచించింది. జియో–ఇన్ఫర్మేటిక్స్ ద్వారా పప్పుధాన్యాలు, ఉద్యాన పంటలు పెరిగే అవకాశం ఉన్న ప్రాంతాన్ని అంచనా వేయాలని, కరువు అంచనా కోసం ఉపగ్రహ డేటాను ఉపయోగించాలని కేంద్రం నిర్ణయించింది. మరోవైపు ప్రధానమంత్రి

మిగతా 2వ పేజీలో ▶

# ఈ-గురువులు

## నెట్టింట్లోకి మారిన క్లాస్‌రూమ్ అడ్రస్

- వెబ్‌సైట్‌లనుంచి యాప్‌లకు ప్రైవేటు సంస్థల ముందడుగు
- ఆన్‌లైన్‌లో చదువులు.. భారీగానే ఫీజులు
- పిల్లలకోసం ఎంతైనా ఖర్చుచేస్తామంటున్న తల్లిదండ్రులు
- సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ ప్రకారం వీడియో పాఠాలు
- ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు లెర్నింగ్ యాప్‌లతో విద్య
- ఆఫర్లతో మార్కెట్లో పలు ఈ–లెర్నింగ్ సంస్థల మధ్య తీవ్రమైన పోటీ

**24/7** ఆన్‌లైన్ మానిటరింగ్.. సందేహాల నివృత్తికి కాల్‌సెంటర్లు



సాక్షి, హైదరాబాద్

చదువు కొత్తపుంతలు తొక్కుతోంది. నిన్నటివరకు స్కూలు నుంచి ఇంటికొచ్చాక ట్యూషన్లు, హోంవర్క్‌లతో చిన్నారులను తల్లిదండ్రులు బిజీగా ఉంచేవారు. కానీ ఇప్పుడు ఆ ‘బిజీ’నెస్ కాస్త రూటు మారింది. చదువులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించుకొని ‘ఆన్‌లైన్’గా మారిపోయాయి. ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్స్‌కు దీటుగా.. ప్రైవేట్ వెబ్‌సైట్లు ఆన్‌లైన్ సేవలకు సిద్ధమయ్యాయి. లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా.. మొబైల్ యాప్‌లను రూపొందించాయి. తమ యాప్ బాగుంటుందంటే తమ యాప్ ఎక్కువ ఉపయోగకరమంటూ పోటీ పడుతున్నాయి. ఇలా పదుల సంఖ్యలో అందుబాటులోకి వచ్చిన లెర్నింగ్ యాప్‌లలో దేన్ని కొనుగోలుచేయాలో తెలియక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. పదులు, వందల రూపాయల లెవల్ దాటి.. ఒక్కో తరగతికి వేల రూపాయల డబ్బు వసూలు చేస్తున్నారు. అయినా.. పిల్లల చదువులకోసం ఏమైనా చేయాల్సిందేనంటూ తల్లిదండ్రులు ఆ మొత్తాన్ని వెచ్చిస్తున్నారు. సాధారణ స్కూళ్లలో ఫీజుల కంటే ఎక్కువైనా భరించేందుకు సిద్ధపడుతున్నారు.

**మార్కెట్లో ఎన్నెన్నో యాప్‌లు**

ఆన్‌లైన్ లెర్నింగ్ క్లాసులను అందిస్తున్న సంస్థలు మార్కెట్లో చాలానే వచ్చేశాయి. టాపర్, బైజూస్, టాపర్ లెర్నింగ్, మెరిట్ నేషన్, ప్లాన్సెస్,

మిగతా 2వ పేజీలో ▶

# మీ కోసమే బహ్రెయిన్‌కు

- ప్రవాస భారతీయులతో ప్రధాని నరేంద్ర మోదీ
- 250 మంది భారతీయ ఖైదీలను విడుదల చేసిన బహ్రెయిన్
- జీ7 సదస్సు కోసం ఫ్రాన్స్‌కు మోదీ



బహ్రెయిన్ మనామాలోని శ్రీకృష్ణ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

➤ బహ్రెయిన్ అభివృద్ధికి ప్రవాస భారతీయులు చేసిన కృషిపై అభినందనలను వింటే తన మనసు సంతోషంతో పొంగిపోతుందని ప్రధాని మోదీ అన్నారు. బహ్రెయిన్‌లోని ప్రవాస భారతీయుల శ్రమను మోదీ ప్రశంసించారు. బహ్రెయిన్‌లో పనిచేస్తున్న భారతీయులను ఉద్దేశించి మోదీ బహ్రెయిన్ జాతీయ స్టేడియంలో ప్రసంగించారు. -వివరాలు 5లో

## ప్లాస్టిక్‌పై పోరాడదాం

**మన్‌కీబాత్‌లో మోదీ పిలుపు**

-వివరాలు 5లో

## జైట్లీకి కన్నీటి వీడ్కోలు



- బీజేపీ దిగ్గజ నేత, కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీకి వేలాది మంది అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీ యమునా తీరంలోని నిగమ్‌బోధ్ శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో జరిగిన అంత్యక్రియల్లో వేలాది మంది పాల్గొన్నారు.

- వివరాలు 5లో

## బీజేపీ, ఆరెస్సెస్‌కు అడ్డుకట్ట వేద్దాం!



- కేడర్‌ను మిలటరీగా మార్చేందుకు సంఘ్ ప్రయత్నం
- లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తులు ఏకమవ్వాల్సిన తరుణమిదే
- కాంగ్రెస్ కూడా తన విధానాలు మార్చుకోవాలి
- ‘సాక్షి’ ప్రత్యేక ఇంటర్వ్యూలో సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా

-వివరాలు 14లో

## 25 రోజుల్లోనే 865 టీఎంసీలు

- పదేళ్ల తర్వాత శ్రీశైలానికి గరిష్ట వరద ప్రవాహం.. నాగార్జున సాగర్‌కు 569 టీఎంసీలు సైతం రికార్డే
- వచ్చే 3 నెలలూ కృష్ణా బేసిన్‌లో వర్షాలు కురిసే అవకాశం
- అక్టోబర్‌లో కృష్ణా ప్రాజెక్టుల పరిధిలో తుపానుల ప్రభావం కూడా..
- ఈ లెక్కన శ్రీశైలంలో వరద 1,000 టీఎంసీలు దాటడం ఖాయమే
- కృష్ణాలో ఈ ఏడాది సముద్రంపాలైన నీరు 343 టీఎంసీలు...



-వివరాలు 2లో



## కశ్మీర్‌లో మువ్వన్నెల రెపరెపలు..

- రాష్ట్ర సచివాలయ భవనంపై ఉన్న జమ్మూ కశ్మీర్ రాష్ట్ర జెండాను అధికారులు ఆదివారం తొలగించారు. ఆర్టికల్ 370 రద్దు పూర్తయ్యి మూడు వారాలు అవుతున్న క్రమంలో దీన్ని తొలగించడం గమనార్హం. వాస్తవానికి జమ్మూకశ్మీర్ జెండాను అక్టోబర్ 31న తొలగించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ముందుగానే తొలగించారు. - వివరాలు 5లో















నిజమే! వాళ్లు వెళ్లగొట్టేదాకా ఎందుకు సార్!

## ఫోర్ ఇన్ వన్



గుండె జబ్బుల బారిన పడితే.. రోజుకు మూడు నాలుగు మాత్రలు వేసుకోవడం తప్పని సరి. అలా మందులు వేసుకుంటూ ఉండాల్సిందే. దీనికి బదులు ఒకే ఒక్క మాత్ర వేసుకుంటే సరిపోతుందంటున్నారు ఇరాన్, బ్రిటన్‌లకు చెందిన శాస్త్రవేత్తలు. గుండెజబ్బులున్న వారు తీసుకోవాల్సిన అన్ని మందులను ఒకే క్యాప్సూల్‌లో చేర్చి (పాలీపిల్) ఇవ్వడం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడం అలవాటవుతుందని 2001లోనే నిపుణులు అభిప్రాయపడినా..దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. కానీ, ఈ శాస్త్రవేత్తలు దీనిపై అధ్యయనం జరిపారు. కొలెస్ట్రాల్‌ను తగ్గించే అటోర్వాస్టాటిన్‌కు రక్తపోటును నియంత్రించే రెండు మందుల్ని కలిపి ఒక క్యాప్సూల్‌గా మార్చారు. ఇరాన్‌లోని 236 గ్రామాల నుంచి సుమారు 6,841 మందిని ఎంపిక చేసి కొంతమందికి ఈ క్యాప్సూల్‌ను, ఇతరులకు మామూ లు మందులను అందించారు. ఐదేళ్ల తర్వాత పరిశీలించినప్పుడు మందులు తీసుకున్న వారికి గుండెజబ్బు వచ్చే అవకాశం 33% వరకూ తగ్గింది. కొత్త క్యాప్సూల్ తీసుకున్న వారిలో 202 మంది గుండెపోటుకు గురికాగా.. తీసుకోని వారిలో ఈ సంఖ్య 301గా ఉంది. మూడింటిని కలిపిన క్యాప్సూల్స్ ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.

## నిజంగా ఉక్కు గుండెనే..



ఫొటోలో కనిపిస్తున్నది బైవికార్ అనే ప్రైవేట్ కంపెనీ తయారు చేసిన కృత్రిమ గుండె. ఇలాంటివి ఇప్పటికే బోలెడు చూశామంటున్నారా? కానీ దీనికి చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. అన్నింటికంటే ముందుగా చెప్పుకోవాల్సింది ఈ ఉక్కు గుండెలో మ్యాగ్‌లెవ్ రైళ్లలో వాడే టెక్నాలజీని వాడటం. అయస్కాంత శక్తి కారణంగా తేలుతూ ఉండే ఓ పట్టీ వేగంగా తిరుగుతూ రక్తాన్ని పంప్ చేస్తుంటుంది ఇందులో.. కేవలం 650 గ్రాముల బరువు మాత్రమే ఉండటం.. అవసరమైన శక్తిని బ్యాటరీల ద్వారా అందించే ఏర్పాట్లు ఉండటం వల్ల దీన్ని వేసుకుని దైనందిన కార్యక్రమాలను భేషుగ్గా కొనసాగించొచ్చు. కవాటాలు, జఠరికల వంటి భాగాలేవీ లేకపోవడం వల్ల ఈ కృత్రిమ గుండెను ధరించే వారికి నాడి కొట్టుకోదు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ కృత్రిమ గుండెను ఓ ఆవుకు అమర్చి పరీక్షించగా అది 90 రోజుల పాటు బతికించింది. అన్నీ సవ్యంగా సాగితే వచ్చే ఏడాది దీన్ని మానవులపైనా ప్రయోగించే అవకాశాలు ఉన్నాయి. కొసమెరుపు ఏంటంటే.. ఇది అసలు గుండెకు పూర్తి ప్రత్యామ్నాయం కాకపోవడం. కానీ.. అవయవదానం రూపంలో ఎవరో ఒకరు గుండెను ఇచ్చేంతవరకు దీన్ని వాడుకోవచ్చన్న మాట.

## రూ.800కే ఏసీ..!



ఏసీ ఇప్పటికీ చాలామందికి ఖరీదైన వ్యవహారమే. అయితే ఇకపై ఏసీల కోసం అంత ఖర్చు చేయాల్సిన అవసరం లేదంటున్నారు మనోజ్ పటేల్. గుజరాత్‌లోని వడోదరలో తన పేరుతోనే ఓ డిజైన్ స్టూడియో నిర్వహిస్తున్న ఈ వ్యక్తి.. రూ.800తోనే ఏసీ తయారు చేశారు. ఒక్కసారి మట్టికుండలోని నీటి చల్లదనాన్ని గుర్తు చేసుకోండి. మట్టిలోని అతిసూక్ష్మ రంధ్రాల గుండా వెళ్లే నీరు ఆవిరి కావడం చల్లదనానికి కారణమని తెలిసిన విషయమే. సరిగ్గా ఇదే ఆలోచనతోనే మనోజ్ పటే చిన్నసైజు ఏసీ తయారు చేశారు. కాకపోతే ఇందులో మట్టికి బదులుగా పింగాణీ ఉపయోగిస్తారు. ప్రస్తుతం మనోజ్ పటేల్ మూడు మోడళ్ల ఏసీని తయారు చేశారు. ఒక దాంట్లో పైన ట్యాంకులోని నీటి మోతాదును చెప్పేందుకు ఓ సూచికతో పాటు ఓ మొక్క పెంచేందుకు ఏర్పాట్లు ఉంటాయి. ఆఫీసులు, ఇళ్లల్లో వాడుకోగల వ్యక్తిగత ఏసీ మూడోది. గది ఉష్ణోగ్రతలను 32 డిగ్రీల నుంచి 23 డిగ్రీల స్థాయికి తీసుకు రాగల ఈ ఏసీలకు విద్యుత్ అవసరమే ఉండదు. వ్యక్తిగత పింగాణీ ఏసీలో మాత్రం ఒక ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఉంటుంది. పైగా ట్యాంకును ఒకసారి నింపితే 10–12 రోజుల వరకు ఆ నీటినే వాడుకోవచ్చు. పింగాణీ, రాళ్లు, మట్టి మాత్రమే వాడటం వల్ల ఖర్చు తక్కువగా ఉంటుందంటున్నారు మనోజ్.

## క్లుప్తంగా...

### డాక్టర్లకు జియో ట్యాగ్ అమలుచేయబోం

**ప్రభుత్వ వైద్యులకు ఈటల హామీ**

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ దవాఖానాల్లో పనిచేస్తున్న ఆయుష్ డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్ నమోదుకు జియో ట్యాగింగ్ అమలు చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. ఈమేరకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తమకు హామీ ఇచ్చినట్లు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (ప్రజారోగ్య విభాగం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై తాము మంత్రిని కలిసి విన్నవించినట్లు చెప్పారు. వెంటనే ఆయుష్ ఉన్నతాధికారులకు సోమవారం ఆదేశాలు ఇస్తానని మంత్రి పేర్కొన్నారని లాలూ ప్రసాద్ వెల్లడించారు. ఆయుష్‌లో పనిచేస్తున్న స్వీపర్ల నుంచి డాక్టర్ల వరకూ ప్రతి ఒక్కరూ తమ ఫోన్‌లో అటెండెన్స్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఇది పెద్ద ఎత్తున విమర్శలకు దారితీసింది.

### 29న వీఆర్వో, వీఆర్‌ఏల సభ

**సాక్షి, హైదరాబాద్:** రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థల రద్దుకు ప్రభుత్వం మొగ్గుచూపుతోందన్న వార్తల నేపథ్యంలో భవిష్యత్ కోసం వీఆర్వో, వీఆర్‌ఏ సంఘాలు దారులు వెతుక్కుంటున్నాయి. ఈ మేరకు ఆదివారం పలు వీఆర్వో, వీఆర్‌ఏ సంఘాల నేతలు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. రెవెన్యూ శాఖ నుంచి తాము ఇతర శాఖల్లోకి వెళ్లాల్సి వస్తే సర్వీసు రూల్సు, పదోన్నతుల సంగతేంటన్న దానిపై సమావేశంలో చర్చించారు. అనంతరం ఈనెల 29న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'రెవెన్యూ శాఖను కాపాడండి.. ఇతర శాఖల్లో విలీనాన్ని ఆపండి'అనే నినాదంతో రెవెన్యూ ఉద్యోగుల సభ నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించారు. సమావేశంలో పలు వీఆర్వో, వీఆర్‌ఏ సంఘాల నేతలు ఉపేందర్ రావు, లక్ష్మీనారాయణ, సుధాకర్‌రావు, విజయ రామారావు, సుదర్శన్, వంగూరి రాములు, ఇంజమూరి ఈశ్వర్, ఉమామహేశ్వర్, రాములు, నాగేశ్వర్, కృష్ణ, వెంకటేశ్, గోవర్ధనాచారి, లక్ష్మీనర్సింహ, బాలనర్సయ్య పాల్గొన్నారు.

### ఐపీసీసీ, సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ ప్రభంజనం

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) శనివారం ప్రకటించిన సీఏ–ఐపీసీసీ, సీఎంఏ పరీక్ష ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల విద్యార్థులు అఖిల భారత స్థాయిలో 1వ ర్యాంకుతో పాటు మొత్తం 19 ర్యాంకులను కైవసం చేసుకుని తిరుగులేని విజయాన్ని నమోదు చేశారని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మోహన్ మాట్లాడుతూ సీఏ–ఐపీసీసీ ఫలితాల్లో షేక్ చాంద్‌బాషా అఖిల భారత స్థాయిలో 6వ ర్యాంకు, గోగుల భార్గవి 28వ ర్యాంకు సాధించారని తెలిపారు. కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ కోర్సు (సీఎంఏ) ఇంటర్ ఫలితాల్లో ఇ.మహేంద్రారెడ్డి 1వ ర్యాంకు, జి.నాగేశ్వర ఇంద్రజ్ 10వ ర్యాంకు, కె.ప్రసాద్ 13, కె.వెంకట నాగ రోహిత్ 18, పి.ప్రసన్నలక్ష్మి 21, కె.సాయి నవీన్ 31, ఇ.నరేష్‌బాబు 32, ఎన్.శ్రీవల్లిక 33, డి.వంశీకృష్ణ 40, బి.వసంతలక్ష్మి 43వ ర్యాంకు పొందారని పేర్కొన్నారు. సీఎంఏ ఫైనల్‌లో జి.రాహుల్ 10వ ర్యాంకు, టి.బాలాజీ సాయి పవన్‌రెడ్డి 16, కె.రాజీ 22, పి.సౌభాగ్య 36, పి.ఎం.వి.రమ్యశ్రీ 46, ఎస్.రాజశేఖర్ 47, ఒ.కుమార స్వామి 50వ ర్యాంకు సాధించారని చెప్పారు. వీరితో పాటు రెండు వేల మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.


### 13వేల అడుగుల ఎత్తులో డిగ్రీ పట్టాలు

**హెమిస్ (లేహ్–లదాఖ్):** నరోపా ఫెలోషిప్‌కు చెందిన 52 మంది లేహ్–లదాఖ్‌లోని ప్రాచీన బౌద్ధాలయంలో డిగ్రీ పట్టా అందుకున్నారు. 17వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం సముద్ర మట్టం నుంచి 13వేల అడుగులో ఉండటం గమనార్హం. హెమిస్‌లోని ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి లదాఖ్ ఎంపీ జంయాంగ్ తెరింగ్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ గ్యాల్ వంగ్యాల్‌లు అతిథులుగా హాజరయ్యారు. నలందా విశ్వవిద్యాలయానికి చెందిన విద్యావేత్త నరోపా పేరునే ఈ ఫెలోషిప్‌కు పెట్టినట్లు వెల్లడించారు.

# వెలికితీతే.. శాపమైంది!

- ఫణిగిరి తవ్వకాల్లో వెలుగుచూసిన అరుదైన సున్నం విగ్రహం
- ప్రస్తుతం గాలిలో తేమ పీల్చుకుని శిథిలమవుతున్న వైనం
- సంరక్షణ చర్యలు లేకపోవటంతో పొడిగా మారుతోంది
- దానికి పూర్వపు రూపమిచ్చే నిపుణులు ఏఎస్‌ఐలో సిద్ధం
- హెరిటేజ్ తెలంగాణకు పూర్తిస్థాయి అధికారి లేకపోవటంతో నిర్లక్ష్యం






ఫణిగిరిలో ఏప్రిల్‌లో తవ్వకాలు జరిపి గుర్తించినప్పటి చిత్రం

**సాక్షి, హైదరాబాద్:** దేశంలోనే అత్యంత అరుదైన గార (డంగుసున్నంతో రూపొందిన) శిల్పం ఇప్పుడు వాతావరణ ప్రభావానికి గురై ముక్కలు ముక్కలుగా విడిపోయి శిథిలమవుతోంది... వందల ఏళ్లుగా భూగర్భంలో సురక్షితంగా ఉన్న ఆ ప్రతిమ, తవ్వకాల్లో వెలుగు చూశాక ఇప్పుడు రూపుకోల్పోతోంది. దాదాపు ఆరు అడుగుల పొడవున్న ఈ బోధిసత్వుడి విగ్రహం ఇక్ష్వాకుల కాలంలో క్రీ.శ. మూడో శతాబ్దంలో రూపొందినట్టుగా పురావస్తుశాఖ అధికారులు భావిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ఉన్న విఖ్యాత బౌద్ధ స్థూప కేంద్రమైన ఫణిగిరిలో గత ఏప్రిల్‌లో ఇది బయటపడింది. అప్పటికే పగుళ్లు ఏర్పడి కొంతభాగం ముక్కలైన ఈ శిల్పాన్ని తవ్వకాల సమయంలో అధికారులు సురక్షితంగా వెలికి తీసి నగరంలో ఉన్న పురావస్తుశాఖ డైరెక్టరేట్‌కు తరలించారు. ఇది డంగు సున్నంతో రూపొందిన విగ్రహం కావటం, తయారై దాదాపు 1700 సంవత్సరాలు కావస్తుండటంతో దానికి వెంటనే సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే ప్రస్తుతం వానా కాలం కావటంతో గాలిలో అధికంగా ఉండే తేమను పీల్చుకుని అది వేగంగా శిథిలమవుతోంది. మరికొంతకాలం ఇలాగే ఉంటే అది ముక్కలుముక్కలై ఆనవాళ్లు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. ఈలోపే దాన్ని సంరక్షించి తేమ చొరబడకుండా గాజు పెట్టెలో భద్రపరచాల్సి ఉంది. కానీ అవేమీ లేకుండా, డైరెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ల్యాబ్‌లో ఓ బల్లపై ఉంచి గదికి తాళం వేసేశారు. నెలలు గడుస్తుండటంతో అది వేగంగా దెబ్బతింటోంది.

**నిపుణులు సిద్ధంగా ఉన్నా....**

దాదాపు 1700 ఏళ్లక్రితం ఆ విగ్రహం రూపొందిందని స్థల చరిత్ర ఆధారంగా అధికారులు అప్పట్లో గుర్తించారు. ఫణిగిరి బౌద్ధక్షేత్రం కావటంతో ఈ ప్రతిమ కూడా బుద్ధుడిదే అయి ఉంటుందని తొలుత భావించారు. కానీ విగ్రహంపైన ఆభరణాల గుర్తులున్నాయి. దీంతో అది ఓ రాజుదిగా తేల్చారు. బుద్ధుడి జాతక కథల్లో ఉండే బోధిసత్వుడిదిగా ప్రాథమికంగా తేల్చారు. గతంలో బోధిసత్వుడికి సంబంధించి రెండుమూడు అడుగుల ఎత్తున్న గార ప్రతిమలు వెలుగు చూశాయి. కానీ ఆరు అడుగులకంటే ఎత్తున్న సున్నం విగ్రహం ఇప్పటివరకు దేశంలో ఎక్కడా బయటపడలేదు. దీంతో ఇది చాలా అరుదైందిగా అధికారులు గుర్తించారు. విగ్రహంపై అలంకరణకు సంబంధించి కొన్ని ఆనవాళ్లు స్పష్టంగా ఉన్నాయి, ఒక చేయి, కొంతభాగం కాళ్లు ఉన్నాయి. ఆ ఆకృతి ఆధారంగా విగ్రహానికి పూర్తి రూపు ఇవ్వగలిగే నిపుణులు ఢిల్లీ, ముంబై, పుణేల్లో ఉన్నారు. కేంద్ర పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్‌ఐ)లో కూడా ఇలాంటి నిపుణులున్నారు. వారిని పిలిపిస్తే విగ్రహంపై ప్రస్తుతానికి మిగిలిన ఆనవాళ్ల ఆధారంగా అదే డంగు సున్నం మిశ్రమంతో దాని పూర్వపు రూపాన్ని సృష్టిస్తారు. ఆ తర్వాత ప్రత్యేక పద్ధతిలో దాన్ని గాలి చొరబడని గాజు పెట్టెలో భద్రపరిస్తే భావితరాలకు అందించే వీలుంటుంది. కానీ ఆ కసరత్తు లేకుండా పురావస్తుశాఖ విగ్రహాన్ని గాలికొదిలేసింది. విగ్రహాన్ని వెలికితీసే సమయంలో హెరిటేజ్ తెలంగాణ (పురావస్తుశాఖ)కు పూర్తిస్థాయి డైరెక్టర్ లేరు. అప్పటివరకు ఉన్న డైరెక్టర్ విశాలాచ్చి మాతృశాఖ అయిన పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లటంతో పర్యాటక శాఖలో ఉన్న సునీతా భగవత్‌ను ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమించారు. విగ్రహాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఆ తర్వాత కొంతకాలానికి ఆమె సెలవులో వెళ్లటంతో క్రీడాప్రాధికార సంస్థ డైరెక్టర్‌కు అదనపు బాధ్యత అప్పగించారు. ఇలా అదనపు బాధ్యతలో తాత్కాలిక అధికారులు ఇన్‌చార్జిగా ఉండటంతో దానిపై నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి సూచనలు, ఆదేశాలు లేకపోవటంతో వారు పట్టించుకోలేదు. ఇలా నెలల తరబడి నిర్లక్ష్యం కారణంగా సున్నపు విగ్రహం తేమను పీల్చుకుంటూ శిథిలమవుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇలాంటి అరుదైన విగ్రహాలు ధ్వంసమైతే భావితరాలకు చరిత్ర తెలియకుండా పోతుందని అంటున్నారు. ఆ విగ్రహాల ఆధారంగా నాటి చరిత్రలో కొత్త కోణాలను పరిశోధకులు గుర్తించే అవకాశం కూడా గల్లంతవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





## 25 రోజుల్లోనే 865 టీఎంసీలు

- పదేళ్ల తర్వాత శ్రీశైలానికి గరిష్ట వరద ప్రవాహం
- కృష్ణాలో ఈ ఏడాది కడలిపాలైన నీరు 343 టీఎంసీలు

**సాక్షి, హైదరాబాద్:** కృష్ణా బేసిన్‌లో ఈ ఏడాది శ్రీశైలం ప్రాజెక్టుకు రికార్డు స్థాయిలో వరద పోటెత్తింది. పదేళ్ల తర్వాత అంతటి వరద కేవలం 25 రోజుల్లోనే శ్రీశైలాన్ని చేరింది. 2010–11లో 1,024 టీఎంసీల మేర వరద రాగా ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు కేవలం ఈ నెలలోనే 865 టీఎంసీల మేర వరద వచ్చింది. అయితే కృష్ణా బేసిన్‌లో సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు సైతం వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. దీనికితోడు అక్టోబర్‌లో తుపానుల ప్రభావం సైతం ఎక్కువగా కృష్ణా బేసిన్ ప్రాజెక్టులపై ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుంటే శ్రీశైలంలో ఈ ఏడాది వరద వెయ్యి టీఎంసీల మార్కును దాటడం ఖాయంగా కనిపిస్తోంది. శ్రీశైలం నుంచి విడుదల చేసిన నీటిలో ఈ ఏడాది సాగర్‌కు 569 టీఎంసీల మేర నీరు చేరింది. ఇది సైతం ఈ పదేళ్ల కాలంలో ఇదే గరిష్టం. ఇక ఈ ఒక్క నెలలోనే 343 టీఎంసీల మేర నీరు సముద్రంలో కలిసింది. 2013–14లో 399 టీఎంసీల నీరు సముద్రంలో కలవగా ఆరేళ్ల తర్వాత ఇప్పుడే అంతమేర నీరు సముద్రానికి చేరింది. 2017–18లో సున్నా, 2018–19లో 39 టీఎంసీల మేర సముద్రంలో కలిసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇక ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టుల్లోకి వరద పూర్తిగా తగ్గుముఖం పట్టింది. మళ్లీ వర్షాలు కురిస్తేనే వరద మొదలు కానుంది. ఇక గోదావరి పరిధిలో ఇప్పటివరకు 1685 టీఎంసీల మేర నీరు సముద్రంలోకి వెళ్లినట్లు కేంద్ర జల సంఘం రికార్డులు చెబుతున్నాయి.

# పంట లెక్కలకు శాటిలైట్ సాయం

▶ మొదటి పేజీ తరువాయి



ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద రైతులకు పంట నష్టపరిహారం పొందడానికి అనేక సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ఆయా వివాదాలను పరిష్కరించడానికి కేవలం క్షేత్రస్థాయి పరిశీలనపైనే ఆధారపడుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో పరిహారం అందడంలో ఆలస్యమవుతోంది. పైగా నష్టం అంచనాలు సకాలంలో జరగడంలేదు. వాటిని ఉపగ్రహ చిత్రాల ద్వారా అంచనా వేయాలనేది ప్రధాన ఉద్దేశం. రైతుల వాదనల పరిష్కారానికి సమయ వ్యవధిని తగ్గించడానికి మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కేంద్ర వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఇప్పటికే కేంద్ర వ్యవసాయశాఖ, పీఎంఎఫ్‌బీవై కింద వివిధ రాష్ట్రాల్లో పంట కోత ప్రయోగాలకు ప్రత్యామ్నాయంగా పరిజ్ఞానాన్ని ఉపయోగించేలా పైలట్ అధ్యయనాలు చేయడానికి 8 ఏజెన్సీలకు ఇప్పటికే బాధ్యత అప్పగించారు. దిగుబడి అంచనా కోసం బీమా యూనిట్ స్థాయికి అవసరమైన పంట కోత ప్రయోగాల సంఖ్యను తగ్గించడానికి శాటిలైట్ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మోడలింగ్ టూల్స్ మొదలైన సాంకేతిక పరిజ్ఞాన అధ్యయనాలను ఉపయోగించాలనేది సర్కారు ఉద్దేశం.

**బీమా పరిహారం ఆలస్యమైతే కంపెనీలకు జరిమానా...**

మెరుగైన సేవలు, జవాబుదారీతనం, రైతులకు క్లెయిమ్‌లను సకాలంలో చెల్లించడం కోసం పీఎంఎఫ్‌బీవై పథకానికి కేంద్ర ప్రభుత్వం అనేక సవరణలు చేసింది. గత రబీ సీజన్ నుంచి క్లెయిమ్‌ల చెల్లింపు కోసం నిర్దేశించిన గడువు తేదీకి 10 రోజులకు మించి సెటిల్మెంట్ చేయకపోతే బీమా కంపెనీ రైతులకు ఏడాదికి 12 శాతం వడ్డీ చెల్లించాలని పేర్కొంది. అయితే ప్రస్తుతం రబీ సీజన్‌కు క్లెయిమ్‌ల పరిష్కారం జరుగుతున్నందున జరిమానా వ్యవహారాన్ని కంపెనీలు తోసిపుచ్చుతున్నట్లు కేంద్రం భావిస్తోంది. ఆ ప్రక్రియపై రాష్ట్రం దృష్టిసారించాలని సూచించింది. నెలలు, ఏళ్ల తరబడి పంటల బీమా క్లెయిమ్స్ సెటిల్ చేయకుండా బీమా కంపెనీలు రైతులను ఏడిపించే పరిస్థితికి కేంద్రం చెక్ పెట్టింది. క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ చేయడంలో ఆలస్యం చేస్తే బీమా కంపెనీలతోపాటు సంబంధిత రాష్ట్రాలకు జరిమానా విధించాలని కూడా కేంద్రం స్పష్టం చేసింది. అలాగే కంపెనీల విన్నపం మేరకు తన వాటా సబ్సిడీ సొమ్ము చెల్లించడంలో మూడు నెలలకు మించితే రాష్ట్రాలు 12 శాతం వడ్డీ చెల్లించాలని స్పష్టం చేసింది. అలాగే రైతులకు సక్రమంగా బీమా సేవలు అందించడంలో విఫలమయ్యే కంపెనీలను రద్దు చేయాలని కూడా కేంద్రం ఆదేశించింది. కానీ ఇప్పటికీ ఈ జరిమానాల వ్యవహారంపై రాష్ట్రాలు అంతగా శ్రద్ధ వహించడంలేదని కేంద్రం భావిస్తోంది.

## 'మావోయిస్టు' ప్రాంతాలపై నేడు కేంద్రం సమీక్ష

**సాక్షి, హైదరాబాద్:** దేశంలోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో పరిస్థితిని బేరీజు వేసేందుకు కేంద్రం సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సోమవారం న్యూఢిల్లీలో హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలతోపాటు తెలంగాణ కూడా పాల్గొననుంది. ఈ భేటీకి హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్ రెడ్డి హాజరుకానున్నారు. భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మంచిర్యాల జిల్లాల్లో కొంతకాలంగా మావోయిస్టులు ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. 22 రోజుల్లో ఇద్దరు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో హతమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## సన్‌షైన్‌లో చేరిన గవర్నర్ సతీమణి

**సాక్షి, సిటీబ్యూరో:** కొంతకాలంగా తీవ్రమైన మోకాలి నొప్పులతో బాధపడుతున్న గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ సతీమణి విమలా నరసింహన్ చికిత్స కోసం ఆదివారం సన్‌సైన్ ఆస్పత్రిలో చేరారు. వయసు రీత్యా మోకాలి చిప్పల్లో ఏర్పడిన అరుగుదల కారణంగా ఆమె తీవ్రనొప్పితో బాధపడుతున్నారు. డాక్టర్ గురువారెడ్డి పర్యవేక్షణలో సోమవారం ఉదయం చికిత్స చేయనున్నారు.

# ఈ–గురువులు

▶ మొదటి పేజీ తరువాయి




ఆకాష్ ట్యూటర్, ఎమ్‌బూబ్, మహేష్ ట్యుటోరియల్స్, రెజొనెన్స్, అలైన్, హోమ్ రివైజ్ వంటి ప్రముఖ సంస్థలు తమ ఆన్‌లైన్ లెర్నింగ్ యాప్‌లను అందుబాటులోకి తెచ్చాయి. అందులో చాలా వరకు సంస్థలు ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు లెర్నింగ్ యాప్‌లను అందుబాటులోకి తీసుకురాగా, మరికొన్ని సంస్థలు పోటీ పరీక్షల ప్రత్యేక యాప్‌లను రూపొందించాయి. 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈ, రాష్ట్ర బోర్డుల సిలబస్ ప్రకారం ఆన్‌లైన్ పాఠాలను రూపొందించి అందుబాటులోకి తెచ్చాయి. కొన్ని సంస్థలు కామర్స్ సంబంధిత చదువులను ఆన్‌లైన్‌లో అందిస్తుండగా, ఇంకొన్ని సంస్థలు ఐఐటీ బేస్డ్ చదువులను అందిస్తున్నాయి. ఈ క్రమంలో ఐఐటీ, నీట్ బేస్డ్‌గా వచ్చిన ఈ–లెర్నింగ్ సంస్థల యాప్‌ల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ సంస్థలు పెద్ద ఎత్తున నిధులను వెచ్చించి మరీ మార్కెటింగ్ చేస్తున్నాయి.

**పాఠాలే కాదు.. డౌట్స్ కూడా చెబుతారు!**

విద్యార్థులకు ఆన్‌లైన్ చదువులు లక్ష్యంగా ప్రతి సంస్థ వీడియో పాఠాలను అందుబాటులోకి తెచ్చింది. త్రీడీ, యానిమేషన్ మేళవించి రూపొందించిన పాఠాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించాయి. అంతేకాకుండా విద్యార్థుల పరిసరాల్లోని పరిస్థితులతో పాఠ్యాంశాలను అన్వయించి అందించే బోధనతో కూడిన వీడియో పాఠాలను అందుబాటులోకి తెచ్చాయి. విద్యార్థులకు అర్థం కాకపోతే.. ఆన్‌లైన్‌లో నివృత్తి చేసేందుకు 24 గంటలు పనిచేసే కాలింగ్ సదుపాయం కల్పించాయి. కొన్ని సంస్థలైతే ఏకంగా ఆన్‌లైన్‌లోనే సందేహాలను నివృత్తి చేసే చర్యలు చేపట్టాయి. విద్యార్థి తనకు అర్థంకాని ప్రాబ్లంను ఆన్‌లైన్‌లో పంపిస్తే దానికి ఆన్‌లైన్‌లోనే సమాధానం ఇచ్చేలా చర్యలు చేపట్టాయి. పోటీ పరీక్షలకు సంబంధించి పాత ప్రశ్నాపత్రాలను అందుబాటులో ఉంచుతూ.. ప్రిపేర్ అయ్యేలా చర్యలు చేపట్టడంతోపాటు కెరీర్ కౌన్సెలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశాయి. ఇంకొన్ని ఈ–లెర్నింగ్ సంస్థలైతే.. గ్రూప్‌లను క్రియేట్ చేసి ఇతరులతో గ్రూప్ డిస్కషన్‌లో పాల్గొనేలా చర్యలు చేపట్టాయి.

**స్కూల్ ఫీజుల కంటే అత్యధికంగా వసూళ్లు**

సాధారణ స్కూల్ ఫీజుల కంటే ఒక్కో తరగతికి అందించే ఆన్‌లైన్ లెర్నింగ్ సబ్‌స్క్రిప్షన్‌కు ఈ సంస్థలు భారీగా వసూలు చేస్తున్నాయి. తరగతిని బట్టి ఫీజులను నిర్ణయిస్తున్నాయి. కనీసంగా ఒక్కో తరగతికి ఒక్కో విధంగా రూ.15 వేల నుంచి రూ.35 వేల వసూలు చేస్తున్నాయి. అందులోనూ ఐఐటీ, నీట్ బేస్డ్‌గా అందించే చదువులకు రేటు ఎక్కువ. మరోవైపు 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, లేదా 12వ తరగతి వరకు ప్యాకేజీల రూపంలో స్పెషల్ సబ్‌స్క్రిప్షన్ ఇస్తున్నాయి. ఇలా అన్ని తరగతులకు తీసుకుంటే రూ.95వేల నుంచి దాదాపు రూ.1.20లక్షల వరకు తల్లిదండ్రులు చెల్లించాల్సి వస్తోంది.

**'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో కూడా..**

వీటితో పాటు పత్రికారంగంలోని ఆన్‌లైన్ యాప్‌లు కూడా విస్తృతాదరణ పొందుతున్నాయి. ఇందులో 'సాక్షి'మీడియా గ్రూప్.. **www.sakshieducation.com** వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్ కంటెంట్‌ను, వీడియో పాఠాలను విద్యార్థులకు అందిస్తోంది. ఇక్కడే ప్రాక్టీస్ టెస్ట్‌లను కూడా నిర్వహిస్తోంది. నిపుణుల సలహాలు, సూచనలు, పోటీపరీక్షలకు సిద్ధమయ్యే విధానాలు, టిప్స్‌ను ఉచితంగా అందిస్తోంది.

### బాధ్యతగా ఉండే వారికి మంచి ప్లాట్‌ఫారం



ఆన్‌లైన్ లెర్నింగ్ యాప్‌లు సెల్ఫ్ రెస్పాన్స్‌బుల్‌గా ఉండే వారికి ఎక్కువ ఉపయోగం. ప్రస్తుతం ఆన్‌లైన్ లెర్నింగ్ యాప్ సబ్‌స్క్రిప్షన్ తీసుకునే వారిలో 20% మాత్రమే సరిగ్గా వినియోగిస్తున్నారు. మిగతావారు డబ్బులు చెల్లించి వదిలేస్తున్నారు. ఆన్‌లైన్ లెర్నింగ్ కంటే క్లాస్‌రూమ్ లెర్నింగే ఎక్కువ ఎఫెక్టివ్‌గా ఉంటుంది. ఇంటరాక్షన్ ఇక్కడే ఉంటుంది. తరగతిలోని విద్యార్థుల స్థాయిని టీచర్లు అర్థం చేసుకుని వారికి సరిపోయే విధంగా మార్పులు చేస్తారు. గ్రూప్ డిస్కషన్‌కు ఇక్కడే ఎక్కువ అవకాశం ఉంది.

– వెంకట్ కంచనపల్లి, సీఈవో సన్‌టెక్

### టాపర్, బైజూస్ సంస్థల ఫీజుల వివరాలు

| తరగతి | టాపర్ అడ్వాన్స్ | టాపర్ అన్‌లిమిటెడ్ | బైజూస్ |
|---|---|---|---|
| 5 | 45వేలు | 60వేలు | 25వేలు |
| 6 | 45వేలు | 60వేలు | 25వేలు |
| 7 | 45వేలు | 60వేలు | 25వేలు |
| 8 | 45వేలు | 60వేలు | 25వేలు |
| 9 | 45వేలు | 60వేలు | 25వేలు |
| 10 | 45వేలు | 60వేలు | 25వేలు |
| 11 | 54వేలు | 72వేలు | 60వేలు (జేఈఈ, నీట్) |
| 12 | 54వేలు | 72వేలు | 60వేలు (జేఈఈ, నీట్) |



# అమ్మపై కత్తి కాసుల కక్కుర్తి

- రాష్ట్రంలో బెంబేలెత్తిస్తున్న సిజేరియన్ ప్రసవాలు
- సర్కార్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తాజా నివేదిక
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు గర్భిణీల ఆసక్తి
- ఆరు నెలలుగా 'కేసీఆర్ కిట్' నిలిచిపోవడంతో నిరాశ

నిర్మల్ జిల్లాలో **82%** ఆపరేషన్ ద్వారానే

**సాక్షి, హైదరాబాద్:** అమ్మకు కడుపుకోత తప్పడం లేదు. ప్రసవాల సందర్భంగా గర్భిణులకు సిజేరియన్ చేయడం మామూలు విషయంగా మారింది. అవసరమున్నా లేకున్నా అనేకమంది డాక్టర్లు ఇష్టారాజ్యంగా సిజేరియన్లు చేస్తుండటంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. సిజేరియన్ ఆపరేషన్లు చేసి ఆస్పత్రులు వేలకువేలు గుంజుతున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఏకంగా లక్షలకు లక్షలు లాగుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ తాజాగా ప్రభుత్వానికి పంపిన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల్లో 60 శాతం సిజేరియన్ ద్వారానే జరుగుతున్నట్లు తేలింది. అందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 44 శాతం, ప్రైవేటు ఆసుపత్రుల్లో 56 శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారానే జరిగినట్లు నిర్ధారించింది. సాధారణ పద్ధతిలో ప్రసవాలు చేయడానికి అవకాశమున్నా కడుపుకోత మిగుల్చుతున్నారు.

**నిర్మల్‌లో అధికం.. కొమురంభీం అత్యల్పం**

నిర్మల్ జిల్లాలో ఈ ఏడాది జరిగిన 7,337 ప్రసవాల్లో 6,040 (82%) సిజేరియన్ ద్వారానే జరిగినట్లు తేలింది. హైదరాబాద్‌లో ఈ ఏడాది జరిగిన 72,449 ప్రసవాల్లో 38,758 సిజేరియన్ ద్వారానే జరిగాయి. అత్యల్పంగా కొమురంభీం జిల్లాలో 22% సిజేరియన్లు జరిగాయి. అక్కడ జరిగిన 3,342 ప్రసవాల్లో 730 మాత్రమే సిజేరియన్లు జరిగాయి. ఈ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోంది.

**కాసులే పరమావధి...**

సిజేరియన్ ద్వారా బిడ్డను బయటకు తీయడం సర్వసాధారణమైంది. సాధారణ ప్రసవమా? సిజేరియన్ చేయాలా అన్నది గర్భిణీని ముందునుంచీ పరీక్షించే డాక్టర్‌కు అర్థమైపోతుంది. అత్యంత రిస్క్ కేసుల్లో మాత్రమే సిజేరియన్ అవసరమవుతుంది. నెలల ముందే దీనిపై స్పష్టత వస్తుంది. సాధారణ ప్రసవం అయితే రెండ్రోజుల్లో ఇంటికి పంపించేయవచ్చు. సిజేరియన్ అయితే వారం వరకు ఆసుపత్రిలో ఉంచుకోవచ్చు. సాధారణ ప్రసవానికి ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.25 వేలతో ముగించేయవచ్చు. సిజేరియన్ అయితే ఆసుపత్రి స్థాయిని బట్టి రూ. 50 వేల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఒక ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో రూ. 5 లక్షలు వసూలు చేస్తుండటం తెలిసిందే. కొందరు డాక్టర్లు సెంటిమెంట్‌ను కూడా క్యాష్ చేసుకుంటున్నారు. ముహూర్తం ప్రకారం సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీస్తున్నారు. సిజేరియన్ వల్ల తల్లికి మున్ముందు కొన్ని రకాల ఆరోగ్య సమస్యలొచ్చే అవకాశం ఉంటుంది.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన ప్రసవాలు**

తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకం కింద ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకునే గర్భిణులకు రూ. 12 వేల చొప్పున అందజేస్తుంది. ఆడబిడ్డ పుడితే మరో వెయ్యి అదనం. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. ప్రస్తుత నివేదిక ప్రకారం మొత్తం ప్రసవాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 57% జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగినా, ఇటీవల గర్భిణులకు ప్రోత్సాహకపు సొమ్మును అధికారులు పెండింగ్‌లో పెట్టడంతో మహిళల్లో నిరాశ నెలకొంది. దాదాపు ఆరు నెలల నుంచి ప్రోత్సాహకాలు నిలిచిపోయాయని చెబుతున్నారు. అధికారులు కూడా దీన్ని ధ్రువీకరిస్తున్నారు.

**ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు**

| ఆసుపత్రులు | ప్రసవాలు | సిజేరియన్లు |
|---|---|---|
| ప్రభుత్వ ఆసుపత్రులు | 1.71 లక్షలు | 78,877 |
| ప్రైవేటు ఆసుపత్రులు | 1.28 లక్షలు | 1,00,000 |

# హిందూ దేశంగా మార్చే ఆలోచనే!

- అందుకే ఆర్టికల్ 370 రద్దు
- తద్వారా 'ప్రత్యేక'హోదాను కోల్పోయిన జమ్మూకశ్మీర్
- సీపీఐ అగ్రనేత డి.రాజా వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా. చిత్రంలో చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ ప్రభుత్వం.. మతోన్మాద విధానాలు, ఫాసిస్ట్ ఆలోచనా ధోరణులతో భారత్‌ను హిందూదేశంగా మార్చే లక్ష్యంతోనే ఆర్టికల్ 370ను రద్దు చేసిందని సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా ధ్వజమెత్తారు. నియంతృత్వ వైఖరి, అప్రజాస్వామిక పద్ధతుల్లో విపక్షాలపై ఒత్తిడి తెచ్చి చేస్తున్న ఇలాంటి రాజకీయాలు ఇదేవిధంగా కొనసాగితే.. పార్లమెంట్ అస్తిత్వం నిరర్థకంగానే మిగిలిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద ప్రజాస్వామ్య దేశంగా భారత్ కొనసాగాల్సిన ఆవశ్యకత ఉన్నందున బీజేపీ, ఆరెస్సెస్‌లపై, మతోన్మాద, ఫాసిస్ట్ శక్తులపై వామపక్ష, ప్రజాస్వామ్యశక్తులు రాజీలేని పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రాధాన్యతలను గుర్తెరిగి ఆయా అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజాస్వామ్యశక్తులు, ప్రజలను ఏకం చేసి, సామాజిక అణచివేతలు, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఆదివారం మఖ్దూంభవన్‌లో పార్టీ అగ్రనేత ఇంద్రజిత్‌గుప్తా శతజయంతి ఉత్సవాల సందర్భంగా 'ఆర్టికల్ 370 రద్దు–కశ్మీర్ పరిణామాలు' అనే అంశంపై జరిగిన సదస్సులో రాజా ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ ప్రధాని మోదీ తప్పుడు విధానాల కారణంగా భారత్–పాకిస్తాన్‌ల మధ్య ద్వైపాక్షిక అంశంగా ఉండాల్సిన జమ్మూకశ్మీర్ సమస్య ప్రస్తుతం అంతర్జాతీయాంశంగా మారిందని విమర్శించారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ ప్రత్యేక రాష్ట్ర హోదాను కోల్పోయిందని, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోయిందని, కేంద్ర ప్రత్యక్ష పాలన కిందరకు రావడం ద్వారా.. అక్కడి ప్రజలు గతంలో పొందిన వివిధ హక్కులను కోల్పోయారన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఈ ఆర్టికల్‌రద్దు తర్వాతే భారత్‌లో కశ్మీర్ భాగస్వామి అయినట్టుగా బీజేపీ, ఆరెస్సెస్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగ విరుద్ధం, అప్రజాస్వామికమే కాకుండా ఫెడరల్ స్ఫూర్తికి కూడా విఘాతం కలిగిస్తోందన్నారు. బీజేపీ, ఆరెస్సెస్‌లకు 'ఇస్లామియోఫోబియా'పట్టుకుందని రాజా ఎద్దేవా చేశారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందని, ఇష్టారీతిన ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అజీజ్ పాషా, గుండా మల్లేష్, పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, పశ్య పద్మ, ఎన్.బాలమల్లేష్, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటీ నర్సింహ, సామాజిక ఉద్యమనేత ఉ.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

### సురవరానికి రాజా పరామర్శ

సీపీఐ మాజీ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకరరెడ్డిని డి.రాజా పరామర్శించారు. గుండెకు సంబంధించిన చికిత్స తీసుకున్న సురవరంను ఆయన నివాసంలో కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం రాత్రికి విజయవాడకు చేరుకుని, అక్కడ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొన్నాక మంగళవారం రాజా ఢిల్లీకి తిరిగి వెళతారు.

### రాజాకు ఘనస్వాగతం

విమానాశ్రయంలో చాడ వెంకట్‌రెడ్డి, అజీజ్ పాషా, పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, గుండా మల్లేష్, పశ్య పద్మ పుష్పగుచ్ఛాలతో రాజాకు స్వాగతం పలికారు. అక్కడినుంచి ర్యాలీగా పార్టీ కార్యకర్తలు ఆయనను మఖ్దూంభవన్ వరకు తీసుకొచ్చారు. పార్టీ కార్యాలయంలోనూ ఆయనకు ఘనస్వాగతం లభించింది.

## క్లుప్తంగా...

### త్వరలో సీఎం కేసీఆర్ పాలమూరు పర్యటన



**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు త్వరలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఒకట్రెండు రోజుల్లో సీఎం ఈ ప్రాజెక్టు సందర్శనకు వచ్చే అవకాశముందని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే కేసీఆర్ కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పలుమార్లు సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. దీంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఇదే తరహాలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులను కూడా పరుగులు పెట్టించాలని సీఎం నిర్ణయించారు. ఈ నేపథ్యంలో త్వరలో ప్రాజెక్టు నిర్మిత ప్రాంతాలను సందర్శించి ఇంజనీర్లకు దిశా నిర్దేశం చేసే అవకాశముంది.

### జల్ జీవన్ మిషన్ సమావేశానికి ఎర్రబెల్లి



**సాక్షి, హైదరాబాద్:** సోమవారం ఢిల్లీలో జరగనున్న 'జల్ జీవన్ మిషన్ 'సమావేశానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరవుతున్నారు. రాష్ట్రాల భాగస్వామ్యంతో 2024 కల్లా అన్ని గ్రామాల్లోని ఇళ్లకు నల్లాల ద్వారా నీటి సరఫరా కోసం స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ 'జల్ జీవన్ మిషన్ 'పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తదుపరి కార్యాచరణలో భాగంగా రాష్ట్రాల గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్ సీ, చీఫ్ ఇంజనీర్లతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర చౌహాన్ ఈ భేటీ ఏర్పాటు చేశారు.

### 'టీఆర్ఎస్‌లా బీజేపీ భయపెట్టడం లేదు'

**సాక్షి, హైదరాబాద్:** టీఆర్ఎస్ పార్టీలా బీజేపీ ప్రజలను బలవంతపెట్టి, భయపెట్టి సభ్యత్వ నమోదు చేయించడం లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మారావు పేర్కొన్నారు. టీఆర్ఎస్ నేతలు ఆ పార్టీ సభ్యత్వం తీసుకోకపోతే పెన్షన్లు, రైతుబంధు ఆగిపోతాయని ప్రజలను భయపెడుతున్నారని ఆయన ఓ ప్రకటనలో ఆరోపించారు. ఒక గంటలో టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం మూడు కోట్లు నమోదు చేసి చూపిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్తున్నారని, టీఆర్ఎస్ పార్టీకి ఒక్క గంట కాదు పది రోజుల సమయం ఇస్తామని, సభ్యత్వం నమోదు చేసి చూపాలని సవాల్ విసిరారు.

### 28 నుంచి హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు

**సాక్షి, హైదరాబాద్:** వ్యవసాయం, పశుసంవర్ధక రంగాల్లో సమగ్రాభివృద్ధి, ప్రస్తుత సవాళ్ల పరిష్కారం లక్ష్యంగా ఈనెల 28 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో 'వ్యవసాయం, పశుసంవర్ధక రంగాల'పై అంతర్జాతీయ సదస్సు జరగనుంది. హైదరాబాద్ లైఫ్ సైన్స్ సొసైటీ, పసురా గ్రీన్ విజనరీస్ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నాయి. ప్రపంచ ఆహార భద్రతతోపాటు 2022 వరకు రైతుల ఆదాయం రెట్టింపు చేసే చర్యలను ఈ సదస్సులో చర్చించనున్నట్లు సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ జువ్వాడి దేవీప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

### నేడు వన్‌ప్లస్ ఆర్ అండ్ డీ సెంటర్ ప్రారంభం

**సాక్షి, హైదరాబాద్:** ప్రముఖ స్మార్ట్‌ఫోన్ కంపెనీ తయారీ సంస్థ వన్‌ప్లస్ ఆధ్వర్యంలోరీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటు కానుంది. ఇది దేశంలోనే తొలి ఆర్ అండ్ డీ కేంద్రం కావడం గమనార్హం. సోమవారం ఉదయం 11 గంటలకు నగరంలోని నానక్‌రాంగూడలో వంశీరామ్స్ సాహ్ని టెక్‌పార్క్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని 15వ అంతస్తులో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వన్‌ప్లస్ కంపెనీ సీఈఓ పెటె లావు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.

# అవసరమైతే హైకోర్టుకు వెళ్తా

- ప్రభుత్వానిది నిరంకుశ ధోరణి: కోమటిరెడ్డి
- పాదయాత్రకు అనుమతి నిరాకరించిన పోలీసులు



**సాక్షి, హైదరాబాద్:** భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేటి నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించాల్సిన 'రైతు సాధన యాత్ర'పై టెన్షన్ నెలకొంది. నల్లగొండ పట్టణ శివారులోని ఉదయ సముద్రం నుంచి హైదరాబాద్‌లోని జలసౌధ వరకు వేలాది మంది రైతులతో కలిసి ఆయన నిర్వహించాలనుకున్న పాదయాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించారు. హైవేపై పాదయాత్ర నిర్వహిస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ, తాను మాత్రం యాత్ర నిర్వహించి తీరుతానని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. తన పాదయాత్రపై ఇంతవరకు ఎలాంటి నోటీసులు అందలేదని, పాదయాత్రకు అనుమతి నిరాకరించడం ప్రభుత్వ నిరంకుశ ధోరణికి నిదర్శనమని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తన స్వేచ్ఛను హరించడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని, హైకోర్టు నుంచి అనుమతి తీసుకునయినా పాదయాత్ర చేసి తీరతానని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై కోమటిరెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ, రైతాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వంపై రైతులు ఆగ్రహంతో ఉన్నారని, తన పాదయాత్రకు రానున్న స్పందనను ఇంటెలిజెన్స్ ద్వారా ముందే సేకరించిన ప్రభుత్వం వ్యూహంతోనే అనుమతి నిరాకరించిందని చెప్పారు. రైతుల కోసం అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించయినా 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉదయసముద్రం పథకాన్ని సాధించి తీరుతానని ఆయన వ్యాఖ్యానించారు.

**నేడు తుమ్మిడిహెట్టికి టీపీసీసీ..**

మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టులో జరుగుతున్న అక్రమాలను ఎండగట్టేందుకుగాను టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న తుమ్మిడిహెట్టి యాత్ర నేడు జరగనుంది. ఈ యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఏఐసీసీ కార్యదర్శులు, మాజీ ఎంపీలు, మంత్రులు, ఉత్తర తెలంగాణకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.

# తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కొంటాం..

రెవెన్యూ ఉద్యోగ సంఘాల ప్రకటన

**సాక్షి,హైదరాబాద్ :** రెవెన్యూ ఉద్యోగులు, సంఘాలపైన కొన్ని పత్రికలు (సాక్షి కాదు) చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎదుర్కొంటామని రెవెన్యూ ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి. తమ సంఘ నేత రాములు కుమారుని ఆరోగ్య సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్తే తాము ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నామని ఆ పత్రికలు కథనాలు రాశాయని విమర్శించాయి. కలెక్టర్ల సమావేశ వివరాలను మంత్రి ద్వారా తెలుసుకోలేదని పేర్కొన్నాయి.ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, తహశీల్దార్ల సంఘ అధ్యక్షుడు కె.గౌతమ్‌కుమార్, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఉపేందర్‌రావు, వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ రాజయ్యలు ఓ ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ శాఖను రద్దు చేస్తారన్న ప్రచారంతో పాటు కొత్త రెవెన్యూ చట్టం అమలుపై మాట్లాడేందుకు త్వరలో సీఎం కేసీఆర్‌ను కలవాలని నిర్ణయించినట్లు రెవెన్యూ సంఘాల నేతలు పేర్కొన్నారు.

# వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం

కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యక్రమం

**సాక్షి, హైదరాబాద్:** వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం సాగించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. రైతులకు సహకరించడం, రైతు కుటుంబాల జీవనోపాధిని పెంచడం వంటి ఉద్దేశాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ముందుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అమలు చేస్తోంది. శాస్త్రీయ పద్ధతుల్లో పంటల సాగు విధానాలను పాటించి అధిక దిగుబడులు పొందాలనేది కార్యక్రమ లక్ష్యంగా ఉంది. దీనిలో భాగంగా వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతుల పొలాల్లో నీటి గుంతల తవ్వకం, బిందు సేద్యం, అధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాల సరఫరా, అంతర పంటల సాగు వంటి విధానాలను వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో చేపడతారు. రైతు కుటుంబాల జీవనోపాధి కోసం పాడి పశువులు, వాన పాముల ఎరువు తయారీ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

**15 గ్రామాల్లో..**

'వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం'పేరుతో జడ్చర్ల, బిజినేపల్లి, ఘన్‌పూర్ క్లస్టర్లలో 5 గ్రామాల చొప్పున మొత్తం 15 గ్రామాలను ఎంపిక చేశారు. ఇక్రిశాట్ బేస్‌లైన్ సర్వే ప్రకారం 3 క్లస్టర్లలో మొత్తం 8,400 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో ఈ ప్రాజెక్టు పూర్తిచేసే సరికి 3,438 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం రూ.24 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. వాస్తవానికి ఈ పథకాన్ని నాలుగేళ్ల పాటు అమలు చేయాలని 2016లో నిర్ణయించారు. అయితే ప్రతి రైతుకు ఇచ్చే సొమ్ములో 50 శాతం రాయితీగా భరించాల్సి ఉంటుందని అప్పట్లో కేంద్రం ఆదేశించింది. దీంతో ఒక్కో రైతు గరిష్టంగా రూ.62,500 వరకు తన వాటా కింద చెల్లించాలి. ఇంత సొమ్ము పేద రైతులు కట్టలేరని రాష్ట్ర వ్యవసాయశాఖ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. దీంతో కేంద్రం ఇచ్చే 50 శాతం రాయితీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 25 శాతం రాయితీ ఇవ్వడానికి ఆమోదం తెలిపింది. ఫలితంగా ఒక్కో రైతుకు గరిష్టంగా అందే రాయితీ రూ.93,750కి చేరింది. రైతు తన వాటాగా రూ.28,750 చెల్లిస్తే సరిపోతుంది. ఈ పథకం అమలును 2021 మార్చికల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



### పేదలను 'దృష్టి'లో పెట్టుకోండి!

మంత్రి కొప్పుల ఈశ్వర్

**సాక్షి, హైదరాబాద్:** కంటివ్యాధులకు చికిత్స కోసం ఆధునిక సాంకేతికతతో కూడిన ఆసుపత్రులను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నేత్రాలయ కంటి ఆసుపత్రి ఐదో బ్రాంచ్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. అయితే పేదలకు చౌకగా వైద్యం అందించడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు. రోజురోజుకూ నగరంలో కంటివ్యాధులతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోందని.. కనీసం 10% మంది కంటి సమస్యలతో బాధపడుతున్నారని ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అత్యంత అధునాతన సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు ఇతర ఆసుపత్రులతో తక్కువ ఖర్చులోనే వైద్యాన్ని అందించనున్నట్లు ఆయన తెలిపారు. లేజర్ చికిత్స, కేటరాక్ట్ ఆపరేషన్లు, ఇతర కంటి సంబంధిత వ్యాధులకు అంతర్జాతీయ స్థాయి వైద్యాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ధూళిపాళ్ల సీతారాం, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ బారిన టీనేజ్

- మూడేళ్లలో టీబీ కేసులు డబుల్
- చాపకింది నీరులా విస్తరణ
- 20 శాతం దాటిన టీనేజీ కేసులు.. పోషకాహారలోపం వల్లే..



**సాక్షి, హైదరాబాద్ :** టీనేజ్ యువతపై టీబీ పంజా విసురుతోంది. రాష్ట్రంలో ట్యూబరిక్లోసిస్(టీబీ) చాపకింద నీరులా విస్తరిస్తోంది. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్న హెచ్ఐవీ బాధితులు, చిన్నారుల్లోనే కాదు, టీనేజీ అమ్మాయిల్లోనూ ఇది వెలుగుచూస్తోంది. జనసమూహం ఎక్కువగా ఉన్న హాస్టళ్లలో ఉండటం, సరైన వ్యాయామం లేకపోవడం, పోటీ పరీక్షల పేరుతో పెరుగుతున్న ఒత్తిడికి తోడు ఆశించినస్థాయిలో పౌష్టికాహారం అందకపోవడంతో రోగనిరోధకశక్తి తగ్గుతోంది. మరి కొంతమంది ఉదయం పూట ఏమీ తినకుండానే ఖాళీ కడుపుతో కాలేజీకి బయలుదేరి, మధ్యాహ్నం క్యాంటీన్లో రెడీమేడ్ ఫుడ్‌తో కడుపు నింపుకుంటుండటం వెరసి పౌష్టికాహార లోపం ఏర్పడుతోంది. దీంతో చాలామంది టీబీ బారినపడుతున్నారు. బంధు వర్గాల్లో తెలిస్తే వివాహ సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉందని భావించి, గుట్టుగా ప్రైవేటు ఆస్ప త్రుల్లో చికిత్సలు చేయిస్తున్నారు. –రోగుల వివరాల నమోదుకు ప్రైవేటు ఆసుపత్రులు సహకరించడంలేదు. క్షయవ్యాధి బారినపడ్డవారు ఒకట్రెండు నెలలపాటు మందులు వాడి ఆ తరవాత వైద్యఖర్చులకు భయపడి మందులు వాడ కుండా మానేస్తున్నారు. వ్యాధి మరింత ముదిరి పోయి, ఇతరులకు సులభంగా వ్యాపిస్తోంది.

**గ్రేటర్‌లో విస్తరిస్తున్న వైనం**

నగరాన్ని ఓవైపు స్వైన్‌ఫ్లూ, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వణికిస్తుండగా ఇప్పుడు ఆ స్థానాన్ని ట్యూబరిక్లోసిస్(టీబీ) ఆక్రమించింది. టీబీ సంబంధ సమస్యతో బాధపడుతూ ఎర్రగడ్డ ఛాతీ ఆస్పత్రికి చేరుకుంటున్న రోగుల సంఖ్య గత మూడేళ్లతో పోలిస్తే మూడింతలు పెరిగింది. 2015లో ఆస్పత్రికి చికిత్స కోసం 80 వేల మంది రాగా, 2018లో 1.72 లక్షల మంది చేరుకోవడమే ఇందుకు నిదర్శనం. వీరిలో టీనేజ్ కేసులు 20 శాతం మించి నమోదయ్యాయి. దేశంలో ఏటా మూడు లక్షల మంది టీబీతో చనిపోతున్నారు. ప్రతి రోగి తను చనిపోయే ముందు మరో 15 మందికి వ్యాపింపజేస్తున్నాడు. టీబీ సోకిన వ్యక్తి మాట్లాడినప్పుడు, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు బ్యాక్టీరియా వాతావరణంలోకి ప్రవేశి స్తుంది. ఇలా ఒకసారి బయటికి వచ్చిన బ్యాక్టీరి యా ఒకరి నుంచి మరొకరికి విస్తరిస్తుంది. గోర్లు, వెంట్రుకలకు మినహా శరీరంలోని అన్ని అవయవాలకు టీబీ సోకుతుందని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### పౌష్టికాహారం, వ్యాయామం అవసరం



సాధారణంగా ప్రతి మనిషి లోనూ టీబీ లక్షణాలు ఉంటాయి. ముఖ్యంగా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో త్వరగా బయటపడుతుంటాయి. అబ్బాయిలతో పోలిస్తే టీనేజీ అమ్మాయిల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. పౌష్టికా హారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతను మెరుగు పర్చుకోవడం, వ్యాయామం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని మెరుగు పర్చుకుని వ్యాధిభారి నపడకుండా చూసుకోవచ్చు.

– డాక్టర్ రఫీ, ఫల్మొనాలజిస్ట్, కేర్ ఆస్పత్రి, బంజారాహిల్స్

**లక్షణాలు గుర్తించవచ్చు ఇలా..**

- సాయంత్రం, రాత్రిపూట తరచూ జ్వరం రావడం, రాత్రిపూట చెమటలు పట్టడం.
- ఆకలి, బరువు తగ్గడం, నీరసంగా, ఆయాసం, ఛాతీలో నొప్పి ఉంటుంది.
- తెమడ పరీక్ష ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారు.
- 6 నుంచి 9 మాసాలపాటు మందు లు వాడాలి.
- బహిరంగ ప్రదేశాల్లో తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతి రుమాలు వాడాలి.

### విత్తన లైసెన్సు కాలపరిమితి ఐదేళ్లు

**సాక్షి, హైదరాబాద్:** విత్తన విక్రయాల వ్యాపారుల లైసెన్సు కాలపరిమితిని మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 'జాతీయ విత్తన నియంత్రణ ఉత్తర్వు–1983 (ఎస్‌సీవో)కు సవరణ చేస్తున్నట్లు తెలిపింది. ఇప్పుడున్న విధానంలో మూడేళ్లకోసారి లైసెన్సు పొడిగింపు(రెన్యువల్) కోరుతూ రాష్ట్ర వ్యవసాయశాఖకు దరఖాస్తు చేసి రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. ఈ సమయంలో మూడేళ్లలో వారి విత్తన అమ్మకాలెలా ఉన్నాయనే చరిత్రను అధికారులు పరిశీలించి తప్పుడు పనులు చేసినట్లు గుర్తించే అవకాశముంటుంది. తప్పుడు పనుల జాబితాలో ఉన్నవారికి రెన్యువల్ చేయకుండా వ్యవసాయశాఖ ఆపే అవకాశం ఉంది. ఇలా చేస్తున్నారని ఐదేళ్లకోసారి గడువు పెంచేలా విత్తన కంపెనీలు కేంద్ర వ్యవసాయశాఖ వద్ద లాబీయింగ్ చేసి విజయం సాధించాయి. దీని కారణంగా నాసిరకం, నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులలు చెలరేగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అసలు విత్తన వ్యాపారులకు లైసెన్సు లేకుండానే దానిని రద్దు చేసేందుకు కంపెనీలు, వ్యాపారులు లాబీయింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో లైసెన్సు లేకుండా చేసే విధంగా కేంద్రం ఉత్తర్వులు జారీ చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. కేంద్రం వ్యాపారవేత్తలకు లాభం చేకూరే నిర్ణయాలు తీసుకోవడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. లైసెన్స్ విషయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేసిన సూచనలను కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.


శ్మశానవాటికలో జైట్లీ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి అమిత్ షా

# జైట్లీకి కన్నీటి వీడ్కోలు

**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు ● అంతిమయాత్రలో అమిత్ షా, రాజ్‌నాథ్ సహా వేలాదిగా అభిమానులు**

**న్యూఢిల్లీ:** బీజేపీ దిగ్గజ నేత, కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీకి వేలాది మంది అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. గత కొంతకాలంగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న జైట్లీ(66) శనివారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం యమునా తీరంలోని నిగమ్‌బోధ్ శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో జరిగిన అంత్యక్రియల్లో వేలాది మంది పాల్గొన్నారు. అంతకుముందు ఆయన పార్థివ దేహాన్ని కైలాస్ కాలనీలోని స్వగృహం నుంచి దీన్‌దయాళ్ మార్గ్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయానికి తీసుకువచ్చారు. ఉదయం 11 గంటల నుంచి దాదాపు రెండున్నర గంటల సేపు అక్కడే అభిమానుల సందర్శనార్థం ఉంచారు. బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా, కేంద్రమంత్రులు హర్షవర్ధన్, ప్రకాశ్ జవడేకర్, పీయూష్ గోయెల్, మణిపూర్ గవర్నర్ నజ్మా హెప్తుల్లా, గుజరాత్ సీఎం విజయ్ రూపానీ, యోగా గురువు బాబా రాందేవ్ తదితరులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు. అరుణ్ జైట్లీతో సన్నిహిత సంబంధాలున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు నివాళులర్పించే సమయంలో ఉద్వేగానికి లోనయ్యారు. చేతులు జోడించి కొన్ని నిమిషాలపాటు పార్థివ దేహం వద్ద మౌనంగా నిలుచుండి పోయారు. మధ్యాహ్నం ప్రత్యేక శకటంలో జైట్లీ పార్థివ దేహాన్ని నిగమ్‌బోధ్ శ్మశాన వాటికకు తీసుకువచ్చారు. అంతిమయాత్రలో ఉప రాష్ట్రపతి వెంకయ్య, లోక్‌సభ స్పీకర్ బిర్లా, బీజేపీ అగ్రనేత అడ్వాణీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ, కాంగ్రెస్ సీనియర్ నేత ఆజాద్, జ్యోతిరాదిత్య సింధియా, కపిల్ సిబల్, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులుసహా అశేష సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బ్రాహ్మణులు వేద మంత్రాలు పఠిస్తుండగా జైట్లీ కుమారుడు రోహన్ చితికి నిప్పంటించారు. సంతాప సూచకంగా పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. విదేశీ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ ..జైట్లీకి ఉద్వేగపూరిత నివాళులర్పించిన విషయం తెలిసిందే.

## బ్రాండెడ్ వస్తువులపై మక్కువ



**కు**ర్తా పైజామాతో అందరికీ ఆత్మీయుడిగా కనిపించే అరుణ్ జైట్లీకి లండన్‌లో తయారయ్యే షర్టులు, జాన్ కాబ్ షూస్ వంటి బ్రాండెడ్ వస్తువులంటే విపరీతమైన మక్కువనే విషయం చాలా మందికి తెలియదు. రాజకీయ వేత్తగా, ప్రముఖ లాయర్‌గా అందరికీ సుపరిచితుడైన జైట్లీకి బ్రాండెడ్ వాచీలు, పెన్నులు, శాలువాలు, షర్టులు, ఇంకా షూలు సేకరించడం హాబీ. ఆయన వాడే వాటిల్లో ప్రఖ్యాత పటేక్ ఫిలిప్స్(వాచీలు), మాంట్ బ్లాంక్ (పెన్నులు) ఉన్నాయి. జైట్లీ అభిరుచులపై కుంకుమ్ చద్దా రాసిన 'ది మారిగోల్డ్ స్టోరీ' పుస్తకంలోని అరుణ్ జైట్లీ: ది పైడ్ పైపర్ అనే చాప్టర్‌లో వివరంగా ఉంది. 'చాలా మంది భారతీయులకు ఒమెగా వాచీలకు మించి తెలియని రోజుల్లోనే జైట్లీ చాలా ఖరీదైన పటేక్ ఫిలిప్స్ వాచీలను కొనే వారు. మాంట్ బ్లాంక్ పెన్నులు కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన ప్రతి మోడల్‌నూ కొనేవారు. ఇంకా జమవార్ షాల్స్‌ను సేకరించేవారు. ఆయన తన కుమారుడికి కొని పెట్టిన మొదటి షూ జత ఇటాలియన్ బ్రాండ్ సల్వటోర్ ఫెర్రాగమో' అని చద్దా పేర్కొన్నారు. అలాగే, ఆయన వ్యక్తిగత జీవితంలోనూ తనకంటూ కొన్ని నియమాలను విధించుకున్నారు. లాయర్‌గా తను తీసుకునే ఫీజు కాకుండా క్లర్కులకు 'మున్షియానా'(ఫీజు)కూడా అందేలా చూసేవారు. ఈ విధానం ఆయన తోటి వారికి నచ్చకపోయినా అరుణ్ తన విధానానికే కట్టుబడి ఉన్నారు' అని జైట్లీ సతీమణి సంగీత తెలిపారని చద్దా తన పుస్తకంలో పేర్కొన్నారు. అధికారిక పర్యటనల్లోనూ వెంట ఉండే వారి ఖర్చులు తనే భరించేవారని ఆమె తెలిపారన్నారు. ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో విదేశీ పర్యటనల సందర్భంగా రాకపోకల కోసం విదేశీ కంపెనీల ప్రతినిధులు కార్లు, ఇతర వాహనాలను సమకూరుస్తామన్నా అంగీకరించేవారు కాదని పేర్కొన్నారు.



### పీత బాధ!!

విదేశాలకు ఎగుమతి చేయనున్న మేలురకం పీత ఇది. దీని బరువు ఒకటిన్నర కేజీలు. అమెరికాలోని కేప్ పోర్‌పోయిస్ గ్రామంలో తీసింది ఫొటో. విషయమేమంటే చైనాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో అమెరికా నుంచి ఈ పీతల ఎగుమతులు బాగా తగ్గిపోయాయి. అమెరికా పక్కనున్న కెనడా నుంచి ఎగుమతులు ఊపందుకున్నాయి.

# బహ్రెయిన్‌కు మీ కోసం వచ్చా

- బహ్రెయిన్‌లో ప్రవాస భారతీయులతో మోదీ
- 250 మంది భారతీయ ఖైదీలను విడుదల చేసిన బహ్రెయిన్
- జీ7 సదస్సు కోసం ఫ్రాన్స్‌కు మోదీ


ప్రధాని మోదీతో మాట్లాడుతున్న బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్

**మనామా:** బహ్రెయిన్ అభివృద్ధికి ప్రవాస భారతీయులు చేసిన కృషిపై అభినందనలను వింటే తన మనసు సంతోషంతో పొంగిపోతుందని ప్రధాని మోదీ అన్నారు. బహ్రెయిన్‌లోని ప్రవాస భారతీయుల శ్రమను మోదీ ప్రశంసించారు. బహ్రెయిన్‌లో పనిచేస్తున్న భారతీయులను ఉద్దేశించి మోదీ బహ్రెయిన్ జాతీయ స్టేడియంలో ప్రసంగించారు. 'నేను భారత ప్రధానిగానే ఇక్కడకు వచ్చాను. కానీ ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం ఇక్కడ ఉద్యోగాలు చేసుకుంటున్న భారతీయులను కలిసి వారితో మాట్లాడటమే' అని అన్నారు. బహ్రెయిన్ మొత్తం జనాభా దాదాపు 12 లక్షలు కాగా, అక్కడ పనిచేస్తున్న ప్రవాస భారతీయుల సంఖ్య 3.5 లక్షలు. వీరిలోనూ ఎక్కువ మంది కేరళీయులే. బహ్రెయిన్‌లో పర్యటిస్తున్న తొట్టతొలి భారత ప్రధాని మోదీయే. రూపే కార్డును ఉపయోగించి త్వరలోనే బహ్రెయిన్‌లోనూ చెల్లింపులు చేసే అవకాశం కల్పిస్తున్నామనీ, ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై ఇప్పటికే ఇరు దేశాలు సంతకాలు చేశాయని ఆయన తెలిపారు.

**మోదీకి కింగ్ హమద్ ఆర్డర్ అవార్డు..**

బహ్రెయిన్‌తో భారత సంబంధాల బలోపేతానికి కృషి చేస్తున్నందుకు మోదీకి 'కింగ్ హమద్ ఆర్డర్ ఆఫ్ ద రినైజన్స్' అవార్డును బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా బిన్ సల్మాన్ అల్ ఖలీఫా ప్రదానం చేశారు. మోదీ పర్యటన సందర్భంగా 250 మంది భారతీయ ఖైదీలను ఆదివారం విడుదల చేసి బహ్రెయిన్ మానవత్వాన్ని చాటుకుంది. బహ్రెయిన్‌లో 200 ఏళ్ల పురాతనమైన శ్రీనాథ్‌జీ శ్రీకృష్ణుడి ఆలయాన్ని పునరభివృద్ధి చేసేందుకు రూ. 30 కోట్ల విలువైన పనులను మోదీ ఆదివారం ప్రారంభించారు. ఖలీఫాతో మోదీ చర్చలు జరిపిన అనంతరం ఓ సంయుక్త ప్రకటనను రెండు దేశాలు విడుదల చేశాయి. ద్వైపాక్షిక, ప్రాంతీయ, బహుముఖ అంశాలపై వారు చర్చించారు. ఉగ్రవాదంపై నిఘా సమాచారాన్ని పరస్పరం మార్పిడి చేసుకునేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి.

**ఫ్రాన్స్ చేరుకున్న మోదీ**

**బియారిట్జ్:** బహ్రెయిన్ పర్యటనను మోదీ ఆదివారం ముగించుకుని, జీ–7 సదస్సులో పాల్గొనేందుకు ఆదివారం ఫ్రాన్స్‌లోని బియారిట్జ్‌కు చేరుకున్నారు. పర్యావరణం తదితర సమకాలీన అంశాలపై మోదీ ఈ సదస్సులో ప్రసంగించనున్నారు. పలువురు అంతర్జాతీయ స్థాయి నేతలతో ద్వైపాక్షిక భేటీల్లో పాల్గొంటారు. జీ–7 కూటమి దేశాల్లో భారత్ లేకపోయినప్పటికీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ వ్యక్తిగత ఆహ్వానం మేరకు మోదీ ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.

**జాన్సన్‌తో భేటీ అయిన మోదీ**

బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌తో మోదీ ఆదివారం బియారిట్జ్‌లో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై ఇరు ప్రధానులు చర్చలు జరిపారని భారత ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. బ్రిటన్ ప్రధానిగా జాన్సన్ ఎన్నికయ్యాక ఆయనతో మోదీ తొలి భేటీ ఇది.

## ప్లాస్టిక్‌పై పోరాడదాం

**మన్‌కీబాత్‌లో మోదీ పిలుపు**

**న్యూఢిల్లీ:** మహాత్మాగాంధీ 150వ జయంతి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్‌పై పోరాటానికి సిద్ధం కావాలని ప్రధాని మోదీ ప్రజలను కోరారు. వచ్చే అక్టోబర్ 2వ తేదీని ప్లాస్టిక్ రహిత దినంగా పాటించాలని ఆకాశవాణిలో ప్రసారమయిన మాసాంతపు మన్‌కీ బాత్‌లో ఆయన కోరారు. వచ్చే దీపావళి పండుగ నాటికి ప్లాస్టిక్ వ్యర్థాలను లేకుండా చేయాలన్నారు. సెప్టెంబర్ 11వ తేదీ నుంచి మొదలయ్యే వార్షిక 'స్వచ్ఛతే సేవ'లో భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వచ్చే నెలలో దేశవ్యాప్తంగా జరగనున్న 'పోషణ్ అభియాన్'లో భాగస్వాములై చిన్నారులు, మహిళలకు పోషకాహారం అందించాలని కోరారు. డిస్కవరీ చానెల్‌లో ప్రసారమయిన 'మ్యాన్ వెర్సస్ వైల్డ్' ఎపిసోడ్‌లలో సాహసికుడు బేర్ గ్రిల్స్ హిందీని ఎలా అర్థం చేసుకోగలిగారని పలువురు అనుమానం వ్యక్తం చేయడంపై ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతే తమకు సాయపడిందన్నారు. నేను హిందీలో మాట్లాడిన మాటలను గ్రిల్స్ చెవిలో ఉండే పరికరం వెంటవెంటనే గ్రహించి అతడికి ఇంగ్లిష్‌లోకి అనువాదం చేసి వినిపిస్తుంది. ఇదంతా సాంకేతికత వల్ల సాధ్యమైన అద్భుతం..' అని పేర్కొన్నారు.

## క్లుప్తంగా...

### నిరసనకారుల రాళ్లదాడి.. కశ్మీర్‌లో డ్రైవర్ మృతి

**శ్రీనగర్:** కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఆందోళన కారులు విసిరిన రాళ్ల దాడిలో తీవ్రంగా గాయపడిన ఒక ట్రక్కు డ్రైవర్ చనిపోయారు. జిల్లాలోని జెరాడిపొరా ఉరాన్‌హాల్ ప్రాంతానికి చెందిన మహ్మూద్ ఖలీల్‌దార్ ఆదివారం సాయంత్రం తన ట్రక్కులో వస్తుండగా కొందరు దుండగులు రాళ్లు విసిరారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భద్రతా బలగాల వాహనంగా అనుమానించిన ఆందోళనకారులు దార్‌పై రాళ్లు విసిరి పొట్టనబెట్టుకున్నారని అధికారులు తెలిపారు.

### కరుణానిధికి ఆలయం

**నమక్కల్:** తమిళనాడు మాజీ సీఎం, డీఎంకే దివంగత నేత కరుణానిధి త్వరలో ఆలయంలో దర్శనమివ్వనున్నారు. తమకు చదువులు, ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్లు కల్పించినందుకుగాను ఎస్సీ సామాజిక వర్గంలోని కొన్ని ఉపవర్గాల వారు ఆయనకు ఆలయాన్ని నిర్మించనున్నారు. నమక్కల్‌కు 37 కిలోమీటర్ల దూరంలోని కుచికడు గ్రామంలో నిర్మించనున్న ఈ ఆలయం కోసం రూ. 30 లక్షలు వెచ్చించనున్నారు. త్వరలో నిర్మించనున్న ఈ ఆలయానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. వీరు కరుణానిధిని దేవుడిగా భావిస్తున్నప్పటికీ ఆయన మాత్రం తనను తాను నాస్తికుడి (దేవుడు లేడని నమ్మే వ్యక్తి)గా ప్రకటించుకున్న సంగతి తెలిసిందే.

### కాఫీ డే సిద్ధార్థ తండ్రి మృతి

**మైసూరు:** ఇటీవల మంగళూరు వద్ద నదిలో అనుమానాస్పద స్థితిలో మరణించిన కేఫ్ కాఫీ డే అధినేత వీజీ సిద్ధార్థ తండ్రి గంగయ్య హెగ్డే (95) ఆదివారం కన్నుమూశారు. కొన్ని నెలలుగా కోమాలో ఉన్న ఆయన మైసూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సిద్ధార్థ మరణించిన విషయం కూడా ఆయనకు తెలియదు. తనయుడు సిద్ధార్థ జూలై 29న అదృశ్యం కాగా, 31వ తేదీన మృతదేహం నదిలో కనిపించిన సంగతి తెలిసిందే.

### పాక్ దుశ్చర్యతో వరద ముప్పు

**చండీగఢ్:** పాకిస్తాన్ దుశ్చర్యతో భారత్‌లోని పంజాబ్ రాష్ట్రంలోని సరిహద్దు ఫిరోజ్‌పూర్ జిల్లాలోని గ్రామాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. సట్లెజ్ నది పరివాహక ప్రాంతంలోని ఓ కట్ట తెగిపోవడంతో పాక్ భారీ ఎత్తున నీటిని భారత భూభాగంలోకి విడుదల చేసింది. దీంతో భారత్ సరిహద్దు గ్రామాలన్నీ ముంపుకు గురయ్యే అవకాశముంది. ముంపు గ్రామాల్లో ముందు జాగ్రత్తగా ఎన్డీఆర్‌ఎఫ్, ఆర్మీ దళాలను మోహరించినట్లు చెప్పారు. మరోవైపు ఫిరోజ్‌పూర్, జలంధర్, కపుర్తల, రూప్‌నగర్ జిల్లాల్లో వరద పరిస్థితులను అంచనా వేయడానికి పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.

# కశ్మీర్‌లో మువ్వన్నెల రెపరెపలు


శ్రీనగర్‌లోని సెక్రటేరియల్ భవనం

**జమ్మూకశ్మీర్ సచివాలయంపై ఆ రాష్ట్ర జెండా తొలగింపు**

**న్యూఢిల్లీ:** రాష్ట్ర సచివాలయ భవనంపై ఉన్న జమ్మూ కశ్మీర్ రాష్ట్ర జెండాను అధికారులు తొలగించారు. ఆర్టికల్ 370 రద్దు పూర్తయ్యి మూడు వారాలు అవుతున్న క్రమంలో దీన్ని తొలగించడం గమనార్హం. వాస్తవానికి జమ్మూ కశ్మీర్ జెండాను అక్టోబర్ 31న తొలగించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ముందుగానే తొలగించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ దీన్ని తొలగించనున్నామని అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయానికి కేవలం మువ్వన్నెల భారత జెండా మాత్రమే ఎగురుతూ కనిపించింది. 1952, జూన్ 7 నుంచి రెండు జెండాలు ఎగిరేలా ఆర్టికల్ 370 వీలు కల్పించిన సంగతి తెలిసిందే. కశ్మీర్‌లో నిత్యావసరాలకు, మందులకు దిగుల్లేదని ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ అన్నారు. ప్రజలకు అవసరమైన ముడి సరుకులు అన్నింటిని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. సమాచార వ్యవస్థను నిలిపివేయడం ద్వారా ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు.

**కశ్మీర్‌లో పరిస్థితులు అసాధారణం: రాహుల్**

కేంద్రం చెబుతున్నట్లు కశ్మీర్‌లో పరిస్థితులు సాధారణంగా లేవని కాంగ్రెస్ నేత రాహుల్ అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల బృందం శనివారం కశ్మీర్‌ను సందర్శించడానికి ప్రయత్నించగా అధికారులు వారిని శ్రీనగర్ విమానాశ్రయంలో నిలిపివేసిన సంగతి తెలిసిందే. శ్రీనగర్‌లో తమ బృందం ఎదుర్కొన్న పరిస్థితులను రాహుల్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. కశ్మీరీలకున్న స్వాతంత్య్రం కోల్పోయి 20 రోజులు అవుతోందన్నారు.

# అంతరిక్షంలో తొలి నేరం

**విచారణ ప్రారంభించిన నాసా**


అన్నె మెక్‌క్లెయిన్

**వాషింగ్టన్:** అంతరిక్ష చరిత్రలో మరో ఖ్యాతి మానవుడి ఖాతాలో చేరింది. అయితే ఈసారి దీనిని ఖ్యాతి అనే కంటే అపఖ్యాతి అంటే బాగుంటుందేమో. ఎందుకంటారా.. ఇంతవరకు భూమి మీద సాధ్యమైన ఓ విషయాన్ని మొట్టమొదటిసారి అంతరిక్షంలో మనిషి చేసి చూపించాడు. ఇంతకూ అదేమిటి అనుకుంటున్నారా..? అదేనండీ భూమి మీద బాగా పెరిగిపోయిన 'నేరం'. ఏంటీ నమ్మలేకపోతున్నారా.. అయితే చదివేయండి. నాసా అంతరిక్ష కార్యక్రమంలో భాగంగా అన్నె మెక్‌క్లెయిన్ అనే మహిళా వ్యోమగామి సుమారు 6 నెలల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)లో గడిపారు. ఆమెకు భూమి మీద సమ్మర్ వోర్డన్స్ అనే 'భార్య'ఉన్నారు. వోర్డన్స్‌కు తెలియకుండా ఆమె వ్యక్తిగత ఆర్థిక పత్రాలు, బ్యాంకు ఖాతాలను క్లెయిన్ ఐఎస్‌ఎస్‌లో ఉన్నపుడు వినియోగించారు. దీంతో వోర్డన్స్ ఈ ఏడాది ప్రారంభంలో ఫెడరల్ ట్రేడ్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వోర్డన్స్ కుటుంబ సభ్యులు ఇదే నేరంపై క్లెయిన్ మీద నాసా విభాగంలోనూ ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఈ నేరం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాలోని ఇన్‌స్పెక్టర్ జనరల్ దర్యాప్తు జరుపుతున్నారు.

# చిదంబరం పిటిషన్లపై నేడు సుప్రీం విచారణ



**న్యూఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం విచారించనుంది. ఈ పిటిషన్‌తోపాటు ఇదే కేసులో దిగువ కోర్టు తనపై అరెస్టు వారెంట్ జారీ చేయడం, సోమవారం వరకు సీబీఐ కస్టడీకి పంపాలంటూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని సవాల్ చేయడంపై కోర్టు బెంచ్ విచారణ జరపనుంది. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ వేసిన తన పిటిషన్‌ను జూలై 20, 21వ తేదీల్లో సుప్రీం కోర్టు విచారించక పోవడం వల్లే ఆగస్టు 21వ తేదీన అరెస్టయ్యానని చిదంబరం తెలిపారు. ఈ చర్యల రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మనీలాండరింగ్ కేసులో సోమవారం వరకు చిదంబరంను అరెస్టు చేయకుండా తాత్కాలిక రక్షణ కల్పిస్తూ శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం ఈడీని ఆదేశించిన విషయం తెలిసిందే. చిదంబరం పిటిషన్లపై సమాధానం ఇవ్వాల్సిందిగా న్యాయస్థానం ఈడీని కూడా ఇప్పటికే ఆదేశించింది. ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ..దీని వెనుక భారీ మనీలాండరింగ్ కుట్రకోణం ఉందని తెలిపారు.

# నా తొలి శత్రువు సిద్ధరామయ్య

- నా సర్కారును కూల్చింది ఆయనే
- కుమారస్వామి ఆరోపణలు



**సాక్షి, బెంగళూరు:** 'సిద్ధరామయ్యే నా తొలి శత్రువు. బీజేపీ కాదు'అని జేడీఎస్ మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు. సీఎల్పీ నాయకుడు సిద్ధరామయ్యపై మూడు రోజుల నుంచి జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడానికి సిద్ధరామయ్యే కారణమని ఆరోపించారు, తాను సీఎం కావడాన్ని ఆయన ఏమాత్రం సహించలేకపోయారని మీడియాతో ఆదివారం వ్యాఖ్యానించారు. తన సన్నిహిత ఎమ్మెల్యేల ద్వారా ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతూ చివరికి వారి చేత రాజీనామాలు చేయించి, ప్రభుత్వం కూలిపోవడానికి కారకులయ్యారని మండిపడ్డారు. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం కొనసాగాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచించడంతో, ఇష్టం లేకపోయినా బలవంతంగా తనను ముఖ్యమంత్రిగా అంగీకరించారన్నారు. ఆయన ఒత్తిడి మేరకే రాష్ట్ర ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కేసులో సీబీఐ విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని అన్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో తాను ముఖ్యమంత్రిగా కాకుండా, క్లర్క్‌లాగా పనిచేశానని అన్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో కాంగ్రెస్ నేతలు తనపై పెత్తనం చేసేవారని, కలెక్టర్లు సహా అందరి బదిలీలు వారు చెప్పినట్లే చేశానని తెలిపారు.

**సాయంత్రానికి మాట మార్పు..**

ఈ వ్యాఖ్యల అనంతరం సాయంత్రానికే కుమారస్వామి మాట మార్చారు. తానెప్పుడూ సిద్ధరామయ్య తన తొలి శత్రువు అని చెప్పలేదని తెలిపారు. డిజిటల్ మీడియా విలేకరులకు కొన్ని రోజుల క్రితం ఇచ్చిన సందేశాన్ని తాజాగా కొందరు మార్చి చెబుతున్నారని అన్నారు.




## 2 లక్షల మంది రోహింగ్యాల ర్యాలీ

**కుటుపలోంగ్:** మయన్మార్ బలగాల దాడుల నుంచి తప్పించుకుని పారిపోయి రెండేళ్లయిన సందర్భంగా బంగ్లాదేశ్‌లోని కుటుపలోంగ్ శరణార్థి శిబిరంలో ఉంటున్న దాదాపు 2 లక్షల మంది రోహింగ్యాలు అక్కడే ర్యాలీ చేపట్టారు. 2017 ఆగస్టులో మయన్మార్‌లోని రఖినే రాష్ట్రం నుంచి 7.4 లక్షల మంది రోహింగ్యాలు బయటకు వెళ్లిపోయారు. అంతకు ముందే మయన్మార్ నుంచి వచ్చిన మరో 2 లక్షల మంది రోహింగ్యాలు ఆగ్నేయ బంగ్లాదేశ్‌లోని శిబిరాల్లో ఉంటున్నారు. వారికి ఈ 7.4 లక్షల మంది కూడా జతకలిశారు. ఆదివారం జరిగిన ర్యాలీలో హత్యాకాండ దినం సందర్భంగా చిన్నారులు, మహిళలు కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. 'దేవుడు గొప్పవాడు. రోహింగ్యాలు వర్ధిల్లాలి' అంటూ వారంతా నినాదాలు చేశారు.

## అన్ని ప్రధాన రైల్వేస్టేషన్లలో మట్టికప్పుల్లోనే చాయ్!

**న్యూఢిల్లీ:** ఇకపై ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్ డిపోల వద్ద ఉన్న స్టాళ్లు, ఎయిర్‌పోర్టులు, మాల్స్‌లో మట్టి కప్పుల్లో చాయ్‌ని ఆస్వాదించవచ్చు. ఈమేరకు కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ.. రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం వారణాసి, రాయ్‌బరేలీ రెండు రైల్వే స్టేషన్లలో మాత్రమే కేటరర్లు ఈ మట్టి కప్పుల్లో చాయ్‌ను అందిస్తున్నారు. 'సుమారు 100 రైల్వే స్టేషన్లలో, ఎయిర్‌పోర్టులు, రాష్ట్రాల్లోని బస్ డిపోల వద్ద ఉన్న టీ స్టాళ్లలో మట్టి కప్పుల్లోనే చాయ్‌ను అందించడాన్ని తప్పనిసరి చేయాలని గోయల్‌కు లేఖ రాశాను. దీంతో స్థానిక తయారీదారులకు మార్కెట్ లభించడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించే పేపర్, ప్లాస్టిక్‌ల వాడకాన్ని నిషేధించినట్లవుతుందని వివరించారు.

సాక్షి
సాహిత్యం




నల్లగొండ | సోమవారం
ఆగస్టు | 26 | 2019
sakshisahityam@gmail.com

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. దక్షిణాయనం, వర్ష ఋతువు. శ్రావణ మాసం. తిథి బ.ఏకాదశి రా.12.44 వరకు, తదుపరి ద్వాదశి. నక్షత్రం ఆరుద్ర రా.11.48 వరకు, తదుపరి పునర్వసు. వర్జ్యం ఉ.8.32 నుంచి 10.06 వరకు. దుర్ముహూర్తం ప.12.26 నుంచి 1.16 వరకు, తదుపరి ప.2.56 నుంచి 3.46 వరకు. అమృత ఘడియలు ప.2.00 నుంచి 3.45 వరకు


సూర్యోదయం : 5.48 సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు



**నమాజ్ వేళలు**
ఫజర్ : 4.47
జొహర్ : 12.18
అసర్ : 4.45
మగ్రీబ్ : 6.35
ఇషా : 7.49


### ఈవారం పుస్తకాలు

**నాలుగు అస్తిత్వాలు: నాలుగు నవలికలు**



రచన: డాక్టర్ శాంతి నారాయణ; పేజీలు: 212; వెల: 150; ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి. రచయిత ఫోన్: 8074974547

**నాగలకట్ట సుద్దులు**
(రెండవ భాగం; వార్తా ఫీచర్)



రచన: డాక్టర్ శాంతి నారాయణ; పేజీలు: 224; వెల: 150; ప్రతులకు: రచయిత, ఎస్.ఎస్. అపార్ట్‌మెంట్స్, మారుతినగర్, అనంతపురం–515001.

**తెలంగాణ గ్రామాయణం**




రచన: మారంరాజు సత్యనారాయణరావు; పేజీలు: 72; వెల: 50; ప్రచురణ: అస్తిత్వ ప్రచురణలు, ఎమ్ఎస్‌కే టవర్స్, ప్లాట్ నం. 410, స్ట్రీట్ నం. 11, హిమాయత్ నగర్, హైదరాబాద్–26.

**కవిపాదుషా పువ్వాడ: కవిత్వము వ్యక్తిత్వము**




సంకలనం: పువ్వాడ తిక్కన సోమయాజి; పేజీలు: 360; వెల: 250; ప్రతులకు: సంకలనకర్త, 97, ఎల్ఐసీ కాలనీ, విజయవాడ–520008. ఫోన్: 9885628572

**ఆకెళ్ల నాటకాలు (మొదటి సంపుటం)**



పేజీలు: 316; వెల: 300; ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సంస్కృతి సమితి, దుర్గాపురం, విజయవాడ. రచయిత ఫోన్: 9440054477

**గొబ్బి పాటలు**



సంకలనం: ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి; పేజీలు: 218; వెల: 90; ప్రతులకు: ఎస్.ఆర్.బుక్ లింక్స్, ఇన్నర్ రింగ్ రోడ్ విజయవాడ రూరల్–520012. ఫోన్: 0866–2436959


### లోకోప్రపంచం

నువ్వెంత ప్రఖ్యాత రచయితవయినా తలనొప్పో, మోకాలు వేదనో అని సెలవు పెట్టాలి కానీ, మనోభావాలు దెబ్బ తిన్నందుకు సెలవు కావాలంటే మంజూరు చేయమయ్యా, గుమాస్తా!



కథాసారం

# పిల్లనగ్రోవికి ఒళ్లంతా గేయాలే



ఇంకా ఒక్కటి మిగిలింది. ఇదేనా? ఉదయం నుండి వెతుకుతున్నది మంచిది కాక, కానందువల్ల ఈ గుట్టలో పడిపోయిందేమో. ఇప్పుడు మిగిలింది- ఒకప్పుడు పనికిరాదని తాను పడవేసిందేమో.

**పొ**ద్దు వాటారి నప్పటినుంచి మర్రిచెట్లలోంచి వూడలు వూడలుగా దిగజారుతున్న చీకటి, చెలమై చెలరేగిన యమునై, భూమినంతా ముంచివేసింది. చెట్టుకింద చీకటిమధ్య చితుకుల మంటలు కృష్ణుడి మీద ఎర్రపట్టు కండువాలా కదలాడుతున్నాయి. మంటలో ఊచ కాలుస్తున్న గోపన్న ముఖం మీద– అతని పక్కన చెల్లాచెదురుగా పడివున్న వేణువుల మీద వెలుగు నీడల భాషలో కావ్యాలు రాస్తున్నాయి.

ఇంక మూడు ఝాములు పోతే సప్తమి తెల్లవారుతుంది. కృష్ణుడి పుట్టినరోజు వచ్చేస్తుంది. పాతిక పండగలనాడు గోపన్న ఆరంభించిన వేణు నిర్మాణం ఇంకా తెమలలేదు. రేపటికైనా సాధించి, తన వేణువును ఆయనకు సమర్పించాలి. రేపివ్వలేకపోతే ఇంక ఈ జన్మకివ్వలేడు... వేళయిపోయింది.

''నాయనా, బువ్వ దినవే'' అన్నాడు చిన్న గోపన్న వచ్చి. గోపన్న కీమాట వినబడలేదు.

అతని హృదయం బృందావనిలో ఉంది. అక్కడకు కృష్ణుడు వస్తాడు. వచ్చే వేళయింది. గోపికల అందెల రవళి వినిపిస్తోంది. వెదురు పొదలు సన్నగా ఈల వేస్తున్నాయి.

గోపన్న ఎన్ని యుగాలుగా అక్కడ చెట్ల మాటున కూర్చున్నాడో అతనికే తెలియదు. ఆకులలో ఆకై పువ్వులో పువ్వయి, ఇసుకలో రేణువై యమునలో బిందువై కృష్ణ వంశీనాదాన్ని హృదయంలో పోసుకున్నాడు. పరిశుద్ధమైన స్వరాలలో ఒక్కొక్క స్వరాన్ని మనసులో నిలుపుకుని పరుగున తన కుటీరానికి వచ్చాడు. కొత్త వెదురు కోసి స్వర ద్వారాలు వేసి, మనసులో స్వరాన్ని ఇందులో పలికించబోయాడు. ఆ స్వరం తన ఈ వేణువులో పలికితే ఇది కృష్ణయ్యకు కానుక ఇవ్వాలి. కాని అది పలకదు. ఎన్ని వేల వేణువులో చేశాడు. తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలన్నీ వేణువును శ్రుతి చేయడానికే ఉపయోగించాడు. ఒక్క జీవితానికి లెక్కదేలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కొన్ని కోట్లు ఉంటాయి. వాటిని వృథా చేస్తే ఎలా? యమున ఒడ్డున పొదల మాటున దాగి కృష్ణుడి మురళి విన్నప్పుడు వూపిరి బిగబట్టుకునే కాలం గడిపేవాడు. అక్కడ పొదుపు చేసిన దానిని కొత్త వేణువును పూరించడానికి ఉపయోగించేవాడు. తీరా అది శ్రుతి శుద్ధంగా వినబడేది కాదు. లోపలే వన్నా ఈనెలు లేచాయేమోనని లోపల కూడా నునుపు చేసేవాడు. ఇక పట్టుకువెళదాం అని లేచేసరికి దాని గొంతుక జీరబోయేది.

గోపన్న పూర్వం ఎన్నో వేణువులు చేశాడు. తృప్తిగా వాయించాడు. ఒక స్థాయి వచ్చాక అతని కొక ఊహ పోయింది. వేణువును కిందపెట్టి, సంగీతాన్ని ఊహించబోయాడు. ఊహించిన సంగీతాన్ని భావన చేసి, భావించిన దానిని అనుభవించి దర్శించే వరకు అతనికొక సత్యం తోచింది. జలపాతాన్ని వెదురుగొట్టంలో ఇమడ్చడం పొరబాటు. అన్ని వేదాంతాలూ, అన్ని అసత్యాలూ అర్ధసత్యాలేనంటూ, తనలో భాగాలేనంటూ నిలచే అద్వైత సత్యంలా ఈ సంగీతంలో అపస్వరాలు కూడా అర్ధ స్వరాల, పూర్ణస్వరాల పక్కన నిలిచి, అందంగా భాసించసాగాయి. ప్రతి అణువునా భగవంతుడున్నాడు. ప్రతి శబ్దంలోనూ సంగీతం ఉంది, అన్న వాక్యాల తాత్పర్యం గోపన్న అర్భక దేహానికి దుర్భరమైపోయింది. అతను ఊహించిన సంగీతాన్ని అనుభవించడానికి శక్తి చాలలేదు.

అతన్ని ఆ స్థితినుంచి ఐహిక స్థితికి తెచ్చి కాపాడినది– కృష్ణుడి మురళి. అది విన్న క్షణాన అతను ఆ స్థితిలోకే మేలుకున్నాడు. తన ఊహకు అందిన దాని కన్న గొప్పదీ, ఆకళింపు చేసుకుని అనుభవించడానికి సులువైనదీ అతనికి ఆనాడే వినిపించింది. నాటి నుంచి ప్రతి నిత్యం కృష్ణుడు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్లి, మురళి వినేవాడు. కొత్తల్లో గోపకాంతలు కంగారు పడ్డారు. తరువాత అతన్ని ఒక గోవుగా, చెట్టుగా జమ కట్టేశారు.

ఇంత మోహనమైన సంగీతాన్ని కృష్ణుడు ఒక వెదురు ముక్కలో ఎలా ఇమిడ్చాడా అని గోపన్న ఆలోచించాడు. ఒకసారి ఇంటికి వెళ్లి ఆ మురళిని ఎత్తుకు వచ్చాడు. యమున ఒడ్డుకు వచ్చి, చెంగు చాటు నుంచి మురళి తీసి వాయించాలనుకునేసరికి అది కనబడలేదు.

గజదొంగ దగ్గర నేను దొంగతనమేమిటి అనుకున్నాడు గోపన్న. కాని ఆ గజదొంగ సాయంత్రం కనబడి ''గోపన్నా నా మురళిని తీసుకుపోయావు కదూ... పోనీ ఇంకొకటి చేసిపెట్టు'' అన్నాడు నవ్వి.

గోపన్న తెల్లబోయాడు. మర్నాటి నుంచి వేణు నిర్మాణం ఆరంభించాడు. అతనిలో కొత్త శక్తి, కొత్త చైతన్యం మేల్కొన్నాయి. తన చేతులతో రూపు దిద్దుకుంటున్న మురళి రేపు కృష్ణుడి హస్తాలను అలంకరిస్తుందని ఆశపడుతూ మురళిని రూపొందించాడు.

మురళి సిద్ధం కాగానే శ్రుతి చూశాడు. గుండె బద్దలయినంత పనయింది. జీర. రెండు మూడు వేణువులు పలికినట్టుంది. కృష్ణుడు వూదుతాడన్న ఆనందంలో దానికి ఒళ్లు పులకరించిందా? అది పడేసి మరోటి చేశాడు. అదీ అంతే.

మర్నాడు వెదురు చాలా తెప్పించాడు. పది పన్నెండు చేశాడు. ఒక్కొకటీ వూది చూడడం, నచ్చక పారవెయ్యడం...

''నీకు వేణువు ఇవ్వందే నా ముఖం చూపను కృష్ణయ్యా'' అనుకున్నాడు. నాటినుంచి ఇదే పని.

ఊళ్లో వాళ్లంతా వింతగా చెప్పుకున్నారు. సంగీతం పిచ్చి వదిలిందనుకుంటే, మళ్లీ పిల్లంగోవి పిచ్చి పట్టిందిగావాల అని నవ్వుకున్నారు.

గోపన్న పనికిరావని పడేసిన వందలాది వేణువులను కొత్తలో గొల్లపిల్లలు తీసుకుపోయేవారు. తరువాత అతనికి భయం వేసింది– వాటిలో ఏదైనా కృష్ణయ్య దగ్గరకు పోతుందేమోనని. అందుకని పాకలో అటకమీద పడేసేవాడు.

యమున ఒడ్డున గోపన్న పాక, పాక పక్కన పందిరి కింద వెదుళ్లు, చెట్టుక్రింద కొలిమి చూసి జనం హేళన చేశారు– గోపన్నా! కలప దుకాణం పెట్టరాదూ!

• • •

పాతికేళ్లు గడిచిపోయాయి. కృష్ణయ్య పెద్దవాడయ్యాడు. బృందావనికి రావడం లేదు. రాజకీయాల్లో తిరుగుతున్నాడు. అయినా కృష్ణాష్టమి వెళ్లిన ప్రతి నవమినాడు గోపన్న కొత్త వేణువు ఆరంభిస్తూ, 'పైసారి పుట్టిన రోజుకైనా పంపాలి' అనుకొనేవాడు. పుట్టిన రోజు వచ్చేది వెళ్లేది... వేణువు మాత్రం కుదిరేది కాదు.

• • •

''నాయనా బువ్వదినవే''అన్నాడు చిన్నగోపన్న.

తండ్రి వాడివంక చూశాడు. తల్లి లేని బిడ్డ. తండ్రి ఉండీ లేనిబిడ్డ.

''బువ్వదింటాలేగాని, రేపు కిష్టయ్య పుట్టిన రోజు. నువ్వు నందయ్యగారి లోగిలికెళ్లి ఎవరూ చూడకుండా ఇది కిష్టయ్యకిచ్చి– మా నాయనిచ్చి రమ్మన్నాడని చెప్పిరావాల'' అన్నాడు గోపన్న.

''బువ్వ దినుమరి'' అన్నాడు బిడ్డడు.

గోపన్నకు వాణ్ణి చూడగానే బాలకిష్టయ్య గుర్తు కొచ్చాడు. లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు. వాడు తెల్లబోయి బుగ్గ తుడుచుకున్నాడు.

''నువ్వలాగే అంటావు. పొద్దాటేలేమో ఇది బాగాలేదు ఒద్దులే అంటావు''

''అనను. ఈసారిది బాగుంటదిలే. అయినా సూడనుగా'' అన్నాడు గోపన్న నీరసంగా నవ్వి.

• • •

మర్నాడు ఉదయమే గోపన్న కొడుక్కి తలంటి పోశాడు. సాంబ్రాణి ధూపమేసి జుట్టు ఆరబెట్టాడు. వదులుగా కొప్పు ముడేసి పూలు తురిమాడు. పట్టు కండువా తీసి పంచె కట్టాడు. మరోటి తీసి ధట్టీ చుట్టాడు. కస్తూరి తిలకం, కాటుక దిద్ది, దిష్టి తగలకుండా బుగ్గన చుక్క పెట్టాడు. నెమిలీకల వీవన లోంచి ఒక కన్ను తీసి కొప్పున బెట్టాడు.

చినగోపన్న కెందుకో కంట నీరు తిరిగింది. జాలిగా నాయన వంక చూశాడు. ముస్తాబు ముగించిన గోపన్న క్షణంలో నిర్విణ్ణుడై పోయాడు. ఇదేమిటి బాలకృష్ణుడు గోపాలకృష్ణుడు... ఇక్కడికి ఎందుకొచ్చాడు? తాను ఏనాడో ఎత్తుకొచ్చిన వేణువు కోసమా? అప్రయత్నంగా చేతులు జోడించి దండం పెట్టాడు. కన్నీరు కట్టలు తెంచుకుంది. దుఃఖమో, ఆనందమో.

''ఏందే అయ్యా'' అంటూ వచ్చి కౌగిలించుకున్నాడు కొడుకు. గోపన్న ఉలికిపడి కళ్లు తుడుచుకున్నాడు. ''ఏదే... మురళేదే'' అంటూ అటూయిటూ చూశాడు. కనబడలేదు.

''అటక మీదెట్టాను. రాతిరి ఎలకలొస్తే'' అన్నాడు చినగోపన్న భయపడుతూ.

''ఆ! ఎంత పన్జేశావురా'' అన్నాడు గోపన్న. ఎలకలుండేదే అటక మీద అని తెలిసి అక్కడ పెట్టడమేమిటని కేకలెయ్యబోయాడు గాని మనస్కరించలేదు. అటకమీదికెక్కి చూశాడు. వేణువులు గుట్టలుగా ఉన్నాయి. అందులో ఏది కొత్తది? ఏది మంచిది? వేణువులన్నీ కిందకు దించాడు. ఒక్కొక్కటీ తీసి వూది చూడసాగాడు.

''ఇది కాదు'' ''ఇదీ కాదు''

ఇటువేపు గుట్ట తరుగుతోంది. అటు వేపుది పెరుగుతోంది. ''నేతి నేతి'' అనుకొంటూ వేణుపరీక్ష సాగిస్తూనే వున్నాడు.

చిన్న గోపికి చెమటకి కస్తూరి బొట్టు కరిగిపోయింది. కాటుక చెరిగిపోయింది. అన్నం తిననందువల్ల నీరసం కూడా కలిగింది. కానీ గోపన్న ఇదేమీ గమనించే స్థితిలో లేడు.

ఇది కాదు. ఇదీ కాదు.

ఇన్ని వేణువుల గుట్టలో ఎక్కడో సత్యమైన కొత్త వేణువు దాగివుంది. అది సత్యమైనదేనా?

పొద్దు వాటారింది. చిన్నగోపన్న దీపం వెలిగించాడు. ''నాయనా చీకటి పడిపోతోందే. పుట్టింరోజు పండగయిపోతుంది'' అన్నాడు జంకుతూ. గోపన్న తల వూచాడు. ఇంక రెండే రెండు వేణువులు మిగిలాయి. ఒకటి చూశాడు.

ఇదీ కాదు. ఇంకా ఒక్కటి మిగిలింది. ఇదేనా? ఉదయం నుండి వెతుకుతున్నది మంచిది కాక, కానందువల్ల ఈ గుట్టలో పడిపోయిందేమో. ఇప్పుడు మిగిలింది– ఒకప్పుడు పనికిరాదని తాను పడవేసిందేమో. చివరి మురళిని పరీక్షించడానికి ధైర్యం చాలలేదు. సత్యం తెలుసుకొని చనిపోగల శక్తి లేదు.

''ఇదే'' అన్నాడు ధీమాగా.

''చూడవా'' అన్నాడు కుర్రాడు.

''ఒద్దు. లగెత్తు. కిష్టయ్య చేతికియ్యి ఆయనే చూస్తాడు''.

• • •

పాతిక సంవత్సరాల గాలివాన వెలిసింది. గోపన్న మేను వాల్చాడు. తాను పని ముగించాడా. భగవంతుడికి శ్రుతి శుద్ధమైన వేణువును పంపాడా. శ్రుతి శుద్ధంగా ఉందో లేదో నిర్ణయించే జ్ఞానం తనకు ఉందా? సరిచేసే శక్తి ఆయనకు లేదని తను అనుకొన్నాడా? గోపన్నకు నవ్వు వచ్చింది. పాతికేళ్ల పొరబాటు. ఒక జీవితం పొరబాటు. ఆయన అలుగుతాడా. అలగడు. వెర్రిగోపన్న అనుకుంటాడు. అనుకొని మురళిని తన పెదిమల దగ్గర ఉంచుకుంటాడు. శ్రుతులన్నీ దాచుకున్న బొజ్జలోంచి ఓంకారానికి మూలస్థానమైన నాభిలోంచి మంగళ గళంలోంచి మధురాధరాలలోంచి...


తన పక్కనున్న వేణువులోంచి సన్నటి స్వరం నెమ్మదిగా ఇవతలికి రావడం, వచ్చి తన చెంప నిమరడం గమనించాడు గోపన్న. ఇంకో క్షణానికి ఆ పక్క మురళి, ఉత్తర క్షణార్థానికి ఇటుపక్క మురళి మేలుకున్నాయి. మరికొద్ది క్షణాలలో కుటీరంలోని సహస్ర వేణువులూ భువన మోహనంగా గానం చేయసాగాయి. అన్నిటిలోనూ కృష్ణుడి మోహన గానమే. అసత్యమైన వేణువు లేనేలేదు. భగవంతుడికి ఉపయోగపడని వేణువే లేదు. గోపన్న సహస్ర వేణునాద స్వరార్ణవంలో– సాక్షాన్మహా విష్ణువై తేలుతున్నాడు.

వేణుగానం ముగిసిన కొద్ది క్షణాలకు అంతకన్న మధురమైన అడుగుల సవ్వడి వినబడింది. తాను పంపిన మురళి మంచిదో కాదో చెప్తాడు. ఈ సత్యం ఇక తెలిసినా మానినా ఒకటే. అంతకన్న గొప్ప సత్యాన్ని దర్శించాడు గోపన్న. నెమ్మదిగా కళ్లు తెరిచాడు. గుమ్మంలో బాలకృష్ణుడు!

నువ్వే వచ్చావా కిష్టయ్యా అంటూ చేతులు జోడించాడు.

''అయ్యా అయ్యా కిష్టయ్య నీ మురళి వాయించాడే. నాకు బువ్వలెట్టాడు. కానీ కిష్టయ్య ఎంత వాంచినా ఏమీ వినబడలే. అస్సలు పాట రాలేదే. కానీ కిష్టయ్య నన్నిక్కడ ముద్దెట్టు...''

గోపన్న ఇంతసేపూ గానం చేసి అలసిపోయిన వేణువుల వంక ఆప్యాయంగా సగర్వంగా చూసి ఒకటి తీసి ముద్దుపెట్టుకున్నాడు. ●



ముళ్లపూడి వెంకటరమణ

ముళ్లపూడి వెంకటరమణ (1931–2011) 'కానుక' కథకు ఇది సంక్షిప్త రూపం. 1963లో ప్రచురితమైంది. పరిపూర్ణత కోసం పడే ఒక కళాకారుడి తపననూ, అదే సమయంలో భగవంతుడికి పరిపూర్ణంగా లొంగిపోయే భక్తినీ ఈ కథ చిత్రిస్తుంది. రమణ పాత్రికేయుడిగా పనిచేశారు. 'బుడుగు' సృష్టికర్త. హాస్యానికి పెట్టింది పేరు. సాక్షి, ముత్యాల ముగ్గు, గోరంత దీపం, పెళ్లి పుస్తకం, మిస్టర్ పెళ్లాం వంటి సినిమాల రచయిత. రుణానందలహరి, గిరీశం లెక్చర్లు, రాజకీయ బేతాళ పంచవింశతి ఆయన రచనల్లో కొన్ని. కోతి కొమ్మచ్చి ఆయన ఆత్మకథ.

కొత్త బంగారం

## అలాంటి ఒకమ్మాయి చనిపోతే...



ఎ గర్ల్ లైక్ దట్



తనాజ్ భాతేనా

**సౌ**దీ అరేబియా, జెడ్డాలో – పదహారేళ్ళ జరీన్ వాడియా, ఆమె స్నేహితుడైన 18 ఏళ్ల పోరస్ – రహదారిపై కారు ప్రమాదంలో చనిపోతారు. ఇద్దరూ చేతులు పట్టుకుని గాల్లో తచ్చాడుతుండగా, తనాజ్ భాతేనా తొలి నవలైన 'ఎ గర్ల్ లైక్ దట్' మొదలవుతుంది.

వారి ఆత్మలు – కింద గుమిగూడిన వారిని గమనిస్తుంటాయి. 'జీవితంలో ఎంత అపఖ్యాతి పాలయిందో, మరణంలోనూ అలాగే ఉన్న' అమ్మాయి జీవితం గురించి ఆమె స్నేహితులూ, బంధువులూ, పోలీసులూ– తమ తమ అభిప్రాయాలను వెళ్ళబుచ్చుతుంటారు.

'పిన్ని ఏడుస్తున్న విధానం మనస్సును కలిచివేస్తోంది. తను నన్నొకసారి పిలిచినట్టు 'తన అక్క గర్భం నుండి వచ్చిన పరాన్నజీవి'ని కాకుండా నేను తనకే పుట్టిన కూతుర్ని అన్నట్టుగా ఏడుస్తోంది' అని వ్యంగ్యం కనబరుస్తుంది జరీన్. 'సహోదరుడూ, భర్తా కాని మగవాడితో ఒకమ్మాయి ఉండటం కన్నా సౌదీ అరేబియా పోలీసులను ఇబ్బంది పెట్టేదీ మరేదీ ఉండదు' అంటుంది.

యీ సంఘటన తరువాత, నవల ఏ కాలక్రమాన్నీ పాటించక, గతానికి మళ్ళుతుంది.

జరీన్ ముంబయిలో పుడుతుంది. బార్ డాన్సర్ అయిన ఆమె తల్లి పార్సీ. ముఠాకోరుడైన తండ్రి హిందూ. ఆమె చిన్నపిల్లగా ఉన్నప్పుడే వారు చనిపోతారు. పిన్ని, బాబాయి– జరీన్‌ను దత్తత తీసుకుని, తమతోపాటు జెడ్డా తీసుకెళ్తారు. పిన్నికి మానసిక అస్వస్థత ఉన్నప్పటికీ, జరీన్ తల్లిదండ్రులకు పెళ్ళవలేదని దెప్పే అవకాశాన్ని ఎప్పుడూ వదులుకోదు. జరీన్‌ను కొడుతుంది. అబ్బాయిలను దూరంగా ఉంచేందుకు జరీన్‌కు ప్యాంట్లు తొడుగుతుంది. జుట్టు పొట్టిగా కత్తిరిస్తుంది. పినతండ్రి భార్యావిధేయుడు. వీటన్నిటిపట్లా తిరగబడిన జరీన్ తనకు 14 ఏళ్ళు వచ్చేటప్పటికే, అబ్బాయిలతో కార్లలో తిరగడం, వాళ్ళను ముద్దు పెట్టుకోవడం, వాళ్ళ సిగరెట్లు పంచుకోవడం మొదలుపెడుతుంది. అయితే వారెవరికీ మానసికంగా దగ్గరవకుండా తన ఉదాసీనతను కవచంలా వాడుకుంటుంది. పరుషమైన భాష ఉపయోగిస్తుంది. జీవితంలోనూ, ఆన్‌లైన్‌లోనూ కూడా వేధింపులకు గురవుతుంది.

'అలాంటి పిల్ల'కి దూరంగా ఉండమని అబ్బాయిల తల్లిదండ్రులు, కొడుకులను హెచ్చరిస్తుంటారు. ఆమెకి స్వతహాగా ఉన్న తెలివి, తిరగబడే లక్షణం, స్వయం ప్రతిపత్తి గమనించిన స్కూలు పిల్లలు, పుకార్లు పుట్టిస్తుంటారు. సౌదీ సమాజంలో– పురుషులకుండే, స్త్రీలకు లేని హక్కుల లాంటి ద్వంద్వ ప్రమాణాలు జరీన్‌కు విసుగు పుట్టిస్తాయి. ఆడవాళ్ళను ఆటవస్తువులుగా చూసే బోయ్ ఫ్రెండ్స్ చిరాకు తెప్పిస్తారు. 'నువ్వు తప్పని, చెడ్డదానివని– సంవత్సరాలుగా అనేకమంది అనేకసార్లు చెప్పినప్పుడు, వాళ్ళను నమ్మడం ప్రారంభిస్తావు. మొహం దాచుకోవడం ప్రారంభిస్తావు. వాళ్ళు నిన్ను జడ్జ్ చేస్తున్నారనుకుంటావు. బతికేటందుకు అసలు జీవితానికే విలువైనా ఉందా! అని ఆలోచించే స్థితికి చేరతావు' అంటుంది.

చిన్ననాటి స్నేహితుడైన 'పోరస్ దుమాసియా' జెడ్డాలో పని చేస్తూ, ఆమె జీవితంలోకి తిరిగి ప్రవేశిస్తాడు. ముంబయి పార్సీ 'కామా' కాలనీ నివాసి అతను. జరీన్‌కు ఉండే 'జాగ్రత్తయిన చిరునవ్వులూ, సిగ్గుగా ఊపే చేతులూ' గుర్తు చేస్తాడు. గుజరాతీ ధారాళంగా మాట్లాడతాడు. ఆమెకు ఇంటిని గుర్తుకు తెస్తాడు. గమ్యం లేకుండా, గంటల తరబడి పోరస్‌తో కార్లో తిరుగుతుంది జరీన్.

ఆమె అంత్యక్రియల మీదకన్నా, ఆమె మరణానికి ముందేమి జరిగిందన్న వివరాల మీదే నవల కేంద్రీకృతమవుతుంది. బహుళ దృక్పథాలతో సాగే కథనం– తమ సొంత భావోద్వేగాలనూ, మారుతున్న శరీరాలనే అర్థం చేసుకోలేకపోయే టీనేజీ పిల్లలను చెదిరిన కుటుంబ బంధాలు మరింత గాయపరుస్తాయని చెబుతుంది. కిశోరావస్థలో ఉండే పిల్లల అతిరిక్త ప్రవర్తనకు అవి మూలకారణాలు అవుతాయంటుంది.


లింగ అసమానత్వం, మానసిక అస్వస్థత, మతం గురించి మాట్లాడే ఈ నవల్లో– మానభంగపు ప్రయత్నం కూడా ఉంటుంది. ఫరార్, స్ట్రాస్, జిరూ బుక్స్ దీన్ని 2018లో ప్రచురించింది. భాతేనా ఇండియాలో పుట్టి– సౌదీ అరేబియాలోనూ, కెనడాలోనూ పెరిగారు. ఈ నవల 2019 ఒలా(ఒంటారియో లైబ్రరీ అసోసియేషన్) వైట్ పైన్ అవార్డుకి షార్ట్ లిస్ట్ అయింది.

◆ కృష్ణ వేణి

ఆత్మకథ

## బిల్లివ్వకుండా కాఫీ తాగండి

**ఫ్రా**యిడ్‌ను తెలుగు చేసినవాడిగా, 'మిసిమి' సంపాదకుడిగా, బౌద్ధ రచనల మీద విశేష కృషి చేసి తన పేరునే అన్నపరెడ్డి బుద్ధఘోషుడుగా మార్చుకున్న 'కళారత్న', 'బౌద్ధరత్న', 'సద్ధర్మ మహోపాధ్యాయ' అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి స్వీయచరిత్ర 'ఓ అనాత్మవాది ఆత్మకథ'. 192 పేజీల ఈ పుస్తకాన్ని పల్లవి పబ్లికేషన్స్ ప్రచురించింది. 'ఏసుర్లు' 1933లో జన్మించారు. 21 సంవత్సరాల వయసులో 13 ఏళ్ల లక్ష్మీకాంతమ్మను పెళ్లాడారు. పుస్తకంలోని రెండు ఘట్టాలు.



ఓ అనాత్మవాది ఆత్మకథ
అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి
పల్లవి పబ్లికేషన్స్
ఫోన్ : 9866115655

''నా వివాహానంతరం నా భార్యను మా ఊరు తీసుకెళ్తూ, తూముబారి ఊరి మధ్యలో బస్సు దిగి (కారు దిగి)– కారుకు బస్సుకు తేడా అప్పటి పల్లెటూరి జనాలకు తెలియదు– ఇంటికి నడిచి వెళ్తుంటే, ఆమె నా వెనుకనే వెన్నంటి నడుస్తుంటే, పెద్దవాళ్లు చూసి, ''ఏంట్రోయ్! నీ పెళ్లాం మడాలు (మడమలు) తొక్కుతూ నడుస్తుంది. కొంచెం దూరంగా నడవమను. ఇది పల్లెటూరు, బస్తీ కాదు'' అనేవారు.

''తెనాలి గురించి, అది కళా సాహిత్య రంగాలకు ఎలాంటి 'బౌద్ధిక వాతావరణాన్ని' సృష్టించిందో చెప్పాలి. దీనికొక చిన్న ఉదాహరణ: నేను వి.యస్.ఆర్. కళాశాలలో చేరిన తరువాత హితశ్రీ (కథకుడు; అసలు పేరు మతుకుమల్లి వెంకట నరసింహ ప్రసాదరావు), డాక్టర్ జి.వి. కృష్ణారావు (కీలు బొమ్మలు నవలా రచయిత), మా ఆంగ్లశాఖలో పనిచేసే పి.సత్యనారాయణ (బైటింగ్ క్రిటిక్), నేను గాఢ స్నేహితుల మయ్యాము. రోజూ కళాశాల వదిలిన తరువాత సాయంత్రం 5 గంటల ప్రాంతంలో నలుగురం సైకిళ్ల మీద తెనాలి నడిబొడ్డున బోస్ రోడ్డులో వీనస్ థియేటర్ పక్కన ఉన్న హోటల్ డె ప్రెసిడెంట్ (ఆ హోటలుకు ఆ పేరు పెట్టడంలో తెనాలి సాహితీ వైభవం తెలుస్తుంది) కు కాఫీ సేవనానికి వెళ్లేవాళ్లం. మేము రోజూ రావడాన్ని, అదే మూల ఒక టేబుల్ వద్ద కూర్చోవడాన్ని హోటల్ యజమాని గ్రహించాడు. ఒక రోజు, మా వద్దకు వచ్చి ''మీలాంటి సాహితీమూర్తులు మా హోటలకు వచ్చి సాహితీ చర్చ చేయడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తున్నది. దీనిని నేను అదృష్టంగా భావిస్తున్నాను'' అని చెప్పి, మా బల్లకు సంబంధించిన సర్వరును పిలిచి, ''ఆ నలుగురు ఎన్నిసార్లు కాఫీ అడిగితే అన్నిసార్లు ఇవ్వు. బిల్లు మాత్రం రాయవద్దు'' అని ఆదేశించాడు. మేము రాత్రి పది గంటల దాకా కూర్చునేవాళ్లం. అప్పటికే బల్లలు, కుర్చీలు ఖాళీచేసి సర్దివేసేవారు. కాని మా బల్లను ఖాళీ చేయమని అడిగేవారు కాదు. ఒక హోటలు నడుపుకునే యజమానికి అంతటి సంస్కారం ఉందంటే ఊహించండి, నాటి క్లైమేట్ ఆఫ్ ఒపీనియన్.''

పదం పలికింది - పాట నిలిచింది

## నే సందెవేళ జాబిలి నా గీతమాల ఆమని



ఒక బృందావనం సోయగం
ఎద కోలాహలం క్షణక్షణం
ఒకే స్వరం సాగేను తీయగా
ఒకే సుఖం విరిసేను హాయిగా
నే సందెవేళ జాబిలి
నా గీతమాల ఆమని
నా పలుకు తేనె కవితలే
నా కులుకు చిలక పలుకులే
నే కన్న కలల మేడ నందనం
నాలోని వయసు ముగ్ధ మోహనం
నే మనసు పడిన వెంటనే
ఓ ఇంద్రధనుసు పొందునే
ఈ వెండి మేఘమాలనే
నా పట్టు పరుపు చేయనే
నే సాగు బాట జాజి పూవులే
నాకింక సాటి పోటి లేదులే

**వ**యసు తుళ్లింతలోని అందాన్నీ, అతిశయాన్నీ మనోహరంగా చెప్పిన పాట. సినిమా ఘర్షణ. రచన రాజశ్రీ. తమిళంలో ఈ పాట రచయిత వాలి. సంగీతం ఇళయరాజా. పాడినవారు వాణీ జయరాం. తమిళంలో జానకి పాడటం గమనార్హం. 1988లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు మణిరత్నం. పాటలోని నటీనటులు నిరోషా, కార్తీక్.

సాహిత్య మరమరాలు

## మరి ఆమె ఎవరు?



**ఒ**కసారి ఆకాశవాణి హైదరాబాద్ ఆవరణలో జరిగిన సంఘటన. అప్పట్లో రేడియోలో స్పోకెన్ వర్డ్ ప్రయోక్తగా పనిచేస్తున్న రావూరి భరద్వాజ గేటు వైపు నడుస్తూ బయటికి వెళుతున్నారు. గేటులోంచి ఆకాశవాణికే చెందిన ఒక ఉన్నతాధికారి తన భార్యతో లోనికి ప్రవేశించారు. ఆయన రావూరి గారికి అభివాదం చేసి, తన భార్యని వారికి పరిచయం చేశారు. ఉన్నట్టుండి భరద్వాజ సీరియస్‌గా మొహం పెట్టి ''మొన్నామధ్య భార్య అంటూ మరొకరినెవర్నో పరిచయం చేశారు?'' అని అన్నారు. దాంతో ఆ అధికారి బిత్తరపోయి ఇబ్బందిగా మొహం పెట్టారు. తన చమత్కారానికి తనే భళ్లున నవ్వేస్తూ వాతావరణాన్ని తేలికపరిచారు రావూరి. విషయం అర్థమయ్యి దంపతులిద్దరూ ఫక్కున నవ్వారు.

◆ ఎస్.హనుమంతరావు
(ఆకాశవాణి విశ్రాంత అధికారి)

### రారండోయ్

- ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణకు సిటీ కాలేజి మఖ్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డును ఆగస్ట్ 27న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సిటీ కాలేజీలోని గ్రేట్ హాల్‌లో ప్రదానం చేయనున్నారు. ముఖ్య అతిథి: నందిని సిధారెడ్డి.
- దేవిప్రియ లవ్ పోయెమ్స్ సంకలనం 'స్లీపింగ్ విత్ ద రెయిన్‌బో' ఆవిష్కరణ ఆగస్ట్ 28న సా॥ ఆరింటికి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరగనుంది. ఆంగ్లానువాదం: విజయ్ కోగంటి. ముఖ్య అతిథి: మాధవ్ కౌశిక్. నిర్వహణ: సమతాబుక్స్, ఛాయ.
- గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆగస్ట్ 29న ఉదయం 10 గంటలకు గుంటూరులోని యూటీఎఫ్ హాలులో 'తెలుగు భాషాదినోత్సవం' జరపనుంది. తెలుగు భాష కోసం కృషి చేసినవారికి సత్కారం, కవి సమ్మేళనం ఉంటాయి.
- గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 29న సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిడుగు జయంతి ఉత్సవాలు జరగనున్నాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ బిక్కి కృష్ణ తెలియజేస్తున్నారు.
- 'సమకాలీన కథ'పై రాష్ట్రస్థాయి సదస్సు సెప్టెంబర్ 1న ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకు ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరగనుంది. ముఖ్య అతిథులు: వాడ్రేవు చినవీరభద్రుడు, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, పాపినేని శివశంకర్. నిర్వహణ: జానుడి, శాంతివనం, కథా ప్రకాశం.
- తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా (తెల్సా) నిర్వహించిన కథల పోటీలో ముప్పై వేల రూపాయల మొదటి బహుమతిని 'కొండ' కథకుగానూ పూడూరి రాజిరెడ్డి గెలుచుకున్నారు. ఇరవై వేల రెండవ బహుమతి 'రాగరాగిణి'కిగానూ జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తికి దక్కింది. పదిహను వేల 2 మూడవ బహుమతులను వి–రాగి (ఈ గాయమెంత తియ్యనో), కె.ఎ.మునిసురేశ్ పిళ్లె (వరాలత్త గాజులు) గెలుచుకున్నారు. పది వేల విశిష్ట రచనకు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తిదే మరోకథ ఎంపిక కాగా; ఐదు వేల ప్రోత్సాహక బహుమతులకు వసుంధర, జగన్ మిత్ర, ఎండపల్లి భారతి, అరుణ పప్పు, వెంకటమణి ఈశ్వర్, కె.వరలక్ష్మి కథలు ఎంపికైనాయి. తెల్సా బృందం మురళి చందూరి, పద్మ ఇంద్రగంటి, బాపారావు కొచ్చెర్లకోట ఈ ఫలితాలను ప్రకటించారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ ॥ సోమవారం

26-8-2019



ఉప్పు తగ్గింది

– సినిమా పేజీ



ప్రతీకాత్మక చిత్రం

# ఏదైనా ఫేస్ చేస్తారు

**స్వేచ్ఛకు వేరే భాష ఉంటుంది..**
**భాష్యం ఉండదు!**
**ఒక గ్రామర్ ఉంటుంది...**
**అందరితో సంధికలుపుకొనే వ్యాకరణం ఉంటుంది!!**
**స్వేచ్ఛ అక్షరంలా చాలా పదునైంది**
**సమాజంలోని చెడును చీల్చి చెండాడుతుంది**
**ఫేస్‌బుక్‌లో కొందరు అదే చేస్తున్నారు..**
**ఫేస్ చేస్తున్నారు.. ఏదైనా ఫేస్ చేస్తున్నారు!!**

శీలం ఫ్రేమ్‌లో ఆడవాళ్లను చూస్తూ నోరుపారేసుకునే మగవాళ్లకు అదే తీరుగా కవిత్వంతో, కార్టూన్లతో కౌంటర్ ఇస్తారు.. రాజకీయ తాజా పరిణామాల మీద అద్భుతంగా విశ్లేషిస్తారు... ఆర్థిక వ్యవస్థ గురించి కామన్ మ్యాన్‌కు అర్థమయ్యేలా కామెంట్ పెడ్తారు.. కశ్మీరుకు స్వాతంత్ర్యం ఎందుకు కావాలో చెప్తారు.. అర్జున్ రెడ్డి గొప్ప ప్రేమికుడు ఎందుకు కాదో వివరిస్తారు.. మోషే బ్రష్‌లో పొరపాటుగా దొర్లిన జెండర్ ఇన్‌సెన్సిటివిటీని ఇట్టే పసిగట్టేస్తారు.. దేశ రక్షణ వలయాన్ని.. టెర్రరిస్ట్‌ల చొరబాటును నిష్కర్షగా నిలదీస్తారు.. పలుభాషల సాహిత్య ప్రయోగాలకు తెలుగు అనువాదాన్ని పరిచయవేదికగా మలుస్తారు.. దేవుడి చుట్టూ అల్లుకున్న నమ్మకాల పరిధికి సైన్స్ లాజిక్ లోతును చూపిస్తారు.. కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా స్త్రీ ఎదగాల్సిన సామాజిక అవసరాన్ని గుర్తిస్తారు.. పవర్ పాలిటిక్స్‌ను ఎదుర్కోవడానికి చదువును మించిన ఆయుధం లేదని సూచిస్తారు...

ఎక్కడ? ఫేస్‌బుక్‌లో! ఎవరు? బాధ్యతగల పౌరులు... సమాజం పట్ల కన్‌సర్న్ ఉన్న మనుషులు.. రచయిత్రులు. ఓహ్.. ఇంత ఉపోద్ఘాతం స్త్రీవాదం గురించేనా అని పెదవి విరువవద్దు. మహిళలు ఏం చెప్పినా స్త్రీవాదాన్ని ప్రమోట్ చేసుకోవడానికే అనే ప్రిజుడీస్‌ను వదిలిపెడితే అర్థమవుతుంది.. అన్ని రంగాల మీద వాళ్లకున్న అవగాహన, ఆలోచనలు, అభిప్రాయాలు. వాళ్ల రచనలు స్త్రీల ప్రతిభనే కాదు స్త్రీల ఆత్మగౌరవాన్నీ చాటుతున్నాయి. ఈ ఫ్రెండ్స్ లిస్ట్‌తో ఉన్న ఫేస్‌బుక్ అకౌంట్ నిజంగా ఒక పుస్తకమే. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక చరిత్రకు ఆధారాలుగా శిలాశాసనాలు, తాళపత్రాలు, గ్రంథాలే నిలిచాయి. ఇప్పటి నుంచి ఫేస్‌బుక్‌లోని ఈ టైమ్‌లైన్స్ కూడా ఆర్కైవ్స్‌లో భద్రం కావాల్సిన అవసరం ఉంది. ఈ చైతన్యం గురించి భవిష్యత్తరాలు తెలుసుకోవడం కోసం. ట్రోలింగ్స్‌కి వెరవకుండా.. ట్రోలర్స్ బయోగ్రఫీని వాల్స్ మీద పోస్ట్ చేస్తూ ఒకరకంగా అక్షరపోరాటం చేస్తున్న ఆ రచయిత్రుల ఇంట్రడక్షనే ఈ కథనం. సందర్భం ఏంటీ అని వెంటనే రెండు కనుబొమలు కలుసుకోవచ్చు. మంచి పరిచయానికి ప్రత్యేకమైన సందర్భం ఉండాల్సిన అవసరం లేదేమో!

## పద్మావతి బోడపాటి



దూరదర్శన్ యాదగిరి– నల్గొండ రిలే స్టేషన్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్న పద్మావతి. వైవిధ్యమైన అంశాలను స్పృశిస్తారు,అనువదిస్తారు. ఫేస్‌బుక్ పాఠకుల కోసం ప్రస్తుతం ఫ్రెంచ్ రచయిత సిమోన్ ది బువా రచించిన 'ది సెకండ్ సెక్స్'ను తెలుగులోకి అనువదిస్తున్నారు. ''డాక్టర్ యడవల్లి రమణ గారి ప్రోత్సాహంతోనే ఎఫ్‌బీలో రాయడం మొదలుపెట్టా. నిజం చెప్పాలంటే నా రచనాశక్తిని అంచనా వేసుకోవడానికే ఎఫ్‌బీలో రాయడం స్టార్ట్ చేశా. ప్లాన్డ్‌గా డిసిప్లిన్డ్‌గా రాసే అలవాటు లేదు. ఇలా రాయాలి.. అలా రాయాలి అనీ అనుకోను. ఏ రోజు ఏమనిపిస్తే అది రాసేస్తాను. ఫేస్‌బుక్‌లో మనం పోస్ట్ చేసిన వెంటనే వచ్చిన రెస్పాన్స్ చాలా ఉత్సాహాన్నిస్తుంది. అలాగే ఎఫ్‌బీలో విభిన్నమైన విషయాల మీద రాసే రచనలను చదవొచ్చు. జ్ఞానాన్ని మించిన ఆయుధం లేదు. అందుకే ముందు మనం జ్ఞానవంతులం కావాలి. జ్ఞానంతో ఎంపవరవుతాం'' అంటారు పద్మావతి.

## ఉషా తురగ రేవెల్లి...



వ్యంగ్యం ఆమె అస్త్రం. ఇడ్లీ, కాఫీ, నీడ, ట్రాఫిక్, పాట, భాష, కోతి, కోడి, కంప్యూటర్, కారు, తల్లి, పిల్ల, బామ్మ, తాత, ప్రేమ, కోపం, అలక, ఒంటరితనం, జీవితం, లోకం.. ఇలా ఏవీ.. ఎవరూ ఆమె రైటప్‌కి అనర్హం కాదు.. అనర్హులు కారు. ప్రస్తుతం వ్యంగ్యరచనలు చేసే అతికొద్ది మందిలో ఉషా తురగ రేవెల్లి ఒకరు. ప్రస్తుతం ప్రసారభారతిలో పనిచేస్తున్నారు ఆమె. అంతకుముందు ఇండియన్ ఎక్స్‌ప్రెస్, డెక్కన్‌క్రానికల్‌లో పనిచేశారు. ఇప్పుడు కూడా పలు పత్రికలకు వ్యాసాలు రాస్తూంటారు. ''ఎఫ్‌బీ ఒక ఊరటగా, కౌన్సెలర్‌గా, సంఘీభావంగా, ఫ్యామిలీ, ఫ్రెండ్స్ లేని చోట ఒక సపోర్ట్‌సిస్టమ్‌గా పనిచేస్తోంది. చర్చలకు ఒక ప్లాట్‌ఫామ్‌గా ఉంటోంది మంచిదే. ఆ చర్చలన్నీ కార్యరూపం దాల్చాలి. మోర్ కన్‌స్ట్రక్టివ్‌గా సాగాలి.. సాగేందుకు అవకాశం ఉంది. సోషల్‌ఛేంజ్‌కు ఫేస్‌బుక్ మంచి ఉపకరణంగా మారితే బాగుంటుంది'' అంటారు ఉషా తురగ రేవెల్లి.

## రమా సుందరి



గుంటూరులోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ ఫర్ విమెన్‌లో ఈసీఈ విభాగాధిపతిగా పనిచేస్తున్న రమాసుందరి మాతృక మాస పత్రికనూ నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియాలో రైటర్‌గా ఆమెది ప్రత్యేక స్థానం. కుల, మత, లింగ, రాజకీయ, ఆర్థిక, సామాజికాంశాలతో పాటు సినిమాల మీదా రాస్తారు. ఇంగ్లీష్ వెబ్ జర్నల్స్ వ్యాసాలనూ తెలుగులో అనువదిస్తారు. ''సమకాలీన ఆలోచనల ప్రతిబింబం ఫేస్‌బుక్. నా సీరియస్ రాతలు ఫేస్‌బుక్ నుంచే ప్రారంభమయ్యాయి. నా అన్‌లెర్నింగ్ ప్రాసెస్ కూడా ఇక్కడి నుంచే మొదలైంది. అనేకమంది కవులు, రచయితలు, అభ్యుదయ భావాలు కలిగిన వాళ్లు, హక్కుల కార్యకర్తలు, సమాజం కోసం ఆలోచించేవారు ఇక్కడే పరిచయమయ్యారు. ఒక్కమాటలో చెప్పాలంటే అపరిమితమైన లోకాన్ని నాకు ఫేస్‌బుక్ పరిచయం చేసింది. నా పూర్వవిద్యార్థులను చాలామందిని ఫేస్‌బుక్ నాకు సన్నిహితంగా ఉంచుతోంది. నేను రాస్తున్న చాలా విషయాలు వాళ్ల జీవిత నిర్మాణానికి ఉపయోగపడ్తున్నాయని వాళ్లు చెబుతుంటే సంతోషంగా ఉంటుంది. ఫేస్‌బుక్‌ను నేనొక సామాజిక పత్రికలాగే ఉపయోగిస్తాను'' అని చెబుతారు రమా సుందరి.

## సౌమ్య ఆలమూరు



నిజానికి ఆమె ఎకానమిస్ట్. కాని ప్రస్తుతం బీబీసీ (ఢిల్లీ)లో ఈఎల్‌టీ ప్రొడ్యూసర్‌గా పనిచేస్తున్నారు. రాయడమంటే ఆమెకు ఇష్టం. అందుకే ఫేస్‌బుక్ వాల్‌నే పుటగా మలచుకున్నారు. ఢిల్లీ మెట్రో కథలు రాసి ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. కామన్ థింగ్ నుంచి కంట్రీ పాలసీస్ దాకా అన్నిటి మీదా స్పందిస్తారు. సహేతుకంగా విమర్శిస్తారు. ''ఫేస్‌బుక్‌లో రాయడంలో ఉన్న అడ్వాంటేజ్ ఏంటంటే.. ఇదిలాగే రాయాలి, ఫలానా పద్ధతిలోనే చెప్పాలి అనే ఫ్రేమ్ ఉండదు. నచ్చినవి నచ్చినట్టు రాసేయొచ్చు. ఘాటుగానూ చెప్పొచ్చు. అభిప్రాయాలకైనా , కథలకైనా ఇమిడియెట్ రీచ్ ఉంటుంది. ఒక అంశానికి సంబంధించి డిఫరెంట్ అండ్ మల్టిపుల్ యాంగిల్స్ తెలుస్తాయి. అన్నిటికీ మించి రచయితకు పాఠకుడికి కనెక్టివిటీ ఉంటుంది. పాఠకుడి అభిప్రాయమూ వెంటనే తెలుస్తుంది. వాల్ మీద్ కాకుండా ఇన్‌బాక్స్‌లో తమ అభిప్రాయాలను తెలిపే సైలెంట్ రీడర్స్ కూడా ఉంటారు. ఎఫ్‌బీ వల్ల టైమ్ వేస్ట్ అంటుంటారు కాని నేను చాలా నేర్చుకున్నాను. క్రిస్ప్‌గా, షార్ట్‌గా రాయడం తెలిసింది. అన్నిటికన్నా ముఖ్యంగా యువన్ నోహ్ హారారి తన '21 లెసన్స్ ఫర్ ట్వంటి ఫస్ట్ సెంచరీ' అనే పుస్తకంలో చెప్పినట్టు అడాప్ట్ చేసుకోవడం వస్తుంది. ఏ చర్చ అయినా, రచన అయినా చదువైనా అడాప్ట్ చేసుకోవడాన్నే నేర్పాలి'' అంటారు సౌమ్య.

## సుజాత సూరేపల్లి



శాతవాహన యూనివర్సిటీలో సోషియాలజీ విభాగాధిపతిగా పనిచేస్తున్న ఆమె.. రాజకీయ, సాంఘిక అంశాలకు ఎన్‌సైక్లోపీడియా. ఎంతటి సీరియస్ విషయాన్నైనా రెండు వాక్యాల్లో కుదించి అందరికీ అర్థమయ్యేలా సూటిగా రాయడం ఆమె ప్రత్యేకత. బయటే కాదు ఫేస్‌బుక్‌లో కూడా ఉద్యమాలతోనే ఉనికి చాటుకుంటూ వస్తున్నారు. కుల, మత, పురుషాధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా గళాన్ని వినిపించడమే కాదు ఫేస్‌బుక్‌లో కలాన్నీ సంధిస్తున్నారు. మహిళల గురించి నోరుపారేసుకుంటున్న వాళ్లకు భయం రుచి చూపించారు. ''ఆడవాళ్ల రాతలు నగలు, చీరలు, వంటలు, వెన్నెల రాత్రుల మీదే అనుకుంటారు. ఫస్ట్ నుంచీ నా ఫేస్‌బుక్ పేజీ పొలిటికల్, సోషల్ మూవ్‌మెంట్‌గానే ఉంది. వీటితోనే నేను ప్రజలకు కనెక్ట్ అయ్యాను.. ప్రజలు నాకు కనెక్ట్ అయ్యారు. ఎఫ్‌బీ వల్ల నాకూ చాలామంది యాక్టివిస్ట్‌లతో పరిచయం అయింది. అయితే రోహిత్ వేముల ఆత్మహత్య, ప్రణయ్ (అమృత భర్త) హత్య తర్వాత కులానికి సంబంధించి చాలామంది ఇన్నర్‌సెల్ఫ్‌నూ బయటపెట్టింది ఫేస్‌బుక్. యాక్చువల్ ఫేసెస్‌కు అద్దంలా ఉంది ఫేస్‌బుక్'' అంటారు సుజాత.

## స్వాతి వడ్లమూడి



ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నారు. సోషల్ మీడియా కార్టూనిస్ట్ కూడా. ఆమె అక్షరానికి భయం ఉండదు. ఆమె కుంచెకు వెరుపు ఉండదు. ఆమె భావానికి మొహమాటం ఉండదు. రాత అయినా.. కార్టూన్ అయినా ప్రజల పక్షమే. ఇంకా చెప్పాలంటే బాధితుల పక్షం! రాజకీయాలు, జెండర్, సాహిత్యం ఏదైనా సరే నిర్మొహమాటమే ఆమె వైఖరి. ''మనకున్న పొలిటికల్ అభిప్రాయాలను న్యూస్‌పేపర్లలో నిష్కర్షగా చెప్పే వీలు ఉండదు. వితవుట్ రెస్ట్రిక్షన్స్, ఎడిటింగ్ మన అభిప్రాయాలను చెప్పే ప్లాట్‌ఫామ్ ఫేస్‌బుక్కే. చిన్న చిన్న విషయాల నుంచి సీరియస్ ఇష్యూస్ దాకా అన్నిటి మీద అనిపించింది అనిపించినట్టుగా రాస్తున్నాను. కార్టూన్స్ వేస్తున్నాను. అయితే అభిప్రాయాలు, ఆలోచనల విషయంలో ఇచ్చిపుచ్చుకునే తీరుతో వ్యవహరించాలి. ముందస్తు భ్రమలు, భ్రాంతుల్లేకుండా విశాల దృక్పథంతో ఉండాలి. అవతలి వాళ్ల పాయింట్ ఆఫ్ వ్యూ పట్లా గౌరవం ఉండాలి. మెయిన్‌స్ట్రీమ్ మీడియాలో కన్నా సోషల్ మీడియాతోనే చాలా నేర్చుకున్నాను'' అంటారు స్వాతి వడ్లమూడి.

### ఇంకా ఉన్నారు...

చైతన్య పింగళి, అపర్ణాతోట, మెర్సీమార్గరెట్, సాయి పద్మ, రాధా మండువ, మానస యెండ్లూరి.. ఇలా చెబుతూపోతే ఇక్కడ స్థలం సరిపడని జాబితా ఆ రచయిత్రులది. వీళ్లంతా ఫేస్‌బుక్‌లో తమ రచనలతో కొత్త దృక్పథాలకు పదును పెడ్తున్నారు. చేతన కలిగించడంలో తమ వంతు పాత్రను పోషిస్తున్నారు. ట్రోలింగ్ ఎదురైనా.. బెదిరింపులు వచ్చినా.. వణుకు అంటూ ఎరుగని ఆ రాతలు ప్రవాహమై సాగుతూనే ఉన్నాయి.. ముతక భావాలను, జిడ్డు ఆలోచనలను కడిగేస్తూ!

**– సరస్వతి రమ**

## చెట్టు నీడ

# అమ్మకు తెలియదా!

ఒకరోజున ఆరుగురు వ్యాపారస్థులు నెత్తిన దూది బస్తాలు పెట్టుకొని వ్యాపార నిమిత్తం సమీప పట్టణానికి బయలు దేరారు. ప్రయాణం అడవిమార్గం గుండా సాగుతుంది. ఆ మార్గం కాస్త భయంకరమైనదని, క్రూరమృగాలతోపాటు దోపిడీదారులున్నారని కూడా తెలుసు. దాంతో వీలైనంత తొందరగా భయం భయంగా అడవి దాటాలని చూస్తున్నారు. నిజంగానే ఒక అడవి దొంగ దారికాచి వీరిని గమనించాడు. ఇప్పుడు వీరిని అడ్డగించి దోచుకోవడంవల్ల ప్రయోజనముండదు. వీరు వ్యాపారం ముగించుకొని తిరిగి వచ్చేటపుడు వీరి దగ్గర ధనముంటుంది. అప్పుడు దోచుకోవచ్చనుకున్నాడు. అతని దగ్గర తుపాకి వుంది. తూటాలు వేరుగా దాచుకున్నాడు. అవి తను స్వయంగా పేలుడు మందు, రవ్వలు దట్టించి, తూటా మూసి మైనపు పూతతో కప్పి తయారు చేసుకున్నాడు. వ్యాపారస్థులు అడవి దాటి మైదానం చేరుకున్నారు. ముందుకు సాగుతున్నారు. కనుచూపు మేరలో నీడలేదు.

ఎండ మెండుగా వుంది. వేడికి తట్టుకోలేకపోతున్నారు. అటూ ఇటూ చూస్తే కొద్ది దూరంలో ఓ చెట్టు కనబడింది. ఆ నీడ చాల చిన్నది. ఆరుగురు నిలబడితే మాత్రం నీడ



పడుతుంది. బస్తాలు నీడన పెట్టలేరు. సరే కాసేపు సేదదీరుదామని ఆరుగురూ చెట్టు నీడన చేరి, పత్తిబస్తాలు ఎండలోనే చుట్టూ పెట్టుకొని నిలుచున్నారు. కొంచెం సాంత్వన కలిగింది. ఇంతలో చూస్తుండగనే ఎండ వేడికి పత్తిబస్తాలు అంటుకున్నాయి. గమనించే లోపే ఆరు పత్తిబస్తాలు కాలి బూడిదయిపోయాయి. ''అమ్మా! నిన్ను తలచి వ్యాపారానికి బయలుదేరాను. కానీ నువ్వు చేసిందేమిటి? నా సరుకును సర్వనాశనం చేశావు. నేను బతికేదెలా? నిన్ను ప్రార్థించడం, పూజించడం వృథా'' అంటూ నిందించడం మొదలుపెట్టాడు వారిలోని ఓ వ్యాపారి. మిగతా వారు అతన్ని ఓదార్చారు. కాసేపయ్యాక చేసేదేమీ లేక తిరుగు ప్రయాణమయ్యారు. అడవిదొంగ వీరి రాకను గమనించి వారివద్ద ధనం దోచుకుందామని, తుపాకీ పేల్చి భయపెట్టాలనుకున్నాడు. తుపాకీ పేలలేదు. ఎండవేడిమికి తూటాలపై పూసిన మైనం కరిగిపోవడంవల్ల, తూటాలో మందు పట్టుతగ్గడంవల్ల తూటా పేలలేదు. అతను ఒక్కడు... వీరు ఆరుగురు. లాభం లేదనుకొని దొంగ పారిపోయాడు. ఐదుగురు బతుకుజీవుడా అనుకున్నారు. అమ్మను నిందించిన వాడు మాత్రం భూమిపై పడి, భూమికి నమస్కరించి ఏడుస్తున్నాడు. ''అమ్మా! నీ కరుణను తెలుసుకోలేకపోయాను. మన్నించు. నిన్ను నమ్మినవారికి నాశనమేముంటుంది? బతుకునిచ్చావమ్మా. క్షమించు'' అంటూ చింతిస్తున్నాడు. పశ్చాత్తాపపడుతున్నాడు. అమ్మకు తెలియదా... తన బిడ్డలకు ఎప్పుడు ఏమి ఇవ్వాలో, ఏమి ఇవ్వకూడదో!

**– విశ్వేశ్వరవర్మ భూపతిరాజు**

## పదగారడి

# మాయామాటల బజార్

**తెలుగు.. ఇంగ్లీష్ అయిపోతోంది అని ఇంగ్లీష్ పదాలను పలకడానికి.. మట్లాడ్డానికి వీల్లేని తెలుగు పదాలతో సమం చేస్తే సబబా? బాగుంది.. మరి తెలుగు తేనెలూరేదెట్లా? బహు బాగుంది.. మాయాబజార్ ఎన్ని కొత్త తెలుగు పదాలను కనిపెట్టలేదు? పింగళి నాగేంద్రరావు, కేవీ రెడ్డితో కలిసి సృష్టించిన ఆ మాటల మాయలో పడి ఇంకా కొట్టుకుపోతూనే ఉన్నాం! ఆ నిఘంటువు ఆంగ్లపదాలకు తెలుగు సమానార్థకాలను కనిపెట్టే క్లూ ఇస్తుందేమో .. చదువుదాం..**







● 'మాయాబజార్' చిత్రంలోని సన్నివేశాలు



అస్మదీయులకు వ్యతిరేక పదం యుష్మదీయులు. సంస్కృతంలో ఉన్న అస్మత్, యుష్మత్ శబ్దాలకు కొత్త భాష్యం చెప్పారు పింగళి. అరవయ్యేళ్ల కిందటే కొత్త భాషను సినిమాలో పరిచయం చేశారు కె. వి. రెడ్డి, పింగళి నాగేంద్రరావు జంటగా. అచ్చతెలుగు పేర్లతో సినిమాలు వచ్చే రోజుల్లోనే మాయా బజార్ అనే ఉర్దూ పదంతో ఉన్న తెలుగు పౌరాణికాన్ని వెండి తెర మీద మెరిపించి ప్రేక్షకులను మురిపించారు. కొత్త కొత్త పదాలను కనిపెట్టి, ప్రయోగించారు..వాటితో ఆడుకున్నారు. అవి నిజంగా ఉన్న పదాలేమో అన్నంతగా మాటల్లో కలిపేశారు. పింగళి నాగేంద్రరావు సంస్కృతం బాగా అధ్యయనం చేసి, పాణినిని ఔపోసన పట్టి ఉంటారు. అందుకే సంస్కృత వ్యాకరణంలోని ఎన్నో పదాలను, ప్రత్యయాలను తెలుగు చేసేశారు. అస్ మస్ థస్, ఏ భ్యామ్, భ్యస్... అంటూ సంస్కృత ప్రత్యయాల గురించి తెలియనివారికి ఇవి నిజంగా మంత్రాలే అన్నంతగా భాషలో ఇమిడిపోయేలా చేశారు. మంత్రాలకు చింతకాయలు రాలతాయో లేదో కాని, ప్రత్యయాలు మాత్రం మంత్రాలుగా వచ్చి కూర్చున్నాయి.

### కోపధారి.. హైహై నాయకా

శ్రీకృష్ణుడు వాసుదేవుడైతే, బలరాముడు మాత్రం తక్కువా! ఆయన్ని బలరారామదేవుని చేశారు మాయాబజార్‌లో పింగళి. 'ముక్కోపాని' కి విరుగుడుగా 'ముఖస్తుతి'ని కనిపెట్టారు. శరధారి, బాణధారి లాగ 'కోపధారి' అంటూ సంకర ప్రయోగం చేశారు. ఘటోత్కచుని అనుయాయుడికి 'దుందుభి' అని పేరు పెట్టారు. ఈ సినిమాలోని 'బహు బాగుంది' అనే పదప్రయోగాన్ని నలభై సంవత్సరాల తరవాత వచ్చిన 'భైరవద్వీపం' అనే సినిమా కూడా వాడుకున్నది. 'మీరన్నది బాగుంది నేనన్నది బహుబాగుంది' అంటూ! ఇంగ్లీష్ హాయ్‌ని తెలుగైజ్ చేసి 'హైహై నాయకా' అంటూ గొప్పనాయకుడికి జేజేలు పలికించారు. పాండవుల ప్రతాపాలు, దేవగురుడు, కొండడవలదే, ఘనకీర్తి కొట్టవలదే అంటూ కొంగొత్త పదాలను చెక్కారు. అన్నమయ్యలాగ 'చిన్నమయ్య' పేరును సృష్టించారు. 'శత్రుమిత్ర చరిత్ర జ్ఞానం... మిత్రులను రక్షించాలి శత్రులను భక్షించాలి' అంటూ శత్రువు, మిత్రువులలోని 'వు' ని లోప సంధి చేశారు.

### దుషటచతుషటయం

మనిషిని పలకరించగానే 'ఏంటి' అనడాన్ని ఆంగ్ల 'వై' తో 'వై నాయకా' అంటూ ఆనాడే టెంగ్లిష్‌ను భాషించారు. బకాసురుడు, శకటాశురుడు వీళ్లేనా రాక్షసులు, నేనూ ఒక రాక్షసుడిని సృష్టిస్తాను అంటూ ''కుడ్యాసురా' అనే గోడ రాక్షసుడిని పుట్టించారు. 'కోర్ కోర్ శరణు కోర్' అంటూ తెర వెనకాల పలికించిన పద్ధతిని నేటికీ దర్శకులు అనుసరిస్తున్నారు. 'అసమదీయులు' అంటే 'మనవాళ్లు' అని నాడు మాయాబజార్ చెప్పిన కొత్త అర్థం ఈరోజు రాజకీయాల్లో మనవాళ్లకు ఓ పర్యాయపదంగా ఎలా స్థిరపడిందో వేరే చెప్పాలా? పైగా 'ఎవడూ పుట్టించకుండా మాటలెలా పుడతాయి?' అంటూ కొత్త పదాల ప్రయోగాన్ని సమర్థించుకున్నారు కూడా. దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకునులను కలిపి దుష్టచతుష్టయమని కాక 'దుషటచతుషటయం' అని సినిమాలో లంబూజంబూలు విడివిడిగా తప్పుగా పలికిన మాటనూ ''ఆ దుష్టచతుష్టయాన్ని అలాగే చీల్చి విడదీసి విడివిడిగా పొడిపొడి చేసేయాలి' అని ఘటోత్కచుడి సమయస్ఫూర్తితో సరిచేశారు. 'తక్షణ కర్తవ్యం'ని ప్రయోగిస్తూనే 'తక్షణ సమస్య'నూ వదిలారు. తండ్రి పితృపాదులైతే తాతను 'తాతపాదులు' చేశారు. అంతేనా లక్ష్మణకుమారుడి నోట 'సభాపరికి' అనే మాటను పలికించి దాన్నీ పాపులర్ చేశారు.

### అం..అః .. ఇం.. ఇః... ఉం..ఉః

అచ్చులలో ఆఖరి అక్షరాలు 'అం అః' లకు మరో ఇద్దరు అక్కచెల్లెళ్ల 'ఇం ఇః ఉం ఉః'లను జన్మకునిచ్చారు. ఎవరైనా జైత్రయాత్రకు వెళ్తారు, తీర్థయాత్రకు వెళ్తారు. కాని ఇందులో 'యుద్ధయాత్రకు' బయలుదేరుతారు.

'ఏనుగులు మింగావా! పర్వతాలు ఫలహారం చేశావా' అని వృద్ధరూపంలో ఉన్న శ్రీకృష్ణులవారితో కోపంగా సరసపలుకులు ఆడించారు. 'వంకాయ, బెండకాయ, బూడిద గుమ్మడికాయ' అనగానే పసుపుతాడు, పలుపుతాడు, పడతాడు గుర్తు రాకమానదు. 'వహ్వారే అప్పడాలు', 'మర్ఘారే అప్పళాలు' అంటూ తెలుగు వంటకాలకు ఉర్దూ కితాబులిచ్చారు. 'ఓహోరే అరిసెలుల్ల', 'భళీరే లడ్డులందు' అంటూ కొత్త విశేషణాలతో తీపిని అద్దారు. ఇక కంబళి గింబళి, తల్పం గిల్పం... ఇంటింటా వాడుక పదాలు అయిపోయాయి. కంబళికి అప్పగారు గింబళి, తల్పం కంటె పెద్దది గిల్పం అంటూ ఆ పదాలకు అర్థాలూ చెప్పేశారు. అస్తు అస్తు, 'గో భ్రాంతి, సమాధి భ్రాంతి'.. ఇలా ఎన్నని గుర్తుపెట్టుకోగలం! ఈ పదాలతో ఒక నిఘంటువునే తయారుచేయొచ్చు. పాదపీడనం తరవాత కరపీడనం చేయించాలి. కాని మాయాబజార్‌లో పింగళి.. పాణిగ్రహణం బదులుగా పాణిపీడనం చేయించారు. కన్నుల వెన్నెల కాయించారు, మనసున మల్లెలు పూయించారు.

ఈ పదాల లాహిరిలో తెలుగు జగమంతా ఊగుతూనే ఉంది.

**– వైజయంతి పురాణపండ**

epaper.sakshi.com

## లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నాదొక డిఫరెంట్ లవ్ స్టోరీ. ఒక అబ్బాయిని చాలా లవ్ చేశాను. చాలా అంటే చాలా పిచ్చిగా ఇష్టపడ్డాను. తను కూడా నన్ను లవ్ చేశాడు. వన్ ఇయర్ వరకూ హ్యాపీగానే ఉన్నాం కానీ.. అనుకోకుండా ఏమైందో తెలియదు.. నాతో మాట్లాడటం మానేశాడు. తన ఫ్రెండ్స్ కూడా ఏమైందో చెప్పలేదు. ఇప్పటికి టూ ఇయర్స్ అవుతోంది. వాట్సాప్‌లో నా స్టేటస్ లన్నీ చూస్తాడు. అన్నీ తన గురించే పెడతాను. అది తెలిసి కూడా రిప్లై ఇవ్వడు. రోజూ వాడి గురించే నా ఆలోచన. పిచ్చెక్కిపోతోంది. నాకు తెలుసు ఇక తను నా లైఫ్‌లోకి రాడని. అయినా మరిచిపోలేకపోతున్నాను. ఎన్ని సంబంధాలు వచ్చినా ఒప్పుకోలేకపోతున్నాను. దేని మీద దృష్టిపెట్టలనిపించట్లేదు. ఎంత పెద్ద హ్యాపీ మూమెంట్‌లో ఉన్నా తన ఆలోచనలే నన్ను ఇబ్బంది పెడుతున్నాయి. తను ఇక ఎప్పటికీ నాకు ఫోన్ చెయ్యడని తెలుసు. కానీ నా మనసు నా మాట వినట్లేదు. మీరే ఏదైనా సలహా ఇవ్వండి అన్నయ్యా ప్లీజ్.

– భార్గవి

పిచ్చి ముదిరింది!!

‘ఎంత ఇన్‌సెన్సిటివ్‌గా ఉంటారు సార్!? మీకు ఉత్తరం రాసింది మీ సిస్టర్.. కొంచెం ప్రేమగా మాట్లాడండి. లేకపోతే చాలా ఫీల్ అయిపోతుంది!!’

అవ్వాలి నీలూ! ఫీల్ అవ్వాలి!! వాడి లవ్ కోసం కాదు.. తన కోసం ఫీల్ అవ్వాలి. వన్ ఇయర్ ఎంజాయ్ చేసి పారిపోయాడు. ఇంకో అమ్మాయి కనబడిందేమో.. ట్రాప్ తర్వాత ట్రాప్ వేసుకుంటూ.. ఎన్ని ఇయర్స్ నుంచి.. ఎంతమంది అమ్మాయిల ఇయర్స్‌లో పూలు పెడుతున్నాడో ఆ దుర్మార్గుడు..? వాడి కోసం స్టేటస్‌లు పెట్టి మరీ ఫీల్ అవుతుంటే ఏం చెప్పమంటావు నీలూ? పిచ్చి ముదిరింది. నీది అందమైన ప్రేమైనా.. వాడిది నీచమైన మోసమని అర్థం చేసుకోకపోతే ఎలా??

‘ఎలా సార్? మీరు అంత కచ్చితంగా ఎలా చెబుతారు సార్? వాడు దుర్మార్గుడని.. మోసగాడని.. డర్టీ ఫెలో అని.. యూజ్‌లెస్ ఫెలో అని.. చీటర్ అని.. వాడికి వాడి ఓన్ అమ్మా చెల్లి అంటేనే రెస్పెక్ట్ లేదని.. వాడు ట్రస్ట్ వర్త్ కాదని.. ఇలాంటి వాడిని నడి రోడ్డు మీద నిలబెట్టి చెప్పుల వర్షం కురిపించాలని.. స్ట్రాంగ్ లేడీస్ నలుగురు కలిసి వీడి విలనిజం దుమ్ము దులిపించాలని.. వీడి తాట తీసి తిత్తి వీకి వేలాడదీయాలని.. అంత కచ్చితంగా ఎలా చెబుతారు సార్???

నీ ఎమోషన్‌లోనే ఆన్సర్ ఉంది నీలూ! నీకే కోపం నషాళానికి ఎక్కుతుంటే.. మరి భార్గవికి కూడా వాడంటే అసహ్యం వెయ్యాలి కదా నీలూ..!? ప్రేమ అనే ఒక పొర భార్గవి గుండెను కప్పేసి వాడి ద్రోహాన్ని ఒప్పుకోనివ్వడం లేదు..!

‘ఇప్పుడు చూస్తుంది సార్! నిజాన్ని చూస్తుంది. షి విల్ బీ హ్యాపీ సార్!’

**ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.**

**లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబర్ 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.**
lovedoctorram@sakshi.com

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 | 3 | 9 | | | | |
| | 7 | | 2 | 1 | 4 | 6 | 9 | |
| 6 | | 2 | | 7 | 5 | 3 | | |
| | | 6 | | | 2 | | 3 | |
| | 5 | 9 | | | | 4 | 2 | |
| | 2 | | 4 | | | 5 | | |
| | | 4 | 6 | 8 | | 7 | | 3 |
| | 6 | 5 | 7 | 2 | 3 | | 1 | |
| | | | | 4 | 1 | 8 | | |

**నిబంధనలు:** ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 6 | 3 | 5 | 4 | 9 | 7 | 1 | 2 |
| 2 | 1 | 9 | 3 | 6 | 7 | 5 | 4 | 8 |
| 4 | 7 | 5 | 8 | 2 | 1 | 3 | 6 | 9 |
| 5 | 8 | 6 | 1 | 9 | 3 | 2 | 7 | 4 |
| 7 | 9 | 1 | 2 | 5 | 4 | 8 | 3 | 6 |
| 3 | 4 | 2 | 7 | 8 | 6 | 9 | 5 | 1 |
| 9 | 3 | 7 | 6 | 1 | 2 | 4 | 8 | 5 |
| 6 | 5 | 4 | 9 | 3 | 8 | 1 | 2 | 7 |
| 1 | 2 | 8 | 4 | 7 | 5 | 6 | 9 | 3 |

## కొండారెడ్డి బురుజు సెంటర్‌లో...


మహేశ్ బాబు

‘ఒక్కడు’ సినిమాలో కొండా రెడ్డి బురుజు సెంటర్‌లో ప్రకాష్ రాజ్‌తో ఫైట్ చేశారు మహేశ్‌బాబు. ఆ సినిమాలో ఆ సీన్ ఓ హైలైట్‌గా నిలిచింది. ఇప్పుడు మరోసారి అదే సెంటర్‌లో అడుగుపెట్టారు మహేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా తెరకెక్కుతున్న చిత్రం ‘సరిలేరు నీకెవ్వరు’. రష్మికా మందన్నా కథానాయిక. ‘దిల్’ రాజు, అనిల్ సుంకర, మహేశ్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం కర్నూల్‌లో ఫేమస్ కొండారెడ్డి బురుజు సెంటర్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో సెట్ వేశారు. సుమారు 4కోట్ల వ్యయంతో ఈ సెట్‌ను వేశారని తెలిసింది. ఆ సెట్‌లోనే ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది. రాజేంద్రప్రసాద్, మహేశ్ బాబు మధ్య కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానున్న ఈ సినిమాలో విజయ శాంతి కీలక పాత్రలో నటిస్తున్నారు.

## శ్రీదేవి సైకిల్ ఎక్కారు

**వరుణ్ తేజ్ హీరోగా హరీశ్ శంకర్ రూపొందిస్తున్న చిత్రం ‘వాల్మీకి’. పూజా హెగ్డే, అథర్వ మురళి, మృణాళినీ రవి కీలక పాత్రలు చేస్తున్నారు. 14రీల్స్ ప్లస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. ఆదివారం పూజా హెగ్డే లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సినిమాలో శ్రీదేవి పాత్రలో పూజా కనిపించనున్నారు.**


పూజా హెగ్డే

# కొత్త ఆరంభం


దిగంగన, లక్ష్

లక్ష్, దిగంగనా సూర్యవన్షీ హీరోహీరోయిన్లుగా రమేశ్ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై పద్మావతి చదలవాడ నిర్మిస్తున్నారు. ఇంతకుముందు ఈ బ్యానర్‌పై ‘బిచ్చగాడు’, ‘డి 16’, ‘టిక్..టిక్..టిక్’ వంటి చిత్రాలు తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. తాజా చిత్రం చిత్రీకరణ త్వరలోనే మొదలు కానుంది. రవి ప్రకాశ్, రవి వర్మ, నోయల్ సేన్, చిత్రం శీను, కృష్ణేశ్వర్ రావ్, రామకృష్ణ, శరత్ తదితరులు నటించనున్న ఈ సినిమాకు శేఖర్ చంద్ర సంగీతం అందిస్తారు. ఈ చిత్రానికి రామకృష్ణ ఛాయాగ్రహకుడు.

# సస్పెన్స్ థ్రిల్లర్


రాశి, నందితా శ్వేత, శివ కంఠమనేని

శివ కంఠమనేని హీరోగా నటించనున్న సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఇందులో నందితా శ్వేతా కథానాయికగా నటిస్తున్నారు. రాశీ, శ్రీనివాసరెడ్డి కీలక పాత్రలు పోషించనున్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను లైట్ హౌస్ సినీ మేజిక్ పతాకంపై జి. రాంబాబు యాదవ్, ఆర్. వెంకటేశ్వర రావు, కె.ఎస్. శంకరరావు, వి. కృష్ణారావు నిర్మిస్తున్నారు. శివ, నందితా శ్వేత, రాశీలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి వాసవి గ్రూప్ విజయ్ కుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటుడు, నిర్మాత అశోక్‌కుమార్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు చంద్ర సిద్ధార్థ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత సి. కల్యాణ్, నటుడు రచయిత దర్శకుడు పోసాని కృష్ణ మురళి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ– ‘‘కుటుంబ కథా చిత్రమిది. అలాగే సస్పెన్స్ థ్రిల్లర్. రెండు షెడ్యూల్స్‌లో సినిమాను పూర్తి చేయాలనుకుంటున్నాం. నాలుగు పాటలను రికార్డ్ కూడా చేశాం’’ అన్నారు. ‘‘చాలా అవకాశాలు వచ్చాయి కానీ ఒప్పుకోలేదు. ఈ సినిమా కథ నచ్చి చేస్తున్నాను’’ అన్నారు రాశి. ‘‘ఈ సినిమాలో రాశికి అమ్మగా, నందితా శ్వేతకు అమ్మమ్మలా నటిస్తున్నాను’’ అన్నారు అన్నపూర్ణమ్మ. ‘‘ఇందులో నా పేరు లక్కీ. టెర్రర్ గాళ్‌గా కనిపిస్తాను’’ అన్నారు నందితా శ్వేత. ‘‘చాలా ఏళ్ల క్రితం తెలుగులో సినిమాలు చేశాను. ఆ తర్వాత కన్నడ పరిశ్రమకు వెళ్లి అక్కడ ఆరు సినిమాలకు దర్శకత్వం వహించాను. ఓ మంచి పాయింట్‌తో తాజా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాను’’ అన్నారు సంజీవ్. ‘‘అశ్లీలత, అసభ్యతలకు తావు లేకుండా కుటుంబమంతా కలిసి చేసేలా సినిమా తీస్తున్నాం’’ అన్నారు ఆర్. వెంకటేశ్వరరావు. ‘‘కథ నచ్చి నిర్మించాలని మేమంతా నిర్ణయించుకున్నాం’’ అన్నారు రాంబాబు. సంగీత దర్శకుడు సుధాకర్ మరియో, మాటల రచయిత అంజన్ మాట్లాడారు.

# వేడి వేడి జిలేబీలా కొనేస్తారు


కృతి, అభిరామ్

‘‘చిన్న సినిమా హిట్ అయిన తర్వాత బావుంది అని అందరూ అంటారు. కానీ దాన్ని షూటింగ్ వరకూ తీసుకురావడం చాలా కష్టం. ఈ సినిమా ఇక్కడి వరకూ వచ్చిందంటే దర్శకుడి శక్తి, నిర్మాతల నమ్మకం కనిపిస్తోంది’’ అన్నారు రచయిత బీవీఎస్ రవి. కృతి గార్గ్, అభిరామ్ వర్మ, కాలకేయ ప్రభాకర్ నటించిన చిత్రం ‘రాహు’. ఏవీఆర్ స్వామి, శ్రీ శక్తి బాబ్జి, రాజా దేవరకొండ, సుబ్బు వేదుల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుబ్బు వేదుల దర్శకుడు. ఈ చిత్రం టీజర్‌ను బీవీఎస్ రవి విడుదల చేసి, మాట్లాడుతూ – ‘‘టీజర్ బావుంది. వేడి వేడి జిలేబీలా ఈ సినిమాను కొనేస్తారని అనిపిస్తోంది’’ అన్నారు. ‘‘నిర్మాతలు చాలా ఇష్టంతో తీశారు. సూపర్ హిట్ అవుతుందని నమ్మకంగా ఉన్నాం’’ అన్నారు ‘మధుర’ శ్రీధర్. ‘‘ఓ ఫోటో వేయి మాటలు చెబుతుంది అంటారు. మా సినిమా ఏంటో మా టీజర్ మాట్లాడుతుంది. సినిమాకు పని చేసిన అందరికీ థ్యాంక్స్’’ అన్నారు సుబ్బు వేదుల. ‘‘నా సామర్థ్యాన్ని నమ్మి అవకాశం ఇచ్చిన దర్శక– నిర్మాతలకు థ్యాంక్స్’’ అన్నారు కృతి. ‘‘మాకు సినిమా గురించి పెద్దగా తెలియదు. సుబ్బు కథ చెప్పారు. మేం సపోర్ట్ చేశాం’’ అన్నారు నిర్మాత స్వామి.


నాని, ప్రియాంక, కార్తికేయ

# మాది రివెంజ్ ఎంటర్‌టైనర్

**– నాని**

‘‘రెండు ఐకానిక్ సినిమాల (సాహో, సైరా: నరసింహారెడ్డి చిత్రాలను ఉద్దేశించి) మధ్య వస్తున్నాం. ఆ రెండు సినిమాలకు మా చిత్రానికి రిలీజ్‌ల విషయంలో గ్యాప్ ఉంది కాబట్టి పెద్దగా టెన్షన్ లేదు. నేను కూడా ఆ సినిమాలను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను’’ అని నాని అన్నారు. విక్రమ్ కె కుమార్ దర్శకత్వంలో నాని హీరోగా తెరకెక్కిన చిత్రం ‘నానీస్ గ్యాంగ్‌లీడర్’. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేనీ, చెరుకూరి మోహన్, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం వచ్చే నెల 13న విడుదల కానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు నాని వెల్లడించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నాని మాట్లాడుతూ – ‘‘మంచి పాజిటివ్ ఎనర్జీతో ఈ సినిమా స్టార్ట్ చేశాం. చాలా ఎంజాయ్ చేస్తూ షూటింగ్‌ను కంప్లీట్ చేశాం. టీమ్ మెంబర్స్ నా బరువునంత పంచుకున్నారు. లక్ష్మి, శరణ్యగార్లతో నటించడం అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. ఇది మాకు ఒక హ్యాపీ ప్రాజెక్ట్. వచ్చే బుధవారం ట్రైలర్‌ను విడుదల చేస్తున్నాం. సినిమాలో సర్‌ప్రైజ్‌లు, నవ్వులు ఉంటాయి. వచ్చే నెల మొదటి వారంలో నేను–అనిరుధ్ చేసిన ఓ ప్రమోషనల్ సాంగ్ వీడియో రిలీజ్ ప్లాన్ ఉంది. ఈ సినిమాతో తెలుగు పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు ప్రియాంక. చిరంజీవిగారి ‘గ్యాంగ్‌లీడర్’ మంచి ఐకానిక్ మూవీ. ఆ సినిమా జానర్ వేరు. మా సినిమా రివెంజ్ ఎంటర్‌టైనర్. ఇందులో దేవ్ అనే విలన్ పాత్రలో కార్తికేయ చాలా బాగా చేశాడు. మైత్రీ నిర్మాతలు సినిమాలను చాలా క్వాలిటీగా తీస్తారు’’ అన్నారు. ‘‘యాక్టర్‌గా నాకు తక్కువ అనుభవం ఉన్నప్పటికీ ఈ సినిమాలోని దేవ్ పాత్ర నాకు ఇచ్చిన నాని, విక్రమ్‌గార్లకు థ్యాంక్స్. హీరో అవ్వాలనుకునే మాలాంటి వారికి నానిగారు ఒక ప్రేరణ. నా రోల్ భయపెట్టేలా ఉంటుంది’’ అన్నారు కార్తికేయ. ‘‘ఈ చిత్రం నాకు తెలుగులో తొలి సినిమా. నాకు కొంచెం కొంచెం తెలుగు వచ్చు. మంచి డెబ్యూ మూవీ దొరికింది’’ అన్నారు ప్రియాంక.


విజయ్

# వేసవికి వస్తున్నాం

ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ‘బిగిల్’ సినిమాతో ఫుల్ బిజీగా ఉన్నారు తమిళ హీరో విజయ్. ఈ సినిమా ఈ ఏడాది దీపావళికి విడుదల కానుంది. ఆ తర్వాత ‘మా నగరం’ ఫేమ్ లోకేష్ కనగరాజన్ దర్శకత్వంలో విజయ్ హీరోగా తెరకెక్కనున్న సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఎక్స్‌బీ ఫిల్మ్ క్రియేటర్స్ ఈ సినిమా నిర్మాణ భాగస్వామి. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించనున్నారు. సంతోష్ శివన్ ఛాయాగ్రహకుడు. ఈ సినిమా చిత్రీకరణ అక్టోబర్‌లో మొదలు కానుంది. వచ్చే ఏడాది వేసవిలో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. అజిత్ 60వ చిత్రం కూడా వచ్చే ఏడాది సమ్మర్‌లోనే విడుదల కానుంది. ఈ చిత్రానికి దర్శకుడు హెచ్.వినోద్.

# టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా ప్రతాని


ప్రతాని రామకృష్ణ గౌడ్

‘తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్’ (టీఎఫ్‌సీసీ) ఎన్నికలు ఆదివారం హైదరాబాద్ లో జరిగాయి. ప్రెసిడెంట్‌గా ప్రతాని రామకృష్ణ గౌడ్, ప్రధాన సలహాదారునిగా నిర్మాత ఏ.యమ్ రత్నం, వైస్ ప్రెసిడెంట్‌గా నిర్మాత గురురాజ్, రంగా రవీంద్ర గుప్తా, అలీ భాయ్, సెక్రెటరీలుగా కె.వి. రమణా రెడ్డి, కె .సత్యనారాయణ , ఆర్గనైజయింగ్ సెక్రెటరీలుగా వి. మధు, పూసల కిశోర్, రవీంద్ర గౌడ్, జాయింట్ సెక్రెటరీలుగా సతీష్, నాగరాజు గౌడ్, జి. శంకర్ గౌడ్, కోశాధికారిగా రామానుజం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటుగా ఈసీ మెంబర్స్‌గా వి. కృష్ణ రావు, హెచ్. కృష్ణ రెడ్డి, అలెక్స్, ఇ .సదాశివరెడ్డి, రాజు నాయక్, వెంకటేష్ గౌడ్, టి. శ్రీనివాస్ గౌడ్, టి. రాజేష్, ఎమ్. వెంకటేష్, ముఖావర్ వలి, మహాలక్ష్మి, బి. నాగరాజు (జడ్చెర్ల ) ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ‘తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్’ ప్రెసిడెంట్ పి.రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ – ‘‘తెలంగాణ ఫిలిం ఛాంబర్ బిల్డింగ్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తాం. పది ఎకరాల్లో సినీ వర్కర్స్ ఇళ్ల కోసం స్థలం కేటాయిస్తాం. కల్చరల్ సెంటర్ కోసం స్థల కేటాయింపుతో పాటు 24 శాఖల్లోని వర్కర్స్ అందరికీ పని దొరికేలా చూస్తాం. త్వరలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారిని కలిసి ఇవ్వన్నీ ప్రభుత్వం ద్వారా చేయాలని తీర్మానించుకు


సోనమ్ కపూర్

## ఉప్పు తగ్గింది

ఇకపై భోజన సమయాల్లో డైనింగ్ టేబుల్‌పై తప్పనిసరిగా ఉప్పు ఉండేలా చూసుకోవాలనుకుంటున్నారు సోనమ్ కపూర్. సాధారణంగా ఫ్రూట్స్, మంచి మంచి తినుబండారాల గురించి కాకుండా ప్రత్యేకంగా ఉప్పు గురించే సోనమ్ ప్రస్తావించడానికి కారణం లేకపోలేదు. సోనమ్ ‘ఐయోడిన్ లోపం’తో బాధపడుతున్నారు. అందుకే ఇక నుంచి ఉప్పు ఎక్కువగా తీసుకోవాలనుకుంటున్నారు. ‘‘వెజిటేరియన్ తినే వారందరికీ ఒక గమనిక. ఐయోడిన్ ఉన్న సాల్ట్‌ను భోజన సమయంలో తీసుకోవడం మర్చిపోకండి. నాకు ఐడియోన్ లోపం ఉన్నట్లు ఈ మధ్యే తెలిసింది’’ అని సోనమ్ పేర్కొన్నారు. సోనమ్ శాకాహారి. వెజిటేరియన్ ఫుడ్ తీసేవారు ఎక్కువగా ఫలాలు, కాయగూరలు వంటి వాటిని ఆహారంగా తీసుకుంటుంటారు. మాంసాహారంతో పోల్చుకుంటే వీటిలో ఉప్పు శాతం తక్కువ అంటారు. ఇక సినిమాల విషయానికి వస్తే... సోనమ్ కపూర్ నటించిన ‘జోయా ఫ్యాక్టర్’ చిత్రం వచ్చే నెలలో విడుదల కానుంది. ఇందులో దుల్కర్ సల్మాన్ హీరో.



పరిచయం గీతాంజలి

# గీతాంజలి టీచర్



● లధాక్ సంప్రదాయ దుస్తుల్లో గీతాంజలి

**గీతాంజలి సామాజిక కార్యకర్త, ఎంటర్‌ప్రెన్యూర్, విద్యావేత్త, ఒడిస్సీ నాట్యకారిణి, రష్యన్ బాలే నర్తకి. వీటితోపాటు కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించారామె. లధాక్‌లో విద్యా సంస్కరణ బాధ్యతను తలకెత్తుకున్నారు. దాంతోపాటు ఆమె దేశంలోని ప్రతి అమ్మాయికీ కరాటే నేర్పించాలని కంకణం కట్టుకున్నారు. 'స్త్రీ సాధికారత సాధన అనేది ఒక కలగా మిగల కూడదు. ఆ కల సాకారం కావాలంటే స్త్రీ... తన మీద జరిగే దాడులను తనకు తానుగానే సమర్థంగా ఎదుర్కోగలగాలి' అంటారు గీతాంజలి.**

## బడిలో అమ్మ భాష లేదు

లధాక్... పేరుకి మనదేశంలో భాగమే కానీ జీవనశైలి, సంస్కృతి టిబెట్‌కు దగ్గరగా ఉంటుంది. భాష వేరు, ఆహారం వేరు, ఆహార్యం వేరు. అక్కడి వాళ్లు లధాకీ భాష మాట్లాడతారు. ఈ నేపథ్యంలో ఇల్లు దాటి బడిలో కాలు పెట్టిన చిన్ని మెదళ్లను ఒక్కసారిగా అయోమయం ఆవరిస్తుంది. ఇంటి గుమ్మం వరకు మాట్లాడిన లధాకీ భాషకు తాళం పెట్టి రాష్ట్ర అధికార భాష ఉర్దూలో పెదవి విప్పాల్సిందే. అదే లధాక్ వాసుల జీవితాలను తరాలకు తరాలు వెనక్కు నెట్టేసింది. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి రెండు వేలు సంవత్సరం వరకు అక్కడ మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన వాళ్ల సంఖ్య ఐదు శాతానికి లోపే.

### ఫెయిలవుతున్నది పిల్లలు కాదు

కశ్మీర్‌లోని లధాక్‌లో పిల్లల మీద... 'బడికి రార'నే అపవాదు ఉండేది. నూటికి 95 మంది పిల్లలు మధ్యలోనే బడి మానేసేవాళ్లు. ఏడాదంతా బడికి వెళ్లిన పిల్లల్లో కూడా పై తరగతికి పాస్ అయ్యే వాళ్లకంటే ఫెయిల్ అయ్యే వాళ్లే ఎక్కువ. నిజానికి ఇక్కడ ఫెయిల్ అయింది పిల్లలు కాదు, ప్రభుత్వ విద్యావిధానం. ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యావిధానం లధాక్ వాసుల భాషకు, స్థానిక సంస్కృతికి పూర్తిగా భిన్నంగా ఉండడమే. దాంతో లధాక్‌లో విద్యాసంస్కరణకు, ప్రత్యామ్నాయ విద్యా విధానానికి బీజం పడింది. పిల్లలు స్థానిక సమస్యలను పరిష్కరించడంలో భాగస్వాములయ్యారు. మంచు స్థూపాలను కడుతున్నారు, కృత్రిమమైన హిమానీనదాలను సృష్టిస్తున్నారు. పిల్లలు ఇష్టపడే ఇలాంటి కార్యకలాపాలే పిల్లల్ని స్కూలుకు దారి వెతుక్కుంటూ పరుగులు తీయించాయి. చిన్న పిల్లలు నీటి కొరతను తీర్చడంలో నిమగ్నమవుతుంటే, పెద్ద పిల్లలు సోలార్ హీటెడ్ మడ్ బిల్డింగ్స్ నిర్మాణంలో నిష్ణాతులవుతున్నారు. దాంతో ఓ యూనివర్సిటీ క్యాంపస్ ఎకో విలేజ్‌గా మారింది. గీతాంజలి కార్పొరేట్ రంగాన్ని వదిలి లధాక్ దారి పట్టింది ఇలాంటి విద్యాసంస్కరణ కోసమే.

### లాహోర్ టూ లధాక్ వయా పాండిచ్చేరి

ఒరిస్సాలోని బాలాసోర్‌లో పుట్టిన గీతాంజలి మూలాలు లాహోర్‌లో ఉన్నాయి. దేశ విభజన సమయంలో గీతాంజలి తాతగారు లాహోర్ నుంచి పంజాబ్‌కి వచ్చి స్థిర పడ్డారు. ఆమె క్రిస్టియన్ మిషనరీ కాన్వెంట్, కేంద్రీయ విద్యాలయలో చదువుకున్నారు. పదహారేళ్ల వయసులో పాండిచ్చేరి పర్యటన ఆమె దృక్పథాన్ని మార్చేసింది. పాండిచ్చేరిలోని అరబిందో ఆశ్రమంలో భారతీయ ఆధ్యాత్మికత సారాన్ని ఒంటపట్టించుకున్నారు. తత్వం, వేదం, ఉపనిషత్తులను చదివారు. ఫిజిక్స్‌లో గ్రాడ్యుయేషన్ తర్వాత భువనేశ్వర్‌లోని గ్జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబిఏ చేశారు. చదువు పూర్తయిన తర్వాత డెన్మార్క్‌లో మార్కెటింగ్ విభాగంలో పనిచేశారామె. ఉద్యోగ జీవితం నుంచి మెల్లగా ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారారు గీతాంజలి. పుషన్ ప్రాజెక్ట్స్ పేరుతో ఇంజనీరింగ్ ఫర్మ్ స్థాపించారు. చెన్నై కేంద్రంగా హీలియోస్ పుస్తక ప్రచురణ సంస్థ కూడా ఆమె మానస పుత్రికే. పాండిచ్చేరిలో ఏయుఎమ్ హాస్పిటల్స్‌ను సమర్థంగా నిర్వహించారు. ఇన్నింటిని విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత ఆమె ఒక్కసారిగా వాటన్నింటికీ దూరంగా వెళ్లి పోయారు. 'ఇప్పుడు లధాక్ పిల్లల కోసం మంచి భవిష్యత్తుని డిజైన్ చేస్తున్నానని, అందులో ఉన్న సంతృప్తి మరెందులోనూ ఉండబోద''ని అంటున్నారామె తన నిర్ణయం పట్ల సంతోషంగా.

### అవసరాలే ఆలోచనలు

గీతాంజలి ఇప్పుడు లధాక్‌లో 'హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్'(హియల్) విద్యా సంస్థ సీఈవో. ఆ సంస్థ వ్యవస్థాపక సభ్యురాలు కూడా. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌తో పాటు ఆమె విద్యాసంస్థను నిర్వహిస్తున్నారు. లధాక్‌లోని ఫైయాంగ్ గ్రామంలో స్థాపించిన హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్‌లో విద్యావిధానాన్ని లధాక్‌లో స్థానిక అవసరాలకు అనుగుణంగా రూపొందించారు. ''మనదేశంలో మైదాన ప్రాంతంలో భవన నిర్మాణానికీ, లధాక్‌లో భవన నిర్మాణానికి ఒకటే ఫార్ములా పని చేయదు. మైదాన ప్రదేశాల్లో ఉన్న ఏ యూనివర్సిటీ కూడా భౌగోళిక సమతుల్యత లేని నేలలకు అనువైన నిర్మాణ విధానాన్ని కరికులమ్‌లో చేర్చుకోవడం లేదు. అందుకే భౌగోళిక స్థితికి అనుగుణంగా భవన నిర్మాణం చేయడంతోపాటు స్థానిక వనరులే పెట్టుబడిగా చేసుకుని ఉపాధి అవకాశాలను పెంచుకోవడానికి అనువైన కోర్సులను కూడా ప్రవేశ పెట్టాం'' అన్నారు గీతాంజలి. అక్కడ ఇప్పుడు ఎకో రెస్పాన్సివ్ హోమ్స్ కడుతున్నారు. అంటే... లధాక్‌లోని విపరీతమైన చల్లదనం దృష్ట్యా ప్లస్ ఇరవై డిగ్రీల సెల్సియస్ నుంచి మైనస్ ఇరవై డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలను తట్టుకునేటట్లు ఇళ్లను నిర్మించడం అన్నమాట. వరదలు, కొండ చరియలు విరిగి పడకుండా నివారించే ఉపాయాలను కూడా సమ్మిళితం చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ మౌంటెయిన్ డెవలప్‌మెంట్‌ను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టారు. ''ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పబ్లిషింగ్, హెల్త్‌కేర్ రంగాల్లో అనేక సంస్థల వ్యవస్థాపకురాలిగా, నిర్వహకురాలిగా ఇరవై ఏళ్ల కాలంలో పొందిన సంతోషంకంటే లధాక్‌లో చేస్తున్న సర్వీస్‌తో పొందుతున్న ఆనందమే ఎక్కువ'' అన్నారామె. గీతాంజలి లధాక్ పిల్లలతో ఎంతగా కలిసిపోయారంటే... స్కూలుకి వెళ్లేటప్పుడు తరచుగా లధాక్ సంప్రదాయ దుస్తులు ధరిస్తారు. దీనివల్ల పిల్లలు తనను తమలో ఒకరిగా చూస్తారని చెప్పారామె. ''పిల్లలు టీచర్‌ను, విద్యాసంస్థల నిర్వహకులను సొంత మనుషులుగా స్వీకరించడం చాలా అవసరం. అప్పుడే టీచర్ చెప్పిన మంచిని అనుసరిస్తారు, ఆ విద్యాసంస్థ నియమాలను గౌరవిస్తారు'' అన్నారు గీతాంజలి.



● బ్లాక్‌బెల్ట్ సాధించిన పీస్ వారియర్స్‌తో గీతాంజలి

### చెన్నై నేర్పిన పాఠాలు

గీతాంజలి 2015లో చెన్నైలోని కేంబ్రిడ్జి స్కూల్ సీఈవోగా పనిచేశారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు స్కూలు బాధ్యతలు చూసేవారు. శని, ఆదివారాలు పాండిచ్చేరిలోని హాస్పిటల్ మేనేజ్‌మెంట్ వ్యవహారాలు చక్కబెట్టేవారు. ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటూ ''నేను స్కూల్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన తొలి వారంలో ఆ స్కూల్లో పని చేస్తున్న గణితం, ఫిజిక్స్ టీచర్లు ఉద్యోగం మానేశారు. వాళ్లిచ్చిన నోటీస్ పీరియడ్ అప్పటికి అయిపోయింది, కానీ ఆ లోపు కొత్త టీచర్ల నియామకం జరగలేదు. దాంతో స్కూలు యాజమాన్యం ఆ పరిస్థితిని చక్కదిద్దవలసిందిగా నన్ను కోరింది. కొత్తవాళ్లను రిక్రూట్ చేసుకునే వరకు పాఠాలు చెప్పకుండా పిల్లల్ని ఖాళీగా ఉంచకూడదు. పిల్లలు నేర్చుకోవాల్సిన సమయాన్ని వృథా చేయడం పెద్ద నేరం. అలాగని ఏదో ఒక టీచర్‌కి అడిషనల్ డ్యూటీ వేయడం కూడా అన్ని వేళలా సమర్థనీయం కాదు. అందుకే ఆ పాఠాలను బాగా చదువుకుని, ఒక స్టూడెంట్‌లాగ ప్రిపేరయ్యి టీచర్‌గా క్లాస్ రూమ్‌లో అడుగుపెట్టాను. చెన్నై స్కూల్లో పాఠాలు చెప్పినన్ని రోజులు మా అబ్బాయి ఆర్యన్‌తో పాటు నేను కూడా హోమ్ వర్క్ చేసేదాన్ని. నిజానికి అప్పుడు వేసిన ఆ అడుగే ఇప్పుడు నన్ను లధాక్‌కు చేర్చింది. స్కూలు నిర్వహణ నన్ను నేను నిరూపించుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. పాఠాలు చెప్పడం... అలా కాదు. ఏదో మానసిక సంతృప్తి, మాటల్లో చెప్పలేని సంతోషాన్నిస్తుంది. ఆ సంతోషాన్ని కలకాలం నిలుపుకోవాలనుకున్నాను. లధాక్‌లో పరిస్థితులు తెలిసిన తర్వాత నా చదువు, నా ఇష్టాలు, నైపుణ్యాలన్నింటినీ ఏకకాలంలో సద్వినియోగం చేసుకోవచ్చనిపించింది'' అన్నారామె.

### శాంతి యోధులు

గీతాంజలి హియల్‌లో అమ్మాయిలకు కరాటే క్లాసులు కూడా తీసుకుంటారు. తాను తయారు చేసిన కరాటే యోధులకు 'పీస్‌ఫుల్ వారియర్స్' అని పేరు పెట్టారు. ఆమె శిక్షణలో తొలి బృందం సర్టిఫికేట్‌లు అందుకున్నది. వీరి సహకారంతో లధాక్ రీజియన్‌లోని ప్రతి మహిళకూ కరాటే నేర్పించాలనేది గీతాంజలి ఆలోచన. ''కరాటే ప్రాక్టీస్ అబ్బాయిల కంటే అమ్మాయిలకే ఎక్కువ అవసరం. రాబోయే పదేళ్లలో దేశంలోని విద్యార్థినులందరూ కరాటే బ్లాక్ బెల్ట్ సాధించేటట్లు చర్యలు తీసుకోవలసిందిగా ప్రభుత్వాన్ని కోరతాను. నలభై ఆరేళ్ల జీవితంలో అనేక ప్రయోగాలు చేశాను, అంతే స్థాయిలో విజయాలనూ సాధించాను. హియల్ విద్యాసంస్కరణ తర్వాత పీస్ వారియర్స్‌ను దేశమంతటా విస్తరించడం మీద పూర్తి స్థాయిలో దృష్టి పెడతాను'' అన్నారు గీతాంజలి.

– వాకా మంజులారెడ్డి

## అమ్మానాన్నల బహుమతి

మా అమ్మానాన్నలు నాకు 'నమ్మకం, స్వేచ్ఛ' అనే రెండు బహుమతులనిచ్చారు. ఏ పిల్లలకైనా అంతకంటే పెద్ద వరాలు మరేవీ ఉండవు. ఉన్నది ఒక్కటే జీవితం, అందులోనే మన ఆలోచనలను, ఆశయాలను నెరవేర్చుకోవాలి. మనల్ని మనం ఎన్నో కోణాల్లో ఆవిష్కరించుకున్నప్పుడే మనలో కొత్త ఆలోచనలు పుడతాయి. అందుకు లియోనార్డో డా విన్సీనే పెద్ద ఉదాహరణ. ఆ చిత్రకారుడిలో... ఓ గణిత మేధావి, వృక్ష శాస్త్రజ్ఞుడు, ఇంకా గొప్ప తత్వవేత్త కూడా ఉన్నారు. ఒక మెదడులో ఇన్ని రకాల జ్ఞాన సంపద ఉన్నప్పుడు... అవన్నీ ఊరికే ఉండవు. అనుక్షణం ఒకదానితో ఒకటి ప్రేరేపితమవుతూనే ఉంటాయి. కొత్త ఆవిష్కరణలకు బీజం పడేది కూడా అలాంటప్పుడే. హియల్ (హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్) పుట్టుక కూడా అలాంటిదే. ఇందులో మేము అనుసరిస్తున్న విధానం 'లెర్నింగ్ బై డూయింగ్'. పిల్లలు తామేం నేర్చుకోవాలో దానిని అక్షరాలలో చదువుతూ నేర్చుకోవడంతో సరిపెట్టరు. ఆ పని చేస్తూ నేర్చుకుంటారు. ఇలా చదువుకోవడం వల్ల వాళ్లు పెద్దయిన తర్వాత ఒకరి దగ్గర ఉద్యోగం కోసం ఎదురు చూస్తూ కాలం గడపరు, ఎంటర్‌ప్రెన్యూర్ మారి సొంతంగా సంస్థను స్థాపించి నిర్వహించుకోగలుగుతారు.

– గీతాంజలి,
హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్
విద్యాసంస్థ సహస్థాపకురాలు

బ్యూటిప్స్



## చర్మం కాంతివంతం ఇలా...

- తేనె, చక్కెర సమపాళ్లలో తీసుకుని బాగా కలిపి కళ్ల చుట్టూ మినహాయించి, ముఖానికి, మెడకు పట్టించి, వలయాకారంగా మర్దన చేయాలి. ఇది చర్మానికి నునుపుదనం తీసుకురావడంతోపాటు మృతకణాలను తొలగిస్తుంది. మొటిమలతో గుంతలు పడిన చర్మానికి తరచుగా ఈ ట్రీట్‌మెంట్ చేస్తుంటే మంచి ఫలితం ఉంటుంది.
- రెండు టేబుల్‌స్పూన్ల టొమాటో జ్యూస్, 50 గ్రా.ల ఓట్స్, 25 గ్రా.ల పెరుగులో కప్పుడు నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, అరగంట తర్వాత చల్లటి నీటితో శుభ్రపరుచుకోవాలి. బ్లాక్ హెడ్స్, మొటిమలు తగ్గి చర్మం మృదువుగా కాంతివంతంగా కనిపిస్తుంది.



- రెండు టీ స్పూన్ల క్యారెట్ తురుము, టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమానికి రెండు చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ చేర్చి దీనితో ముఖాన్ని మృదువుగా రబ్ చేసి, పదిహేను నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మానికి జీవకాంతి లభిస్తుంది.



- రెండు టీ స్పూన్ల తేనెలో చిటికెడు దాల్చిన చెక్క పొడిని కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పడుకోబోయే ముందు ముఖానికి అప్లై చేసి వేళ్లతో 20 నిమిషాలపాటు మృదువుగా మసాజ్ చేసి గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా సమయం దొరికినప్పుడల్లా చేస్తుంటే ముఖంపైన జిడ్డు, మొటిమలు తగ్గి చర్మం కాంతివంతంగా ఉంటుంది.
- మూడు టీ స్పూన్ల దోసరసం, రెండు టీ స్పూన్ల అలొవెరా జెల్, టీ స్పూన్ పెరుగు కలిపి ముఖానికి, మెడకు పట్టించి, పదిహేను నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఎండవల్ల కందిపోయిన, రసాయనాల వల్ల ర్యాష్ ఏర్పడిన చర్మానికి ఈ ప్యాక్ సహజమైన సౌందర్యలేపనంలా పనిచేస్తుంది.
- బంగాళదుంపని మెత్తగా ఉడకబెట్టి పొట్టు తీయకుండా మెదుపుకోవాలి. దీంట్లో పాలు, కొబ్బరి నూనె జత చేసి పేస్ట్‌లా కలపాలి. మెడపై ఈ మిశ్రమాన్ని అప్లై చేసి, 20 నిమిషాల తరవాత కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తుంటే మెడ మీద నలుపు తగ్గి చర్మం కాంతివంతం అవుతుంది.


కార్డియాలజి కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

## కార్డియోమయోపతి అంటే ఏమిటి...?

**నా వయసు 42 ఏళ్లు. ఈ మధ్య కొంతకాలం నుంచి తరచూ శ్వాస అందని పరిస్థితి ఏర్పడుతోంది. విపరీతమైన అలసటతో పాటు కాళ్లవాపు కూడా కనిపిస్తోంది. నెల కిందట స్పృహతప్పి పడిపోయాను. మాకు తెలిసిన డాక్టర్‌కు చూపించుకుంటే ఆయన కార్డియాలజిస్ట్ వద్దకు పంపారు. నా కండిషన్ 'కార్డియోమయోపతి' కావచ్చని కార్డియాలజిస్ట్ అంటున్నారు. ఈ వ్యాధి ఏమిటి? దీనికి చికిత్స అందుబాటులో ఉందా? దయచేసి వివరించండి.**

**– ఎమ్. శ్రీకాంత్‌రావు, కరీంనగర్**



కార్డియోమయోపతీ గుండె కండరాలకు సంబంధించిన వ్యాధి. ప్రారంభంలో ఎలాంటి ప్రత్యేక లక్షణాలూ వ్యక్తం కావు. మీరు వివరిస్తున్న లక్షణాలు కార్డియోమయోపతినే సూచిస్తున్నాయి. దీన్ని గుర్తించి చికిత్స చేయడంలో జాప్యం జరిగితే అది అకాలమరణానికి దారితీయవచ్చు. చాలా కారణాల వల్ల డయలేటెడ్ కార్డియోమయోపతి రావడానికి అవకాశం ఉంటుంది. కొన్ని కుటుంబాలలో ఈ వ్యాధి వంశపారంపర్యంగా వస్తుంటుంది. కార్డియోమయోపతిలో మూడు ప్రధాన రకాలు కనిపిస్తాయి. అవి డయలేటెడ్ కార్డియోమయోపతి, హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి, రెస్ట్రిక్టెడ్ కార్డియోమయోపతి.

వైరస్‌లతో ఇన్ఫెక్షన్, అదుపుతప్పిన అధిక రక్తపోటు (హైబీపీ), గుండె కవాటాలకు సంబంధించిన సమస్యలు, మితిమీరి మద్యపానం ఈ వ్యాధికి దారితీసే ప్రధాన కారణాలు. కొన్ని కుటుంబాలలో జన్యువుల మార్పు లేదా మ్యూటేషన్ కారణంగా వంశపారంపర్యంగా డయలేటెడ్ కార్డియోమయోపతి కనిపిస్తుంది. తల్లిదండ్రుల్లో ఒకరికి డయలేటెడ్ కార్డియోమయోపతి ఉంటే పిల్లల్లో సగం మందికి ఈ వ్యాధి సంక్రమిస్తుంది. చాలా సందర్భాల్లో డయలేటెడ్ కార్డియోమయోపతి నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. కానీ కొంతమందిలో వ్యాధి నిర్ధారణ కావడానికి ముందే తీవ్రమైన లక్షణాలు వ్యక్తమవుతుంటాయి. శ్వాస తీసుకోవడం కష్టం ఉండటం, పొట్ట – చీలమండ వాపు, విపరీతమైన అలసట, గుండెదడ డయలేటెడ్ కార్డియోమయోపతిలో కనిపించే తొలి లక్షణాలు. కార్డియోమయోపతి కారణంగా గుండె కొట్టుకోవడంలో తీవ్రమైన హెచ్చుతగ్గులు (అరిథ్మియాసిస్), ఛాతీలో నొప్పి, రక్తం గడ్డకట్టడం వంటి మరికొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వాటి తీవ్రతను బట్టి చికిత్స చేస్తారు. అధిక రక్తపోటు, గుండెస్పందనల్లో విపరీతమైన హెచ్చుతగ్గులను మందులతో అదుపు చేస్తారు. గుండెకొట్టుకోవడంలో అసాధారణ మార్పును అదుపుచేయడానికి అవసరమైతే పేస్‌మేకర్ అమర్చుతారు. ఇక కార్డియోమయోపతిలోని మిగతా రెండు రకాలు పూర్తిగా వంశపారంపర్యంగా సంక్రమించే వ్యాధులు. హైపర్‌ట్రోఫిక్ రకంలో గుండెకండరాలు, గుండెగోడలు మందంగా తయారవుతాయి. రెస్ట్రిక్టివ్ రకంలో గుండెగదుల్లో రక్తం భర్తీ అయ్యేందుకు అవసరమైన ఒత్తిడికి సంబంధించిన లోటు ఏర్పడుతుంది. హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి వ్యాధిగ్రస్తుల్లో గుండె కండరాలు, గోడలు మందంగా మారడం అందరిలో ఒకేలా ఉండదు. మొత్తం కార్డియోమయోపతి కేసుల్లో హైపర్‌ట్రోఫిక్ రకానికి చెందినవి 4 శాతం ఉంటాయి. రెస్ట్రిక్టెడ్ కార్డియోమయోపతి కేసులు 1 శాతం ఉంటాయి.

హైపోట్రోఫిక్, రెస్ట్రిక్టివ్ రకాల కార్డియోమయోపతీలో చికిత్స ప్రధానంగా వ్యాధిలక్షణాలను అదుపు చేయడం, పరిస్థితి విషమించకుండా అదుపు చేయడం లక్ష్యంగా జరుగుతుంది. గుండె ఏ మేరకు నష్టపోయింది, ఎలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయన్న అంశాల ఆధారంగా డాక్టర్లు చికిత్సను నిర్ణయిస్తారు. అధికరక్తపోటు, గుండెకొట్టుకోవడంలో అసాధారణ పరిస్థితి వంటి లక్షణాలను అదుపు చేయడానికి డాక్టర్లు మందులు ఇస్తారు. హృదయస్పందనలు నిరంతరం సక్రమంగా జరిగేలా చూడటానికి అవసరాన్ని బట్టి పేస్‌మేకర్‌ను అమర్చుతారు. గుండెకొట్టుకోవడంలోని లోటుపాట్లు ప్రాణాపాయానికి దారితీసేలా కనిపిస్తే దాన్ని సరిచేయడానికి ఐసీడీ (ఇంప్లాంటబుల్ కార్డియాక్ డిఫిబ్రిలేటర్) పరికరాన్ని అమర్చుతారు.



**డాక్టర్ పంకజ్ జరీవాలా,**
సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ
హైదరాబాద్

తెలుగు తేజం

## నీతి అయోగ్‌లో ఇంటర్న్‌షిప్‌కు

# తెలుగు యువకుడి యోగ్యత

● నీతి అయోగ్ ఇంటర్న్‌షిప్‌లో అవకాశం ● పార్లమెంటు ఇంటర్న్‌షిప్‌లోనూ సభ్యుడే ● గ్రామీణ ప్రాంతం నుంచి ఢిల్లీ వరకు



● కేంద్ర మంత్రి, పార్లమెంటు ఇంటర్న్‌షిప్ ఛైర్మన్ ప్రహ్లాద్‌సింగ్ పటేల్‌తో సమావేశమైన విద్యార్థుల బృందంలో నాగశివశంకర్



● కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్‌కు ఇంటర్న్‌షిప్ నివేదికను అందజేస్తున్న నాగశివశంకర్

కృషి, పట్టుదల ఉంటే దేన్నైనా సాధించవచ్చని నిరూపించాడు తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు మండలం బి.దొడ్డవరం గ్రామానికి చెందిన యువకుడు ఇందుగుపల్లి నాగ శివశంకర్. మారు మూల గ్రామంలో పుట్టిన ఈ యువకుడు పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకున్నాడు. తాను చదువుకున్న విద్య ద్వారా భారత పార్లమెంటులో ఇంటర్న్‌షిప్ పూర్తి చేయడంతో పాటు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నీతి ఆయోగ్‌లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన తెలుగువారిలో ప్రథముడిగా అరుదైన గుర్తింపు పొందాడు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్‌లో కెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నాగశివశంకర్‌ది ఓ నిరుపేద కుటుంబం. తండ్రి వీరవెంకట సత్యనారాయణ, తల్లి నాగమణి, తమ్ముడు అనిల్ కుమార్. వీరి కుటుంబానికి ఉన్న ఏకైక ఆధారం ఓ ఇటుక బట్టీ. దాని ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తూ ఇద్దరు కుమారులను కష్టపడి చదివించాడు తండ్రి. పెద్దకొడుకు నాగశివశంకర్ పీజీ చేయగా, చిన్నకొడుకు అనిల్ కుమార్ బీటెక్ పూర్తి చేశాడు.

### ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య...

బి.దొడ్డవరంలో అప్పట్లో ఉన్న యూపీ స్కూల్లో చదువు పూర్తయిన తర్వాత విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగంలో అయిదేళ్ల రసాయన శాస్త్రం (అప్లైడ్ కెమిస్ట్రీ) పూర్తి చేశాడు. సివిల్స్‌పై ఉన్న మక్కువతో ఢిల్లీ వెళ్లి అక్కడ కోచింగ్ తీసుకున్నాడు. అక్కడ ఉన్న సమయంలోనే పార్లమెంటు ఇంటర్న్‌షిప్‌లో ప్రవేశాలను ప్రకటించారు. దానికి దరఖాస్తు చేసుకున్న నాగశివశంకర్ సునాయాసంగా అర్హత సాధించాడు. ఎమ్మెస్సీ పీజీ పూర్తి చేయడంతో పాటు ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్‌లో ఉన్న ప్రవేశం, ఏయూలో నాగశివశంకర్ సాధించిన సర్టిఫికెట్లు, ఇతని ప్రతిభను కొలమానంగా తీసుకుని పార్లమెంటు ఇంటర్న్‌షిప్‌కు అతడిని ఎంపిక చేశారు.

### పార్లమెంటు ఇంటర్న్‌షిప్ సాగింది ఇలా...

పార్లమెంటు ఇంటర్న్‌షిప్‌కు జాతీయ స్థాయిలో 50 మందిని ఎంపిక చేశారు. వారిలో తెలుగు రాష్ట్రాల తరపున నాగశివశంకర్ ఒక్కడే అర్హత సాధించడం విశేషం. పార్లమెంటులో బిల్లులు ఏ విధంగా అమలు చేస్తారు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, భారత దేశ పాలన, తదితర అంశాలపై పరిశోధన చేసి మూడు నెలల్లో పార్లమెంటు స్పీకర్‌కు నివేదిక అందించారు. దానికి గాను నాగశివశంకర్‌కు సర్టిఫికెట్‌తోపాటు రూ.70 వేలు నగదు పారితోషికం అందించారు. ఈ సందర్భంగా పలువురు కేంద్ర మంత్రులతో పాటు ఎంపీలతో పని చేసిన అనుభవం గడించాడు నాగశివశంకర్.

### నీతి ఆయోగ్ ఇంటర్న్‌షిప్‌లో ఏముంటుంది..?

ప్రణాళికా సంఘం స్థానంలో అమల్లోకి వచ్చిన నీతి ఆయోగ్ దేశాభివృద్ధికి సంబంధించిన మంత్రిత్వ శాఖలకు సలహాలు, సూచనలు అందిస్తుంది. నీతి ఆయోగ్‌కు దేశ ప్రధానమంత్రి చైర్మన్‌గా, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉంటారు. నీతి ఆయోగ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన యువకులు వారి సలహాలు, సూచనలను నివేదిక రూపంలో నీతి ఆయోగ్‌కు అందజేస్తారు. జూన్ 25న నీతి ఆయోగ్ ఇంటర్న్‌షిప్ మొదలు పెట్టిన ఈ బృందం ఇటీవలే నివేదికను అందించింది.

### విద్యార్థి నాయకునిగా ప్రస్థానం...

చదువుతో పాటు విద్యార్థి నాయకునిగా పలు ఉద్యమాల్లో నాగశివశంకర్ ప్రముఖ పాత్ర పోషించాడు. ఆంధ్రా యూనివర్సిటీలో ఉప కులపతితో పలు సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించారు. ఏబీవీపీ నాయకునిగా పలు ఉద్యమాల్లో పాల్గొని పలు పర్యాయాలు అరెస్టయ్యారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలంటూ విద్యార్థి నాయకుడిగా విశాఖపట్నంలో నిర్వహించిన పలు ఆందోళనలకు ఆయన నాయకత్వం వహించారు. ఇప్పుడు చేసిన ఇంటర్న్‌షిప్ శివశంకర్‌కు భవిష్యత్తులో మరిన్ని మంచి పదవులకు బాట వేస్తుందని ఆశిద్దాం.

– ఏడిద బాలకృష్ణారావు,
సాక్షి, మామిడికుదురు, తూర్పుగోదావరి జిల్లా

### ఓఎస్డీగా పని చేయాలన్నది నా లక్ష్యం



కేంద్ర మంత్రిత్వశాఖలో ఓఎస్డిగా చేరి ఆ శాఖల్లో పట్టు సాధించిన అనంతరం కేంద్ర మంత్రిత్వ శాఖ సలహాదారుడిగా పని చేయాలన్నది నా లక్ష్యం. ఐక్యరాజ్య సమితిలో ఒక ప్రాజెక్టు పూర్తి చేసిన తరువాత ఓఎస్డీగా చేరాలన్నది నా ఆలోచన. దానికి సంబంధించిన ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించుకున్నాను. దాన్ని సాధించే దిశగా లండన్‌లోని 'కార్డిఫ్' విశ్వ విద్యాలయంలో మాస్టర్ డిగ్రీ చేసేందుకు నాకు అర్హత లభించింది. రూరల్ డెవలప్‌మెంట్, అర్బన్ డెవలప్‌మెంట్, వాటర్ రీసోర్సెస్, ట్రాన్స్‌పోర్టేషన్, ఎన్విరాన్మెంట్ తదితర విభాగాల్లో నేటి పరిస్థితులకు అనుగుణంగా ఏవిధమైన మార్పులు తీసుకు రావాలన్నదే ఈ కోర్సు ప్రధాన ఉద్దేశ్యం. నా తలిదండ్రులతో పాటు అప్పటి ఏయూ ప్రొఫెసర్ పీఎస్ అవధాని, డీన్లు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. వారి సహకారంతోనే నేను ఈ స్థితికి చేరుకున్నాను.

– నాగశివశంకర్,
నీతి అయోగ్‌లో ఇంటర్న్‌షిప్ చేసిన తొలి తెలుగు యువకుడు

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
26-8-2019


స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) పలు కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-బి నాన్ గెజిటెడ్ 'జూనియర్ ఇంజనీర్'(జేఈ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిద్వారా సెంట్రల్ వాటర్ కమిషన్, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్, ఫరక్కా బ్యారేజ్ ప్రాజెక్ట్, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్, డైరెక్టరేట్ ఆఫ్ క్వాలిటీ అష్యూరెన్స్, నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌ల్లో.. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ జేఈ ఉద్యోగాల నియామకాలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలోఎస్ఎస్‌సీ జూనియర్ ఇంజనీర్ ఎగ్జామినేషన్ -2019 నోటిఫికేషన్ వివరాలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ టిప్స్...

ఎస్ఎస్‌సీ జాబ్స్

# కేంద్రంలో ఇంజనీరింగ్ కొలువులు





**డిప్లొమా, బీటెక్ విద్యార్థులకు సువర్ణావకాశం ● రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ చేపట్టనున్న ఎస్ఎస్‌సీ ● దరఖాస్తుకు చివరి తేది: సెప్టెంబర్ 12**

## పోస్టులు.. అర్హతలు

**సెంట్రల్ వాటర్ కమిషన్(సివిల్, మెకానికల్):**
- వయసు 32 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సివిల్/మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా (లేదా) సివిల్/మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ.

**సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సివిల్):**
- వయసు 32 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా.

**సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (ఎలక్ట్రికల్):**
- వయసు 32 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ లేదా మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా.

**మిలిటరీ ఇంజనీర్ సర్వీసెస్(సివిల్):**
- వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ లేదా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమాతోపాటు సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో రెండేళ్ల పని అనుభవం.

**మిలిటరీ ఇంజనీర్ సర్వీసెస్ (ఎలక్ట్రికల్, మెకానికల్):**
- వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ (లేదా) గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్/ మెకానికల్ ఇంజనీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమాతోపాటు ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో రెండేళ్ల పని అనుభవం.

**ఫరక్కా బ్యారేజీ ప్రాజెక్టు (సివిల్):**
- వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సివిల్‌లో విభాగంలో డిప్లొమా.

**ఫరక్కా బ్యారేజీ ప్రాజెక్టు (ఎలక్ట్రికల్):**
- వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా.

**ఫరక్కా బ్యారేజీ ప్రాజెక్టు (మెకానికల్):**
- వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా.

**బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (సివిల్):**
- వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సివిల్ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేయాలి. (లేదా) మూడేళ్ల సివిల్ డిప్లొమాతోపాటు సివిల్ ఇంజనీరింగ్‌లో ప్లానింగ్, ఎగ్జిక్యూషన్, మెయింటెనెన్స్ విభాగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి.

**బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్(ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్):**
- వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి మెకానికల్ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేయాలి. (లేదా)ఎలక్ట్రికల్/ఆటో మొబైల్/ మెకానికల్ విభాగంలో డిప్లొమాతోపాటు సంబంధిత విభాగంలో ప్లానింగ్, ఎగ్జిక్యూషన్, మెయింటెనెన్స్ విభాగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి.

**సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్):**
- వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సంబంధింత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

**నేవల్, డైరెక్టరేట్ ఆఫ్ క్వాలిటీ అష్యూరెన్స్(మెకానికల్, ఎలక్ట్రికల్):**
- వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపుపొందిన విశ్వవిద్యాలయం నుంచి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేయాలి. (లేదా) సంబంధిత విభాగంలో డిప్లొమాతోపాటు కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

**నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్):**
- వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- విద్యార్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

**గమనిక:** అన్ని విభాగాల్లోని పోస్టులకు దరఖాస్తు చేసుకునే ఓబీసీలకు గరిష్ఠ వయోపరిమితిలో మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.

**పేస్కేల్: రూ.35,400 – రూ.1,12,400**

## ఎంపిక ప్రక్రియ

ఎంపిక ప్రక్రియలో పేపర్1(కంప్యూటర్ ఆధారిత ఆబ్జెక్టివ్ పరీక్ష), పేపర్ 2(డిస్క్రిప్టివ్ పరీక్ష), సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ద్వారా ఎంపిక జరుగుతుంది. పేపర్1లో నార్మలైజేషన్ విధానంలో కేటగిరీల వారీగా పేపర్2కు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. పేపర్1+పేపర్2లో చూపిన ప్రతిభ ఆధారంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలుస్తారు.

## పరీక్ష విధానం

- పేపర్-1.. 200 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం: రెండు గంటలు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కుల కోత ఉంటుంది. పేపర్ 1లో మూడు విభాగాలు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 మార్కులకు; జనరల్ అవేర్‌నెస్ 50 మార్కులతోపాటు కోర్ సబ్జెక్టు 100 మార్కులు కేటాయించారు.
- పేపర్-2 డిస్క్రిప్టివ్ తరహాలో జరుగుతుంది. ఇది 300 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 2గంటలు. సివిల్/స్ట్రక్చరల్ విభాగాలకు దరఖాస్తు చేసుకున్నవారు పార్ట్-ఏ, ఎలక్ట్రికల్ విభాగానికి దరఖాస్తు చేసుకున్నవారు పార్ట్-బి, మెకానికల్ విభాగానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పార్ట్-సి భాగాలు రాయాలి.

## ప్రిపరేషన్ ఇలా

- జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ కోసం బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ తదితర పరీక్షల పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి. జనరల్ అవేర్‌నెస్‌లో ఇండియన్ జాగ్రఫీ, హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, అవార్డులు-నియామకాలు, క్రీడలు-విజేతలు తదితర అంశాలను చదవాలి. ఇంజనీరింగ్‌కు సంబంధించి ఆయా బ్రాంచ్‌ల టెక్నికల్ సబ్జెక్టు నుంచి ప్రశ్నలు వస్తాయి.
- ఎలక్ట్రికల్: సర్క్యూట్లలోని బేసిక్ ప్రిన్సిపుల్స్, బేసిక్ ఫార్ములాలు, వాటి యూనిట్లు తదితర అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ మెజర్‌మెంట్స్ అంశాలపై అవగాహన అవసరం.
- సివిల్ ఇంజనీరింగ్: స్ట్రెంథ్ ఆఫ్ మెటీరియల్, ఫ్లూయిడ్ మెకానిక్స్,సర్వేయింగ్ వంటి అంశాలకు సంబంధించిన ప్రిన్సిపుల్స్, ఫార్ములాలు, యూనిట్లపై అవగాహన పెంచుకోవాలి.
- మెకానిక్స్: థర్మోడైనమిక్స్, ఇంజనీరింగ్ మెకానిక్స్, ఐసీ ఇంజన్, హీట్ ఇంజన్ వంటి అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు ఇస్తారు. వీటికి సంబంధించిన బేసిక్ ప్రిన్సిపుల్స్‌ను చూసుకోవాలి. ఇంజనీరింగ్ బ్రాంచ్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలను ఒకచోట రాసుకొని రివిజన్ చేస్తుండాలి. సమయపాలనను అలవరచుకో వడం కోసం నమూనా ప్రశ్నపత్రాలను సాధిస్తుండాలి. చదివిన అంశానికి సంబంధించిన ప్రశ్నలను సేకరించి, ప్రాక్టీస్ చేయాలి.

## జూనియర్ ఇంజనీర్ - 2019 నోటిఫికేషన్ ముఖ్య సమాచారం

- **దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది:** 2019 సెప్టెంబర్ 12
- **దరఖాస్తు రుసుం:** రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంది.
- కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు త్వరలో ప్రకటిస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.

**వెబ్‌సైట్:** https://ssc.nic.in

---



## పోటీ పరీక్షల ప్రత్యేకం
## ఇండియన్ ఎకానమీ

# భారత ఆర్థిక సర్వే (2018-19)

**పోటీ పరీక్షల్లో భారత ఆర్థిక వ్యవస్థ సంబంధిత అంశాలు చాలా ముఖ్యమైనవి. కేంద్ర బడ్జెట్‌తో పాటు ఆర్థిక సర్వే (2018-19)లోని కీలక అంశాల నుంచి పరీక్షల్లో ప్రశ్నలు వచ్చేందుకు అవకాశముంది. ఈ నేపథ్యంలో వివిధ అంశాలకు సంబంధించి ముఖ్య సమాచారాన్ని పొందుపరిచాం. వీటిని అధ్యయనం చేయడం వల్ల పరీక్షల్లో ప్రశ్న ఏ రూపంలో వచ్చినా సరైన సమాధానం గుర్తించేందుకు అవకాశముంటుంది.**

- **వ్యవసాయ మార్కెటింగ్, రైతు స్నేహపూర్వక సంస్కరణల సూచీ:**
  - ఈ సూచీని నీతి ఆయోగ్ 2016లో ప్రవేశపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నమూనా ఏపీఎంసీ చట్టంలో ప్రతిపాదించిన ఏడు అంశాల అమలుకు సంబంధించి ర్యాంకులు ఇచ్చేందుకు దీన్ని రూపొందించింది. ఈ సూచీలో స్కోరు కనిష్ఠ విలువ సున్నా. గరిష్ఠ విలువ 100 (ఎంపిక చేసిన అంశాల్లో పూర్తిగా సంస్కరణలను అమలుచేసిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు). ఈ సూచీలో మహారాష్ట్ర ప్రథమ స్థానం పొందింది.
- **బ్లాక్ చెయిన్ ఆధారిత ఈ-మార్కెట్ ప్లేస్:**
  - బ్లాక్ చెయిన్ ఆధారిత 'ఈ-మార్కెట్ ప్లేస్'ను కాఫీ బోర్డు ప్రారంభించింది. పారదర్శకతతో కాఫీ ఉత్పత్తిదారులను, మార్కెట్లతో అనుసంధానించి, వారికి సరైన ధరలు అందించేలా చేసేందుకు పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేస్తోంది.
- **సుస్థిర వ్యవసాయానికి జాతీయ మిషన్:**
  - అధిక ఉత్పాదకత, సుస్థిర, లాభదాయక, వాతావరణ మార్పులను తట్టుకోగలిగేలా వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దడం ఈ మిషన్ లక్ష్యం.
- **ప్రపంచ ఆహార భద్రతా సూచీ:**
  - ప్రపంచ ఆహార భద్రతా సూచీ (2018)ని ఎకనమిక్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ది ఎకనామిస్ట్) రూపొందించింది. అందుబాటు, లభ్యత, నాణ్యత, భద్రత, సహజ వనరులు తదితర ప్రాతిపదికల ఆధారంగా ఈ సూచీని రూపొందించారు. 113 దేశాలకు సంబంధించి ఈ సూచీని విడుదల చేస్తున్నారు.
- **దేశంలో వ్యవసాయ కమతాల ప్రక్రియ:**
  - 2015-16లో మొత్తం ఆపరేషనల్ కమతాల్లో ఉపాంత కమతాల వాటా 68.5 శాతం. చిన్న కమతాలు 17.7 శాతం, పెద్ద కమతాలు 4.3 శాతం మేర ఉన్నాయి. 2000-01తో పోల్చితే 2015-16లో మొత్తం కమతాల్లో ఉపాంత కమతాల వాటాలో పెరుగుదల నమోదుకాగా.. చిన్న, పెద్ద కమతాల వాటా క్షీణించింది.
- **పారిశ్రామిక వృద్ధి తగ్గడానికి కారణాలు:**
  - పారిశ్రామిక ఉత్పత్తి సూచీ ఆధారంగా 2018-19లో భారత పారిశ్రామికవృద్ధి రేటు 3.6 శాతంగా ఉండటానికి కారణాలు: చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పరపతి ప్రవాహం తగ్గుదల; ద్రవ్యత్వం కొరత వల్ల బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు అందించే రుణం తగ్గుదల; అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో అనిశ్చితి; ఆటోమొబైల్ రంగం, ఫార్మాస్యూటికల్స్, యంత్రాలు-పరికరాలు వంటి కీలక ఉత్పత్తులకు సంబంధించి స్వదేశీ డిమాండ్ తగ్గుదల.
- **కీలక అవస్థాపనా పరిశ్రమల్లో వృద్ధి:**
  - 2018-19లో ఎనిమిది కీలక అవస్థాపనా పరిశ్రమల్లో వృద్ధి 4.3 శాతంగా నమోదైంది. సిమెంట్ పరిశ్రమలో అధిక వృద్ధి నమోదుకాగా, తర్వాతి స్థానంలో బొగ్గు నిలిచింది. ముడి చమురు ఉత్పత్తిలో వృద్ధి రుణాత్మకంగా నమోదైంది.
- **పారిశ్రామిక రంగ స్థూల మూలధన కల్పనలో వృద్ధి:**
  - 2016-17లో పారిశ్రామిక రంగ స్థూల మూలధన కల్పనలో వృద్ధి రుణాత్మకం కాగా, 2017-18లో 7.6 శాతంగా నమోదైంది. స్థూల మూలధన కల్పనలో వృద్ధి అధికంగా నిర్మాణరంగంలో నమోదుకాగా, తర్వాతి స్థానంలో తయారీ రంగం నిలిచింది.
- **దేశంలో స్టార్టప్‌లకు ప్రాధాన్యం:**
  - ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పన, నవకల్పనలకు స్టార్టప్‌లు దోహదపడతాయి. గుర్తింపు పొందిన స్టార్టప్‌ల్లో మహారాష్ట్ర తొలిస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో కర్ణాటక, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, తెలంగాణ నిలిచాయి. గుర్తింపు పొందిన స్టార్టప్‌ల సంఖ్యలో మహారాష్ట్ర వాటా 18.91 శాతం. ఐటీ సర్వీసుల్లో నిమగ్నమైన స్టార్టప్‌లు ఎక్కువ కాగా, తర్వాతి స్థానాల్లో ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్; విద్య, వృత్తి, వాణిజ్య సేవలకు సంబంధించిన స్టార్టప్‌లు ఉన్నాయి.
- **ఎస్‌డీజీ భారత్ సూచీ:**
  - సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనలో భారత్ ప్రగతిని అంచనా వేసేందుకు నీతి ఆయోగ్ ఈ సూచీని అభివృద్ధి చేసింది. ఈ సూచీ స్కోరు కేరళ, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు 65 కంటే ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్, గోవా, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ 50 కంటే ఎక్కువ స్కోరును సాధించాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, అసోం 50 కంటే తక్కువ స్కోరుకు పరిమితమయ్యాయి. 65 కంటే ఎక్కువ స్కోరు ఉన్న రాష్ట్రాలను ముందు వరుస రాష్ట్రాలుగా వర్గీకరించారు. 50 కంటే అధిక స్కోరు కలిగిన రాష్ట్రాలను పెర్‌ఫార్మర్, 50 కంటే తక్కువ స్కోరు ఉన్నవాటిని యాస్పిరెంట్ కేటగిరీ రాష్ట్రాలుగా విభజించారు.



- **భారత్‌లో నిరుద్యోగిత రేటు:**
  - దేశంలో సాధారణ స్థితి ఆధారంగా నిరుద్యోగిత రేటు 2017-18లో 6.1 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో 5.3 శాతం, పట్టణాల్లో 7.8 శాతం నిరుద్యోగం ఉంది. వారంవారీ స్థితి ఆధారంగా నిరుద్యోగిత రేటు 2017-18లో 8.9 శాతం. ఇది గ్రామీణ ప్రాంతాల్లో 8.5 శాతం, పట్టణ ప్రాంతాల్లో 9.6 శాతంగా నమోదైంది.
- **శ్రామిక జనాభా నిష్పత్తి:**
  - నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) అంచనాల ప్రకారం 2017-18లో దేశంలో శ్రామిక జనాభా నిష్పత్తి 34.7 శాతం.
- **శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు:**
  - నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) అంచనాల ప్రకారం సాధారణ స్థితి ఆధారంగా శ్రామికశక్తి భాగస్వామ్య రేటు 2017-18లో 36.9 శాతంగా నమోదైంది.
- **దేశంలో ఆరోగ్య సూచికల ప్రగతి:**
  1. ప్రసూతి మరణాల రేటు ప్రతి లక్ష జననాలకు 2011-13లో 167 కాగా, ఇది 2014-16 నాటికి 130కు తగ్గింది.
  2. 1990-2015 మధ్యకాలంలో ప్రసూతి మరణాల రేటులో తగ్గుదల 77 శాతం.
  3. శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్-2016 ప్రకారం అయిదేళ్లలోపు మరణాల రేటు ప్రతి వెయ్యి జననాలకు 39. శిశు మరణాల రేటు ప్రతి వెయ్యి జననాలకు 34.
- **సమగ్ర శిక్షా కార్యక్రమం:**
  - కేంద్ర ప్రభుత్వం సమగ్ర శిక్షా కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ), ఉపాధ్యాయ విద్యలను విలీనం చేసింది.
- **ఆచరణ/ప్రదర్శన గ్రేడింగ్ సూచీ (2017-18):**
  - ఈ సూచీకి సంబంధించి గరిష్ఠ స్కోరు 360. 279 స్కోరు సాధించి ఈ సూచీలో గుజరాత్ తొలిస్థానంలో నిలిచింది. ఉపాధ్యాయులు, పాలనా సిబ్బంది, ఉపాధ్యాయ శిక్షణ తదితర ప్రాతిపదికల ఆధారంగా సూచీని రూపొందించారు.
- **శిక్షణా నైపుణ్యత పథకాలు:**
  - ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (2015), ప్రధానమంత్రి కౌశల్ కేంద్ర (2015), నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (2016), సంకల్ప్ (2017), స్ట్రైవ్ (2017).
- **ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్):**
  - దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 2019, మార్చి 31 నాటికి అన్ని మౌలిక వసతులతో కోటి పక్కా గృహాల నిర్మాణాన్ని పూర్తిచేయాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. దీనికింద 2014-19 మధ్యకాలంలో 1.54 కోట్ల గృహాల నిర్మాణం పూర్తయింది. ఈ మొత్తంలో ఇందిరా ఆవాస్ యోజన కింద చేపట్టిన గృహాలు కూడా ఉన్నాయి.
- **స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్):**
  - ప్రాథమిక విద్యలో 93.55 శాతం, మాధ్యమిక విద్యలో 79.35 శాతం, ఉన్నతవిద్యలో 25.8 శాతం జీఈఆర్ నమోదైంది.
- **వాణిజ్య సేవల ఎగుమతులు:**
  - 2017లో వాణిజ్య సేవల ఎగుమతుల్లో అమెరికా తొలిస్థానంలో నిలిచింది. బ్రిటన్, జర్మనీ వరుసగా రెండు, మూడు ర్యాంకులు సాధించాయి. వాణిజ్య సేవల ఎగుమతుల్లో భారత్ 8వ స్థానంలో నిలిచింది.
- **వాణిజ్య సేవల దిగుమతులు:**
  - 2017లో వాణిజ్య సేవల దిగుమతుల్లో అమెరికా, చైనా, జర్మనీ మొదటి మూడు స్థానాలు పొందగా భారత్ పదో స్థానంలో నిలిచింది.
- **భారత ప్రధాన ఎగుమతులు, దిగుమతులు:**
  1. పెట్రోలియం ఉత్పత్తులు భారత్ ప్రధాన ఎగుమతి కాగా, తర్వాతి స్థానాల్లో విలువైన రాళ్లు, ఔషధ ఫార్ములేషన్స్, బంగారం, ఇతర విలువైన లోహాలు నిలిచాయి.
  2. ముడి చమురు భారత్‌కు సంబంధించి ప్రధాన దిగుమతి కాగా తర్వాతి స్థానాల్లో ముత్యాలు, పాక్షిక విలువైన రాళ్లు, బంగారం నిలిచాయి.
- **భారత ఉత్పత్తుల ఎగుమతులకు ప్రధాన కేంద్రాలు:**
  - భారత్ ఎగుమతులకు ప్రధాన కేంద్రం అమెరికా కాగా, తర్వాతి స్థానాల్లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, చైనా, హాంకాంగ్ నిలిచాయి. విలువ పరంగా భారత్ మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 16 శాతం. భారత్ ఎగుమతుల వృద్ధిని వివిధ దేశాల పరంగా పరిశీలిస్తే నెదర్లాండ్స్ ప్రథమ స్థానంలో, తర్వాతి స్థానాల్లో చైనా, నేపాల్ నిలిచాయి.
- **భారత్ దిగుమతులు:**
  - 2018-19లో భారత్ దిగుమతుల్లో చైనా వాటా 13.7 శాతం. భారత్ దిగుమతుల్లో చైనా ప్రథమ స్థానం పొందగా తర్వాతి స్థానాల్లో అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా నిలిచాయి.
- **ప్రపంచ వాణిజ్య వృద్ధి క్షీణతకు కారణాలు:**
  - అమెరికా, చైనా వాణిజ్య ఉద్రిక్తతలు, అల్ప ప్రపంచ వృద్ధిరేటు, విత్త మార్కెట్లో ఆటుపోట్లు, నూతన దిగుమతి సుంకానికి సంబంధించిన చర్యలు.
- **భారత్-లాజిస్టిక్ రంగం:**
  - ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్ రంగ ప్రగతి సూచీ (2016)లో భారత్ 35వ స్థానంలో నిలిచింది. 2018లో 44వ స్థానం పొందింది. ఈ రంగం దేశంలో కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ పరిశ్రమ విలువను 215 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. గత అయిదేళ్ల కాలంలో లాజిస్టిక్ పరిశ్రమ సగటు వార్షిక వృద్ధి 7.8 శాతం.
- **ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు:**
  1. భారత్, బంగ్లాదేశ్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉండగా, ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కోసం రెండు దేశాలూ ప్రయత్నిస్తున్నాయి.
  2. భారత్, ఇరాన్ మధ్య ప్రాధాన్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి.
  3. భారత్-నేపాల్ మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించి సమీక్షా సమావేశాలు జరుగుతున్నాయి.
  4. భారత్-శ్రీలంక మధ్య నూతన ఆర్థిక, సాంకేతిక సహకార ఒప్పందానికి చర్చలు జరుగుతున్నాయి.
- **ద్రవ్యలోటు, రెవెన్యూ లోటు, ప్రాథమిక లోటు:**
  1. 2017-18లో ద్రవ్యలోటు 3.5 శాతం, 2018-19లో 3.4 శాతం.
  2. రెవెన్యూ లోటు 2017-18లో 2.6 శాతం, 2018-19లో 2.3 శాతం.
  3. ప్రాథమిక లోటు 2017-18లో 0.4 శాతం, 2018-19లో 0.3 శాతం.
- **రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు-జీఎస్‌డీపీ:**
  - చండీఘర్, ఢిల్లీల జీఎస్‌డీపీలో సేవారంగం వాటా అత్యధికంగా 80 శాతం కంటే ఎక్కువగా ఉంది. సిక్కిం జీఎస్‌డీపీలో సేవారంగం వాటా అతి తక్కువగా 30.2 శాతంగా నమోదైంది. జీఎస్‌డీపీలో సేవారంగం వాటా కర్ణాటకలో 65.9 శాతం, తెలంగాణలో 63.2 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 42.7 శాతం వాటాను కలిగి ఉన్నాయి.



డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్, హైదరాబాద్

> **చాలా గర్వంగా ఉంది**
> సింధు ఫైనల్స్‌లోనూ గెలవగలదని నిరూపించింది. ప్రపంచ చాంపియన్ స్వర్ణం సాధించడం గొప్పగా అని పిస్తోంది. ఈ క్షణంలో తనతో ఉండటం చాలా గర్వంగా ఉంది. సింధు టోర్నీ కోసం చాలా కష్టపడింది. ఆమె కష్టానికి ప్రతిఫలం దక్కింది.
> – పీవీ రమణ (సింధు తండ్రి)

**అమ్మకు అంకితం...**

హైదరాబాద్‌కు వచ్చాకే సంబరాలు చేసుకుంటా. ప్రస్తుతం టీమ్‌తో కలిసి డిన్నర్‌కి వెళ్తున్నా. ఈ విజయాన్ని మా అమ్మకు అంకితమిస్తున్నా. నేడు (ఆదివారం) ఆమె పుట్టినరోజు. తనకు ఏదైనా బహుమతి ఇవ్వాలనుకున్నా. చివరకు ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణాన్ని ఆమెకు ఇస్తున్నా. వారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా. –పీవీ సింధు



సింధు తల్లి విజయ సంబరం..

# సింధు స్వర్ణ ప్రపంచం 2.0



నిరీక్షణ ముగిసింది. పసిడి స్వప్నం సాకారమైంది. స్విట్జర్లాండ్‌లో ఆదివారం అద్భుతం ఆవిష్కృతమైంది. బ్యాడ్మింటన్‌లో అందని ద్రాక్షగా ఉన్న విశ్వకిరీటం మన సొంతమైంది. గత రెండు పర్యాయాల్లో పసిడి మెట్టుపై బోల్తా పడిన తెలుగు తేజం పూసర్ల వెంకట (పీవీ) సింధు మూడో ప్రయత్నంలో తన బంగారు కలను నిజం చేసుకుంది. రెండేళ్ల క్రితం హోరాహోరీగా సాగిన విశ్వ సమరంలో తనను ఓడించిన జపాన్ అమ్మాయి ఒకుహారాను ఈసారి సింధు చిత్తుగా ఓడించింది. ఈ క్రమంలో భారత్ తరఫున తొలిసారి ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన ఘనతను సాధించింది.

## విశ్వవిజేతగా పీవీ సింధు

- వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి మహిళల సింగిల్స్ టైటిల్ సొంతం
- ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డు
- ఫైనల్లో ఒకుహారాపై 21-7, 21-7తో అద్భుత విజయం
- కళ్లు చెదిరే ఆటతో ఆద్యంతం ఆధిపత్యం
- ప్రైజ్‌మనీ లేదు, ఖాతాలోకి 13 వేల ర్యాంకింగ్ పాయింట్లు

బాసెల్ (స్విట్జర్లాండ్): ఎట్టకేలకు తెలుగు తేజం పూసర్ల వెంకట (పీవీ) సింధు ప్రపంచ పసిడి కల నిజమైంది. ప్రత్యర్థిపై చిరుతలా విరుచుకుపడిన సింధు అనుకున్నది సాధించింది. ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ చరిత్రలో స్వర్ణ పతకం గెలిచిన తొలి భారతీయురాలిగా ఈ తెలుగమ్మాయి కొత్త చరిత్ర లిఖించింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ సింధు కేవలం 38 నిమిషాల్లో 21–7, 21–7తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, 2017 ప్రపంచ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్)పై గెలిచింది. ఈ విజయంతో 42 ఏళ్ల ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో అత్యధిక పతకాలు గెలిచిన ప్లేయర్‌గా చైనా క్రీడాకారిణి జాంగ్ నింగ్ (స్వర్ణం, 2 రజతాలు, 2 కాంస్యాలు) పేరిట ఉన్న రికార్డును సింధు (స్వర్ణం, 2 రజతాలు, 2 కాంస్యాలు) సమం చేసింది. ఒకుహారాపై తాజా విజయంతో ముఖాముఖి రికార్డులో సింధు ఆధిక్యాన్ని 9–7కు పెంచుకుంది. ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన సింధుకు 13 వేల ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విజేతలకు ఎలాంటి ప్రైజ్‌మనీ లేదు. వారికి కేవలం పతకాలు మాత్రమే అందజేస్తారు.

### ఆహా... ఏమి ఆట...

తన చిరకాల ప్రత్యర్థి ఒకుహారాతో జరిగిన ఫైనల్లో సింధు తొలి పాయింట్ నుంచి చివరి పాయింట్ వరకు దూకుడుగానే ఆడింది. ఏదశలోనూ ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇవ్వలేదు. తొలి గేమ్‌లో తొలి పాయింట్‌ను 22 షాట్‌ల ర్యాలీలో కోల్పోయిన సింధు ఆ తర్వాత విశ్వరూపమే చూపించింది. వరుసగా 8 పాయింట్లు గెల్చుకొని 8–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ ఎనిమిది పాయింట్లలో ఆరు సింధు ధాటికి ఒకుహారా చేసిన అనవసర తప్పిదాలతోనే వచ్చాయి. మిగతా రెండు పాయింట్లను సింధు విన్నర్స్‌తో సాధించింది. ఆ తర్వాత ఒకుహారా ఒక పాయింట్ గెలిచినా... సింధు మళ్లీ చెలరేగింది. ఈసారీ వరుసగా 8 పాయింట్లు గెలిచి 16–2తో తిరుగులేని ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో సింధు తొలి గేమ్‌ను కేవలం 16 నిమిషాల్లో దక్కించుకుంది.

### ఎక్కడా తగ్గలేదు...

తొలి గేమ్ గెల్చుకున్న సింధు రెండో గేమ్‌లోనూ హడలెత్తించింది. ఒకుహారా ఆటతీరుపై పూర్తి హోంవర్క్ చేసినట్లు కనిపించిన ఈ హైదరాబాదీ ఆటలో వైవిధ్యం కనబరిచింది. సింధు జోరుకు ఎలా అడ్డుకట్ట వేయాలో ఏదశలోనూ ఒకుహారాకు అంతు చిక్కలేదు. నేరుగా ఒకుహారా శరీరంపై సింధు



రజతంతో ఒకుహారా

సంధించిన కొన్ని స్మాష్ షాట్‌లకు జపాన్ క్రీడాకారిణి వద్ద సమాధానమే లేకపోయింది. సింధు కొట్టిన స్మాష్‌లకు ఒకుహారా రిటర్న్ చేసినా ఆ స్మాష్‌ల వేగానికి కొన్నిసార్లు షటిల్స్ బయటకు వెళ్లిపోయాయి. ఫలితంగా రెండో గేమ్‌లో విరామానికి సింధు 11–4తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత కూడా సింధు ఆధిపత్యం కొనసాగించి క్రమం తప్పకుండా పాయింట్లు సాధించగా... ఒకుహారా పూర్తిగా డీలా పడిపోయింది. స్కోరు 20–7 వద్ద సింధు కొట్టిన స్మాష్ షాట్‌ను ఒకుహారా రిటర్న్ చేయలేకపోవడంతో పాయింట్, గేమ్‌తోపాటు మ్యాచ్‌నూ భారత స్టార్ కైవసం చేసుకుంది. 2006లో 21 పాయింట్ల విధానం ప్రవేశ పెట్టాక ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఏకపక్షంగా ముగిసిన మహిళల సింగిల్స్ ఫైనల్ ఇదే కావడం గమనార్హం.

పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, టాప్ సీడ్ కెంటో మొమోటా (జపాన్) టైటిల్ నిలబెట్టుకున్నాడు. ఫైనల్లో వరల్డ్ నంబర్‌వన్ మొమోటా 21–9, 21–3తో ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)ను ఓడించాడు.

### బాయ్ నజరానా రూ. 20 లక్షలు

ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన పీవీ సింధుకు భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) రూ. 20 లక్షలు నగదు పురస్కారం అందజేయనున్నట్లు ప్రకటించింది. 36 ఏళ్ల తర్వాత పురుషుల సింగిల్స్‌లో కాంస్య పతకం గెలిచిన సాయిప్రణీత్‌కు రూ. 5 లక్షలు నగదు బహుమతి ఇస్తామని 'బాయ్' అధ్యక్షుడు హిమంత బిశ్వశర్మ ప్రకటించారు.

## ఆ పిలుపు... చెప్పలేని ఆనందం

**నా రాకెట్‌తోనే సమాధానమిచ్చా • సాక్షితో సింధు**

భారత బ్యాడ్మింటన్ చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించిన సింధు... తనపై ఇప్పటివరకు వచ్చిన అన్ని విమర్శలకు రాకెట్‌తో సమాధానమిచ్చింది. 'గొప్ప టోర్నీలు ఆడగలదు కానీ ఫైనల్స్ గెలవలేదు' అని ధ్వజమెత్తిన విమర్శకుల నోళ్లన్నీ ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణంతో మూగబోయేలా చేసింది. ఇక నుంచి పట్టిందల్లా బంగారమే అనే స్థాయిలో బరిలో దిగుతానంటూ, గెలవాలనే స్ఫూర్తి తనలో నిరంతరం రగులుతూనే ఉంటుందంటూ స్విట్జర్లాండ్ నుంచి 'సాక్షి క్రీడా ప్రతినిధి'తో ఫోన్‌లో తన అభిప్రాయాలను పంచుకుంది. ఆ విషయాలన్నీ ఆమె మాటల్లోనే...

**ఈ విజయం ఎలా అనిపిస్తోంది?**

చాలా చాలా ఆనందంగా ఉంది. నా అనుభూతి చెప్పడానికి మాటలు రావట్లేదు. ఈ గెలుపు కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నా. చివరికి 'ప్రపంచ చాంపియన్' అనే హోదా దక్కింది. రజతాలు, కాంస్యాలు ఎన్ని సాధించినా ... 'సింధు ప్రపంచ చాంపియన్' అనే పిలుపు చెప్పలేనంత ఆనందాన్నిస్తోంది.

**దీన్నిమించిన ఒలింపిక్స్ పతకమే ఉందిగా?**

ఈ విజయాన్ని ఒలింపిక్స్ పతకంతో పోల్చవద్దు. ఒలింపిక్స్ అత్యున్నత స్థాయి టోర్నీ అయినప్పటికీ ప్రపంచ ఈవెంట్ కూడా దీనికి తక్కువేమీ కాదు. నా దృష్టిలో రెండూ వేర్వేరు. దేని విలువ దానిదే.

**ఈ టోర్నీ కోసం ఎలా సన్నద్ధమయ్యారు?**

కోచ్‌లు గోపీ సర్‌తో పాటు కిమ్ జి హ్యాన్ టోర్నీ కోసం నన్ను చాలా బాగా సిద్ధం చేశారు. వ్యూహాల్ని పక్కాగా అమలు చేశా. కొత్త ట్రెయినర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నా ఫిట్‌నెస్ మరో స్థాయికి చేరింది. గతంలో ర్యాలీలు ఆడాల్సినప్పుడు చాలా అలసిపోయేదాన్ని. కానీ ఇప్పుడు సమర్థంగా ఎదుర్కొంటున్నా.

**తదుపరి లక్ష్యం?**

టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించాలి. నేనెప్పుడు ఇక చాల్లే అని అనుకోలేదు. ఇంకా గెలవాలి, బాగా ఆడాలనే అనుకుంటా. ప్రతీ గెలుపు మరింత బాగా ఆడాలనే స్ఫూర్తినిస్తుంది. ప్రస్తుతం ప్రపంచ చాంపియన్ హోదా వచ్చాక నా బాధ్యత మరింత పెరిగింది. నాపై అంచనాలు పెరుగుతాయి. కాబట్టి మరింత బాగా ఆడాలి. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ కూడా సాధించాల్సి ఉంది.

### ప్రశంసల వెల్లువ..

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గిన సింధుకు అభినందనలు. యావత్ దేశం గర్వించదగ్గ క్షణాలివి. ఈ మీ విజయం లక్షలాది మందికి ప్రేరణగా పనిచేస్తుందని ఆశిస్తున్నాను.
–రామ్‌నాథ్ కోవింద్, రాష్ట్రపతి

నీ ప్రదర్శనతో దేశం మొత్తం మళ్లీ గర్వపడేలా చేశావ్. ఆటపట్ల ఉన్న అంకితభావం, గెలవాలన్న కసి భావి తరాల క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందని విశ్వసిస్తున్నాను.
–నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

ప్రపంచ చాంపియన్ షిప్‌లో టైటిల్ గెలిచిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించిన సింధుకు అభినందనలు. ఇదొక చారిత్రక విజయం. కాంస్యం నెగ్గిన సాయిప్రణీత్‌కు కూడా శుభాకాంక్షలు.
–వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏపీ సీఎం

సింధుకు శుభాకాంక్షలు. నీ విజయం దేశానికే గర్వకారణం. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలి.
–కేసీఆర్, తెలంగాణ సీఎం

సింధు... నీ చారిత్రక విజయంతో దేశం మొత్తం గర్విస్తోంది.
– నరసింహన్, తెలంగాణ గవర్నర్

సింధుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. చాంపియన్స్‌ను తయారు చేయడానికి ప్రభుత్వం ఎల్లవేళలా ముందుంటుంది.
– కిరణ్ రిజిజు, కేంద్ర క్రీడల మంత్రి

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో విజయం సాధించిన తెలుగు క్రీడాకారిణి పీవీ సింధుకు అభినందనలు. భవిష్యత్‌లో ఆమె మరిన్ని విజయాలు అందుకోవాలి.
–విశ్వభూషణ్ హరిచందన్, ఏపీ గవర్నర్

గొప్ప ప్రదర్శన. ప్రపంచ చాంపియన్ అయినందుకు అభినందనలు. మరోసారి దేశం గర్వపడేలా చేశావ్.
–సచిన్ టెండూల్కర్

సింధు అభినందనలు. అత్యద్భుత ప్రదర్శన చేశావ్. నీ ప్రదర్శన ఎంతోమంది యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆశిస్తున్నాను.
– కేటీఆర్, తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు

ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా నాలుగు ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలు ఖాతాలో ఉన్నాయి. అంతకుమించి మూడేళ్ల క్రితమే ఒలింపిక్స్ రజత మాల తన మెడలో పడింది. ఇక సూపర్ సిరీస్ టోర్నీ విజయాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అవార్డులు, రివార్డులు... ఆర్జనలో మేటి అని 'ఫోర్బ్స్' అంకెలు అగ్ర తాంబూలమిస్తున్నాయి. 24 ఏళ్ల వయసులో ఇన్ని ఘనతల తర్వాత మరో ప్లేయర్ అయితే తాము సాధించినదానితో సంతృప్తి పడిపోయేవారేమో... కొత్తగా స్ఫూర్తి పొందడానికి వారికి ఏమీ ఉండకపోయేదేమో. కానీ మన సింధు అలా అనుకోలేదు. ప్రపంచ వేదికపై ఆమె స్వర్ణదాహం తీరలేదు. అందుకే ఈసారి బంగారం పట్టాలని పట్టుదలగా బరిలోకి దిగింది. తై జు యింగ్‌పై క్వార్టర్స్‌లో అద్భుత విజయం తర్వాత 'ఇంకా నా ఆట పూర్తి కాలేదు' అంటూ సవాల్ విసిరిన సింధు మరో రెండు మ్యాచ్‌లలో అదే జోరు ప్రదర్శించింది. అందకుండా ఊరిస్తున్న పసిడిని తన ఖాతాలో వేసుకొని షటిల్ శిఖరాన నిలిచింది.

### 'వరల్డ్' అరంగేట్రంలోనే అదుర్స్...

2013లో సింధు తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్ వేదికపై తన అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నంలో ఉన్నప్పుడు ఆమెపై పెద్దగా అంచనాలేమీ లేవు. అయితే ఇద్దరు చైనా స్టార్లపై సాధించిన రెండు విజయాలు సింధు భవిష్యత్తును చూపించాయి. ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ వాంగ్ యిహాన్‌ను, క్వార్టర్ ఫైనల్లో వాంగ్ షిజియాన్‌లను ఆమె అలవోకగా ఓడించింది. తర్వాతి ఏడాది కూడా షిజియాన్‌ను చిత్తు చేసి అప్పటి నుంచి చైనా మనకు ఏమాత్రం అడ్డుగోడ కాదని సింధు నిరూపించింది. టీనేజీ దాటకుండానే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్యాలు గెలుచుకున్న సింధు తర్వాతి లక్ష్యం వైపు వేగంగా దూసుకుపోయింది. 2015 కొంత నిరాశపర్చినా... తర్వాతి ఏడాది సింధు గర్జన 'రియో'లో వినిపించింది. 2016 ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన తర్వాత ఈ తెలుగు తేజం స్థాయి ఒక్కసారిగా పెరిగి



కోచ్ గోపీతో..

పోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఇప్పుడు ఆమె విశ్వ సమరంలో పతకం గెలవకపోతే ఆశ్చర్య పడాలి కానీ గెలిస్తే అందులో విశేషం ఏమీ లేని స్థితికి చేరుకుంది! ఇలాంటి లెక్కలను సింధు నిజం చేసి చూపించింది. వరుసగా రెండేళ్లు 2017, 2018లలో వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్ చేరిన సింధు సత్తా వెండి వెన్నెల కురిపించింది.

### లోపాలపై దృష్టి పెట్టి...

సహజంగానే సింధు ఈసారి స్వర్ణానికి గురి పెట్టింది. చెట్టు చిటారు కొమ్మన నిలిచిన పక్షిని కొడితే రజతంతో ఆగిపోవాల్సి వస్తోంది తప్ప బంగారం మెరుపు దక్కడం లేదు. అందుకే ఇప్పుడు పక్షి కన్నుపైకే గెలుపు బాణాన్ని సంధించింది. అందు కోసం తీవ్రంగా శ్రమించింది. ప్రత్యేకంగా తన లోపాలపై దృష్టి పెట్టి సాధన చేసింది. క్వార్టర్స్‌లో తై జుతో జరిగిన మ్యాచ్‌లో ఇది కనిపించింది. తొలి గేమ్‌ను చిత్తుగా కోల్పోయినా... తర్వాత చెలరేగింది. మ్యాచ్ ఆసాంతం చూస్తే ప్రత్యర్థి శరీరంపైకి స్మాష్‌లను సంధించడం సింధు ఆటలో కొత్త కోణం. చివర్లో ఒత్తిడిలో పడే సమస్య రాకుండా ఆరంభం నుంచే దూకుడుకు ప్రాధాన్యతనిచ్చింది. తన ఎత్తు కారణంగా డ్రాప్ షాట్‌లను రిటర్న్ చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందిని కూడా అధిగమించింది. తనకు స్మాష్ కొట్టే అవకాశం వచ్చే వరకు ప్రత్యర్థిని సాధ్యమైనంతగా ర్యాలీలతోనే ఆడించే ప్రయత్నం చేయడం ఫలితాన్నిచ్చింది. 360 డిగ్రీల కోణంలో చురుకైన కదలికలతో కోర్టు మొత్తాన్ని కవర్ చేస్తూ ఈ మెగా టోర్నీలో సింధు ఆడిన ఆట నిజంగా సూపర్బ్.

### తదుపరి స్వర్ణ గురి 'టోక్యో'లో...

నిజానికి 2019లో సింధుకు గొప్ప ఫలితాలు ఏమీ రాలేదు. ఇండోనేసియా మాస్టర్స్‌లో క్వార్టర్స్‌లో ఓడగా, ఆల్ ఇంగ్లండ్‌లో తొలి రౌండ్‌లోనే ఓడటం ఆమె ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసింది. ఇండియా ఓపెన్‌లో, సింగపూర్ ఓపెన్‌లోనూ సెమీస్‌కే పరిమితం కాగా, మలేసియా ఓపెన్‌లో కనీసం క్వార్టర్స్ ఆనందం కూడా దక్కలేదు. ఆసియా చాంపియన్‌షిప్, ఆస్ట్రేలియన్ ఓపెన్‌దీ అదే కథ. ఇండోనేసియాలో రన్నరప్‌గా నిలవడంతో కొంత సంతృప్తి దక్కగా, తర్వాతి వారమే జపాన్‌లో ఆనందం ఆవిరైంది. వరల్డ్ చాంపియన్‌షిప్ సన్నాహాల కోసం థాయిలాండ్ ఓపెన్‌కు దూరమైన ఈ హైదరాబాదీ చివరకు తన లక్ష్యాన్ని చేరింది. తాజా ఫామ్, సర్క్యూట్‌లో ఉన్న ప్రత్యర్థులను బట్టి చూస్తే మరో ఒలింపిక్ పతకం సింధు కోసం ఎదురు చూస్తున్నట్లే కనిపిస్తోంది. బ్రెజిల్ గడ్డపై చేజారిన కనకపు హారాన్ని టోక్యోలో వరిస్తే భారత అభిమానులకు కావాల్సిందేముంది!
–సాక్షి క్రీడావిభాగం

# సాహో స్టోక్స్

**అజేయ సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలిపించిన ఆల్‌రౌండర్**



లీచ్ స్టోక్స్

లీడ్స్: మలుపులు తిరుగుతూ సాగిన యాషెస్ మూడో టెస్టులో యాంటీ క్లైమాక్స్! నాలుగో ఇన్నింగ్స్‌లో దాదాపు అసాధ్యమైన 359 పరుగుల లక్ష్య ఛేదనలో, అది కూడా 9 వికెట్లు కోల్పోయి ఓటమి ఖాయమైన స్థితిలో ఇంగ్లండ్ ఆల్ రౌండర్, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' బెన్ స్టోక్స్ (219 బంతుల్లో 135 నాటౌట్; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) మహాద్భుతం చేశాడు. అజేయంగా సెంచరీ బాది జట్టుకు ఒంటి చేత్తో అనూహ్య విజయం అందించాడు. ప్రత్యర్థి ఆస్ట్రేలియాకు గట్టి షాకిచ్చాడు. రెండు జట్ల మధ్య ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 156/3తో నాలుగో రోజు ఆదివారం ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్... స్టోక్స్ అమేయ పోరాటంతో మరో వికెట్ ఉండగానే 362 పరుగులు చేసి జయకేతనం ఎగురవేసింది. ఆట ప్రారంభంలోనే కీలకమైన కెప్టెన్ జో రూట్ (77) వికెట్ కోల్పోయి గెలుపుపై ఆశలు సన్నగిల్లిన ఇంగ్లండ్‌ను బెయిర్‌స్టో (36)తో కలిసి ఐదో వికెట్‌కు 86 పరుగులు జోడించి స్టోక్స్ ఆదుకున్నాడు. ఓ ఎండ్‌లో అతడు ధాటిగా ఆడుతున్నా బెయిర్‌స్టో సహా బట్లర్ (1), వోక్స్ (1), ఆర్చర్ (15), బ్రాడ్ (0) వికెట్లు పడగొట్టి ఆసీస్ విజయానికి దగ్గరైంది. 286 వద్ద 9వ వికెట్ పడిన దశలో మరో 73 పరుగులు చేయాల్సి ఉండటంతో ఆతిథ్య జట్టు కథ ముగిసినట్లే అనిపించింది. అయితే, 11వ నంబరు బ్యాట్స్‌మన్ జాక్ లీచ్ (17 బంతుల్లో 1 నాటౌట్)ను కాపాడుకుంటూ స్టోక్స్ చెలరేగాడు. ఆసీస్ స్పిన్నర్ లయన్‌ను లక్ష్యంగా చేసుకుని సిక్స్‌లు బాదాడు. అదే ఊపులో పేసర్లపైనా ప్రతాపం చూపాడు. టి20 తరహాలో స్కూప్ షాట్లు, రివర్స్ స్వీప్‌లు ఆడుతూ సెంచరీని అందుకున్నాడు. ఈ క్రమంలో క్యాచ్–రనౌట్ మిస్, స్పష్టమైన ఎల్బీడబ్ల్యూ అప్పీల్ తిరస్కరణ రూపంలో స్టోక్స్‌కు కొంత అదృష్టం కూడా కలిసివచ్చింది. చివరకు కమిన్స్ బౌలింగ్‌లో బౌండరీతో లాంఛనం పూర్తిచేశాడు. లీచ్‌తో కలిసి పదో వికెట్‌కు అబేధ్యంగా 76 పరుగులు జోడించగా అందులో స్టోక్స్‌వే 74 పరుగులు ఉండటం విశేషం. టెస్టుల్లో చివరి వికెట్‌కు ఇది రెండో అత్యధిక భాగస్వామ్యం. ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికాపై కుశాల్ పెరీరా, విశ్వ ఫెర్నాండో జోడీ దక్షిణాఫ్రికాపై 78 పరుగులు చేసింది. యాషెస్ నాలుగో టెస్టు వచ్చే నెల 4 నుంచి జరుగుతుంది.



ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో తాను నెగ్గిన కాంస్య పతకంతో భారత ప్లేయర్ సాయిప్రణీత్

# కివీస్‌కు ఆధిక్యం

కొలంబో: శ్రీలంక–న్యూజిలాండ్ రెండో టెస్టుకు వర్షం అడ్డంకి తప్పడం లేదు. వాన కారణంగా నాలుగో రోజు ఆదివారం 48 ఓవర్లే పడ్డాయి. ఓవర్‌నైట్ స్కోరు 196/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్... వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ వాట్లింగ్ (208 బంతుల్లో 81 బ్యాటింగ్; 4 ఫోర్లు), ఆల్‌రౌండర్ గ్రాండ్‌హోమ్ (75 బంతుల్లో 83 బ్యాటింగ్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్ధ శతకాలతో 382/5తో నిలిచింది. ఓపెనర్ టామ్ లాథమ్ 154 పరుగులు చేసి ఔటయ్యాడు. ప్రస్తుతం ఆ జట్టు 138 పరుగుల ఆధిక్యంలో ఉంది. లంక తొలి ఇన్నింగ్స్‌లో 244 పరుగులకు ఆలౌటైంది.

# భారత్ ఘన విజయం

- 419 పరుగుల లక్ష్య ఛేదనలో విండీస్ 100 ఆలౌట్
- హడలెత్తించిన బుమ్రా, ఇషాంత్
- భారత్ 343/7 డిక్లేర్డ్
- రహానే సెంచరీ; విహారి 93



రహానే

నార్త్‌సౌండ్ (అంటిగ్వా): కరీబియన్ పర్యటనలో టీమిండియా టెస్టు సిరీస్‌ను ఘన విజయంతో ప్రారంభించింది. బౌలింగ్‌లో ఎలాంటి ప్రతిఘటనా, బ్యాటింగ్‌లో ఒక్క మంచి ప్రదర్శనా కనబర్చలేని వెస్టిండీస్... సొంతగడ్డపై భారత్ చేతిలో దారుణ పరాజయం మూటగట్టుకుంది. రెండు జట్ల మధ్య ఇక్కడ జరిగిన తొలి టెస్టులో భారత్ 318 పరుగుల ఆధిక్యంతో గెలిచింది. పరుగుల పరంగా విండీస్ జట్టుపై భారత్‌కిదే అత్యుత్తమ విజయం. 1988 జనవరిలో చెన్నైలో జరిగిన టెస్టులో విండీస్‌పై 255 పరుగుల తేడాతో గెలిచిన రికార్డును భారత్ సవరించింది. టెస్టు చరిత్రలోనే రికార్డు లక్ష్యమైన 419 పరుగుల ఛేదనకు దిగిన విండీస్ నాలుగో రోజు 26.5 ఓవర్లలో 100 పరుగులకు ఆలౌటైంది. టీమిండియా బౌలర్లు బుమ్రా (5/7), ఇషాంత్ శర్మ (3/31), షమీ (2/13) చెలరేగి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. విండీస్ ఇన్నింగ్స్‌లో రోస్టన్ చేజ్ (29 బంతుల్లో 12; ఫోర్), కీమర్ రోచ్ (31 బంతుల్లో 38; ఫోర్, 5 సిక్స్‌లు), మిగెల్ కమిన్స్ (22 బంతుల్లో 19 నాటౌట్; 2 ఫోర్లు, సిక్స్) మినహా మిగతావారు కనీసం రెండంకెల స్కోరు చేయకుండానే వెనుదిరిగారు. రోచ్, కమిన్స్ చివరి వికెట్‌కు 50 పరుగులు జోడించారు. ఈ విజయంతో భారత్ రెండు టెస్టుల సిరీస్‌లో 1–0తో ఆధిక్యం సంపాదించింది. రెండో టెస్టు ఈనెల 30న కింగ్‌స్టన్‌లో మొదలవుతుంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 185/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 7 వికెట్లకు 343 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. వైస్ కెప్టెన్ అజింక్య రహానే (242 బంతుల్లో 102; 5 ఫోర్లు) రెండేళ్ల సెంచరీ నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. అతడికి తోడు ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి (128 బంతుల్లో 93; 10 ఫోర్లు, సిక్స్) చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. రహానే, విహారి సాధికారికంగా ఆడి ఐదో వికెట్‌కు 135 పరుగులు జత చేశారు.

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 228 ▲ | 88 ▲ |
| 36,701 | 10,829 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,752 | ▼ 240 |
| డోజోన్స్ | 25,629 | ▼ 623 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,095 | ▼ 33 |
| డాక్స్ | 11,612 | ▼ 136 |
| షాంఘై | 2,897 | ▲ 13 |
| నికాయ్ | 20,711 | ▲ 83 |


అమెరికా · బ్రిటన్ · జర్మనీ · చైనా · జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 71.25 | 72.90 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.60 | 89.74 |
| యూరో | ఎస్‌బీఐ | 78.30 | 81.25 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 66.40 | 68.90 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.67 | 49.86 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.11 | 52.86 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.33 | 20.09 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.77 | 20.33 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.50 | 10.85 |

# మీ ఫిక్స్‌డ్ డిపాజిట్ భద్రమేనా..?

- గరిష్టంగా రూ.లక్షకే ఒక బ్యాంకులో బీమా
- వివిధ బ్యాంకుల్లో రూ.లక్ష చొప్పున డిపాజిట్
- ఒకే బ్యాంకులో చేసుకోదలిస్తే కుటుంబ సభ్యుల పేర్లతో...
- చిన్న డిపాజిట్లుగా విడగొట్టడం వల్ల పలు ప్రయోజనాలు
- అవసరమైన సందర్భంలో ఒక డిపాజిట్ రద్దు చేసుకోవచ్చు
- వడ్డీ రేట్లు తగ్గుతున్నందున వివిధ కాలావధులకు డిపాజిట్లు



**బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ అన్నది రిటైల్ ఇన్వెస్టర్లకు ఎంతో విశ్వసనీయమైన, సౌకర్యమైన ఇన్వెస్ట్‌మెంట్ సాధనం. ఎన్నో దశాబ్దాలుగా ఎక్కువ మంది అనుసరించే సాధనాల్లో ఇది కూడా ఒకటి. ఎన్నో కాల పరీక్షలకు నిలిచింది. రిస్క్ లేని సాధనం కావడంతో రాబడి తక్కువైనా కానీ చిన్న ఇన్వెస్టర్లకు ఇది నమ్మతగ్గ ఆర్థిక సాధనంగా నిలబడింది. అయితే, ఇటీవలి సంవత్సరాల కాలంలో బ్యాంకుల్లోనూ సంక్షోభాలు వెలుగు చూస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో బ్యాంకుల్లో మీ డిపాజిట్ సురక్షితంగా ఉన్నట్టేనా...?**

•••

**బ్యాంకుల్లో డిపాజిట్లకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ యాక్ట్ (డీఐసీజీసీ) కింద బీమా ఉంటుంది. ఇందుకోసం డిపాజిట్ చేసిన వారు ఎటువంటి ప్రీమియం చెల్లించనక్కర్లేదు. ఆ పని బ్యాంకే చేస్తుంది. అయితే, ప్రతీ ఒక్కరూ ఇక్కడ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే... బ్యాంకులో ఒక వ్యక్తికి కేవలం రూ.లక్ష డిపాజిట్ మొత్తానికే బీమా వర్తిస్తుంది. ఒకవేళ రూ.లక్షకు మించి డిపాజిట్ చేసి ఉంటే అప్పుడు కూడా రూ.లక్షకే బీమా కవరేజీ ఉన్నట్టు. ఒకవేళ బ్యాంకు డిపాజిట్ దారునికి చెల్లించలేని పరిస్థితిలోకి వెళితే ఒక డిపాజిట్ దారునికి గరిష్టంగా రూ.లక్ష మేర బీమా కింద చెల్లింపులు చేస్తారు. అందుకే ఈ విషయంలో తమ డిపాజిట్‌కు భద్రత ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉంది.**

**ఇ**టీవలి కొన్ని నివేదికలను పరిశీలించినట్టయితే... మన బ్యాంకుల్లో మొత్తం డిపాజిట్లలో 30 శాతం డిపాజిట్లకే బీమా కవరేజీ ఉందని తెలుస్తోంది. పదేళ్ల క్రితం ఇది 60 శాతంతో పోలిస్తే సగానికి సగం తగ్గినట్టు భావించాలి. ఈ మధ్య కాలంలో రూ.లక్షకు మించి డిపాజిట్ చేసే వారి సంఖ్య బాగానే పెరుగుతోంది. రూ.లక్షకు మించి చేసే డిపాజిట్లకు రిస్క్ ఉందని అర్థం చేసుకోవాలి. ఊహించని పరిస్థితులు ఎదురై బ్యాంకు డిపాజిట్లు తిరిగి ఇవ్వలేని పరిస్థితి తలెత్తితే అప్పుడే రిస్క్‌లో పడతాం. కాకపోతే డిపాజిట్ దారులు తెలివిగా వ్యవహరించడం ద్వారా ఇటువంటి పరిస్థితులు రాకుండా చూసుకోవచ్చు.

## స్థిరమైన బ్యాంకు

**పె**ద్దవైన, స్థిరమైన బ్యాంకులు అంత సులభంగా సంక్షోభాల్లోకి వెళ్లకపోవచ్చు. ఆస్తుల పరమైన సమస్యలున్నప్పటికీ వాటిని అధిగమించే సామర్థ్యంతోనే ఉంటాయి. ఈ మధ్య కాలంలో ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ వంటి పెద్ద బ్యాంకులు రుణ ఆస్తుల విషయంలో ఎన్నో సమస్యలను చవిచూసినప్పటికీ, వాటిని అధిగమించే చర్యలతో మెరుగైన పనితీరునే చూపిస్తున్నాయి. పెద్ద బ్యాంకులు రుణాల విషయంలో కఠినమైన నిబంధనలనే అనుసరిస్తుంటాయి. అలాగే, యాజమాన్యం కూడా చురుగ్గానే వ్యవహరిస్తుందని భావించొచ్చు. మొత్తం రుణాల్లో... వసూలు కాని రుణాలు (ఎన్‌పీఏలు), ఎగవేసిన రుణాల పరిమాణం తక్కువగానే ఉంటుంది. మీరు చేసిన డిపాజిట్‌ను బ్యాంకు కొంత కాలం తర్వాత మీకు అవసరమైన సందర్భంలో తిరిగి చెల్లించగలదా..? అని తెలుసుకునేందుకు ఆ బ్యాంకు నికర వడ్డీ మార్జిన్‌ను పరిశీలించాలి. డిపాజిట్ దారులకు బ్యాంకు చెల్లించే వడ్డీ రేటు, రుణాలపై బ్యాంకు వసూలు చేసే వడ్డీ రేటు.. వీటి మధ్య వ్యత్యాసమే నికర వడ్డీ మార్జిన్ అవుతుంది. బ్యాంకు మొత్తం రుణ ఆస్తులపై సగటున ఈ నికర వడ్డీ మార్జిన్ ఎంతుందనేది బ్యాంకు ప్రతీ త్రైమాసికం ఫలితాల్లోనూ ప్రకటిస్తుంటుంది. పరిశ్రమ సగటు కంటే బ్యాంకు నికర వడ్డీ మార్జిన్ అధికంగా ఉంటే లేదా బెంచ్ మార్క్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నా సరే.. ఆ బ్యాంకు ఆర్థిక ఆరోగ్యం మెరుగ్గానే ఉన్నట్టు. దాంతో డిపాజిట్లను తిరిగి చెల్లించేందుకే ఎక్కువ అవకాశాలు ఉంటాయి.

## ఒకే చోట వద్దు

**ఆ**ర్థిక ఆరోగ్యంతో ఉన్న పెద్ద బ్యాంకులో చేసే డిపాజిట్లు భద్రంగానే ఉంటాయని భావించొచ్చు. అయితే, ఆ డిపాజిట్‌కు ఏమీ కాదులేనని గ్యారంటీగా చెప్పలేం. పెద్ద బ్యాంకులు తమ ఆస్తుల పరిమాణాన్ని పెంచుకునేందుకు భారీ ఎత్తుగడలనే అనుసరిస్తుంటాయి. కనుక రిస్క్ కూడా ఉంటుంది. అందుకని డిపాజిట్ చేసే సమయంలోనే మనమే కొన్ని చర్యలు అనుసరించడం లాభిస్తుంది. కనుక ఒకే బ్యాంకులో ఒకరి పేరిటే మొత్తం డిపాజిట్ చేయకపోవడం ఓ మంచి ఆలోచన. కుటుంబ సభ్యులు ఒక్కొకరి పేరిట గరిష్టంగా రూ.లక్ష వరకు డిపాజిట్ చేసుకోవడం వల్ల... భవిష్యత్తులో బ్యాంకు సంక్షోభంలోకి వెళ్లినా తమ డిపాజిట్లకు భద్రత ఉంటుంది. అయితే, డిపాజిట్‌పై ఆదాయానికి పన్ను వర్తిస్తుందని మర్చిపోవద్దు. ఇక కుటుంబ సభ్యుల పేరిట డిపాజిట్‌ను విభజించేందుకు ఇష్టం లేని వారు.. తమ పేరిట వివిధ బ్యాంకుల్లో రూ.లక్ష చొప్పున డిపాజిట్ చేసుకోవచ్చు. ఒకటే పెద్ద డిపాజిట్ కాకుండా దాన్ని పలు డిపాజిట్లుగా వేరు చేయడం వల్ల.. ఎప్పుడైనా డబ్బులతో పని పడితే అవసరమైనంత మేరకే డిపాజిట్లను రద్దు చేసుకోవచ్చు. అలా కాకుండా ఒక్క డిపాజిట్‌గానే చేయడం వల్ల ఆ మొత్తాన్ని రద్దు చేసుకోవాల్సి వస్తే కొంత రాబడిని కోల్పోవాల్సి వస్తుంది. మరొకరితో కలసి రూ.2 లక్షలు జాయింట్‌గా డిపాజిట్ చేశారనుకోండి. అప్పుడు రూ.2 లక్షలకూ బీమా కవరేజీ వర్తించేలా చూసుకోవచ్చు. ఒక్కొక్కరికి రూ.లక్ష డిపాజిట్‌పై బీమా అమలవుతుంది.

## వీటిని దృష్టిలో పెట్టుకోవాలి..

- కేవలం బ్యాంకుల్లో చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్ల(రూ.లక్ష వరకు)కే కొంత భద్రత ఉంటుంది. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ అన్నది ఆర్‌బీఐ సబ్సిడరీ. గుర్తుంచుకోవాల్సినది ఏమిటంటే... బ్యాంకు డిపాజిట్లకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లించి ఉండాలి.
- డిపాజిట్లను వివిధ బ్యాంకుల మధ్య వేరు చేయడం వల్ల రిస్క్‌ను చాలా వరకు తగ్గించుకోవచ్చు. పైగా ప్రస్తుతం వడ్డీ రేట్లు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకటే డిపాజిట్‌ను దీర్ఘకాలానికి చేయడానికి బదులు... చిన్న డిపాజిట్లుగా వేర్వేరు కాలాలకు డిపాజిట్ చేసుకోవడం మంచి ఆలోచన అవుతుంది. ఉదాహరణకు రూ.4 లక్షలు డిపాజిట్ చేసుకోదలిస్తే.. రూ.లక్ష చొప్పున ఒక్కో డిపాజిట్‌గా చేసుకోవాలి. ఏడాది, రెండేళ్లు, మూడేళ్లు, నాలుగేళ్ల కాలానికి ఒకటి కేటాయించుకోవాలి. ఏడాది డిపాజిట్ గడువు తీరిపోగానే తిరిగి నాలుగేళ్లకు డిపాజిట్ చేసుకోవాలి. దీని వల్ల దీర్ఘకాలంలో వడ్డీ రేట్ల పరంగా స్థిరత్వం ఉండేలా, లిక్విడిటీ ఉండేలా చూసుకోవచ్చు.
- ఎఫ్‌డీ చేసే సమయంలోనే కాలాన్ని ఆలోచించి నిర్ణయించుకోవాలి. దీర్ఘకాలానికి డిపాజిట్ చేసుకుని, ముందే రద్దు చేసుకుంటే తక్కువ రాబడులకే పరిమితం కావాల్సి వస్తుంది. ఎందుకంటే గడువుకు ముందే డిపాజిట్ రద్దు చేసుకుంటే బ్యాంకులు ఒక శాతాన్ని తగ్గించి ఇస్తాయి. ఏడాది కాలానికి 7 శాతం, 5 ఏళ్ల దీర్ఘకాలానికి 7.5 శాతం ఆఫర్ చేసినప్పుడు, వడ్డీ ఎక్కువగా వస్తుందన్న ఆలోచనతో దీర్ఘకాల డిపాజిట్‌కు వెళ్లడం కంటే అవసరమైన కాలానికే డిపాజిట్ చేసుకోవాలి.
- ఎఫ్‌డీపై వచ్చే డిపాజిట్ ఆదాయంపై పన్ను అమలవుతుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో వడ్డీ ఆదాయం రూ.10,000 దాటితే బ్యాంకులు వడ్డీ రాబడిపై 10.3 శాతాన్ని టీడీఎస్ కింద మినహాయిస్తాయి. ఇంతటితో పన్ను బాధ్యత తీరినట్టు కూడా కాదు. అధిక పన్ను పరిధిలో ఉంటే తమ శ్లాబు ప్రకారం అదనపు పన్ను కూడా చెల్లించాలి. టీడీఎస్ మినహాయించకపోయినప్పటికీ, బ్యాంకు సేవింగ్స్ ఖాతా, డిపాజిట్, బాండ్లపై వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. క్యుములేటివ్ బాండ్‌లో ఇన్వెస్ట్ చేస్తే పన్నును ఏటా చెల్లించడం మరిచిపోవద్దు. బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ ఆదాయం ఉన్నప్పటికీ, మొత్తం వార్షికాదాయం బేసిక్ కనీస మినహాయింపు పరిధిలోనే ఉంటే అప్పుడు టీడీఎస్‌ను వెనక్కి పొందేందుకు పన్ను రిటర్నులు దాఖలు చేసి క్లెయిమ్ చేసుకోవాలి. తమ ఆదాయం పన్ను మినహాయింపు పరిధిలోనే ఉందంటూ బ్యాంకులోనే ఫామ్ 15జీ ఇస్తే టీడీఎస్ మినహాయించరు. అదే సీనియర్ సిటిజన్లు అయితే ఫామ్ 15హెచ్ ఇవ్వాలి.
- మీ జీవిత భాగస్వామి, పిల్లల పేరిట డిపాజిట్ చేయడం ద్వారా పన్ను బాధ తప్పించుకోవచ్చు అనుకుంటే కుదరదు. మీ జీవిత భాగస్వామి, పిల్లలకు ఇచ్చే మొత్తంపై పన్ను చెల్లించనక్కర్లేదు. కానీ, అలా ఇచ్చిన మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసిన సందర్భాల్లో వచ్చే ఆదాయం, ఇచ్చిన వారి ఆదాయానికే కలుస్తుంది.

## ఇతర ఉత్పత్తులు

**డి**పాజిట్‌లకు ప్రత్యామ్నాయంగా రిస్క్ తక్కువగా ఉండే ఇతర పెట్టుబడి పథకాలను కూడా పరిశీలించొచ్చు. గవర్నమెంట్ సెక్యూరిటీలు లేదా జీసెక్‌లు అత్యధిక భద్రతతో ఉంటాయి. షార్ట్ టర్మ్ నుంచి లాంగ్ టర్మ్ వరకు ఎంచుకునే స్వేచ్ఛ కూడా ఉంటుంది. జీసెక్‌లను వద్దనుకుంటే సెకండరీ మార్కెట్లోనూ విక్రయించుకోవచ్చు. రెపో మార్కెట్‌లో వీటిపై రుణాలను కూడా పొందొచ్చు.

## స్టాక్స్ వ్యూ

### రెప్కో హోమ్ ఫైనాన్స్ — కొనొచ్చు

**బ్రోకరేజ్ సంస్థ:** ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
**ప్రస్తుత ధర:** రూ.307
**టార్గెట్ ధర:** రూ.460




**ఎందుకంటే:** తమిళనాడు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో అంచనాలను మించిన ఫలితాలను ప్రకటించింది. ఆదాయం, నికర వడ్డీ మార్జిన్‌లు మెరుగ్గా ఉండటం, పటిష్టమైన వ్యయ నియంత్రణ చర్యల కారణంగా రూ.62 కోట్ల నికర లాభం సాధించింది. రుణ మంజూరీలు 5% తగ్గి రూ.670 కోట్లకు చేరాయి. ఫలితంగా నిర్వహణ ఆస్తులు 13 శాతమే పెరిగాయి. సీజనల్ ట్రెండ్‌కు అనుగుణంగానే స్థూల మొండి బకాయిలు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో 3%గా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 4.2 శాతానికి పెరిగాయి. తమిళనాడు మార్కెట్ 8 శాతమే వృద్ధి సాధించగా, మహారాష్ట్ర 26%, గుజరాత్ 46 శాతం చొప్పున వృద్ధి చెందాయి. రుణ నాణ్యతలో ఒడిదుడుకులు, వృద్ధి మందగమనం తదితర అంచనాల కారణంగా గత ఏడాది సెప్టెంబర్‌లో ఈ షేర్‌ను డౌన్ గ్రేడ్ చేశాం. సమీప భవిష్యత్తులో షేర్ క్షీణత పరిమితంగానే ఉంటుందనే అంచనాలతో ఈ షేర్ రేటింగ్‌ను 'కొనొచ్చు'కు అప్‌గ్రేడ్ చేస్తున్నాం. రుణ రికవరీలకు ప్రాధాన్యం ఇస్తున్న ఈ కంపెనీ పెద్ద మొత్తం రుణాలకు దూరంగా ఉంటోంది. స్వయం ఉపాధి రంగం సెగ్మెంట్‌పై పట్టు ఉండటం, ఇతర సంస్థలు పట్టించుకోని సెగ్మెంట్లకు రుణాలివ్వడం సానుకూలాంశాలు. 12 రాష్ట్రాల్లో 147 బ్రాంచ్‌లు, 27 శాటిలైట్ సెంటర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. లోన్ క్యాంప్స్ నిర్వహణ ద్వారా రుణాలందిస్తోంది. ఫలితంగా మార్కెటింగ్ వ్యయాలు పెద్దగా ఉండకపోవడం కూడా కలసివచ్చే అంశమే.

### ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌బ్యాంక్ — కొనొచ్చు

**బ్రోకరేజ్ సంస్థ:** ఐసీఐసీఐ డైరెక్ట్
**ప్రస్తుత ధర:** రూ.43
**టార్గెట్ ధర:** రూ.54




**ఎందుకంటే:** ఐడీఎఫ్‌సీ బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్ సంస్థలు 2018, డిసెంబర్‌లో విలీనమై ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌బ్యాంక్ ఏర్పడింది. రూ.1,12,558 కోట్ల ఆస్తులతో ఎనిమిదవ అతి పెద్ద ప్రైవేట్ బ్యాంక్‌గా అవతరించింది. క్యాపిటల్ ఫస్ట్ సంస్థను విజయపథంలో నడిపించిన వి. వైద్యనాథన్ నేతృత్వంలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌బ్యాంక్ 279 బ్రాంచ్‌లతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కార్పొరేట్ రుణాల కంటే మార్జిన్లు అధికంగా ఉండే రిటైల్ రుణాలకు ప్రాధాన్యత ఇస్తోంది. రిటైల్ రుణాలు 27 శాతం చక్రగతి వృద్ధితో 2022–23 కల్లా రూ.1,06,850 కోట్లకు పెరుగుతాయని అంచనా. ఫలితంగా స్థూల రుణాలు 10 శాతం చక్రగతి వృద్ధితో రూ.1,62,880 కోట్లకు చేరగలవని భావిస్తున్నాం. ప్రస్తుతం మొత్తం రుణాల్లో 35 శాతంగా ఉన్న రిటైల్ రుణాలు నాలుగేళ్లలో 66 శాతానికి పెరుగుతాయని అంచనా. ఫలితంగా ఈల్డ్స్ 13.1 శాతానికి చేరతాయి. నాలుగేళ్లలో కాసా డిపాజిట్లు నాలుగు రెట్లు పెరుగుతాయని అంచనా. ఫలితంగా కాస్ట్ ఆఫ్ ఫండ్స్ 1 శాతం మేర తగ్గుతుంది. మార్జిన్లు అధికంగా ఉండే రిటైల్ రుణాలు పెరగడం, కాస్ట్ ఆఫ్ ఫండ్స్ తగ్గడంతో రాబడి నిష్పత్తులు పెరుగుతాయి. నాలుగేళ్లలో రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్‌ఓఈ)11 శాతానికి ఎగుస్తుంది. ఈ బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ 4 శాతానికి పెరగనున్నది. ఈ విషయంలో హెచ్‌డీఎఫ్‌సీ, ఇండస్‌ఇండ్, కోటక్ బ్యాంక్‌ల సరసన నిలవగలుగుతుంది. ప్రస్తుతం రూ. 43గా ఉన్న ఈ షేర్ ఏడాది కాలంలో రూ.54కు పెరగగలదని భావిస్తున్నాం.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

# పసిడి ధరలు పటిష్టమే..!

- అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి నేపథ్యం
- వారంవారీగా 16 డాలర్లు పెరిగి 1,537 డాలర్లకు చేరిక
- త్వరలో 1,600 డాలర్లకు చేరే చాన్స్



**న్యూఢిల్లీ/న్యూయార్క్:** పసిడి బులిష్ ట్రెండ్ కనబడుతోంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితి .. ప్రత్యేకించి అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రత, ఈక్విటీ మార్కెట్ల బలహీనత, అమెరికా ఆర్థికాభివృద్ధి మళ్లీ మాంద్యంలోకి జారిపోతుందన్న అంచనాలు, దీనితో వడ్డీరేట్ల తగ్గింపునకే ఫెడ్ మొగ్గు చూపిస్తుందన్న విశ్లేషణలు పసిడికి బలాన్ని ఇస్తున్నాయి. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులకు పసిడిని ఒక తక్షణం ఒక సురక్షిత సాధనంగా ఎంచుకుంటున్నారు. అమెరికాపై చైనా ప్రతీకార టారిఫ్‌ల నేపథ్యంలో– శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రా) ఒకేరోజు 28 డాలర్లు ఎగిసి 1,537 డాలర్లకు పెరిగింది. ఇది వారం వారీగా 16 డాలర్ల పెరుగుదల. 1,546 డాలర్లు ఈ ఏడాది గరిష్టం కావడం గమనార్హం. 1,360 డాలర్ల కీలక నిరోధాన్ని దాటిన తర్వాత పసిడి వేగంగా 1,546 స్థాయిని తాకిన సంగతి తెలిసిందే. రానున్న వారం రోజుల్లో పసిడి 1,600 డాలర్ల స్థాయిని చేరడం ఖాయమన్న అభిప్రాయం ఉంది. ఇక దేశీయంగా చూసినా పసిడి రికార్డులు సృష్టిస్తోంది. అంతర్జాతీయంగా పసిడి బలపడ్డంతోపాటు, డాలర్ మారకంలో రూపాయి (శుక్రవారం 71.66 వద్ద ముగింపు)బలహీన ధోరణి కూడా దేశీయంగా పసిడికి కలిసివస్తోంది. దేశీయంగా ఫ్యూచర్స్ మార్కెట్– మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసీఎక్స్‌లో పసిడి ధర 10 గ్రాములకు రూ.38,765 వద్ద ఉంది.

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

*రూ. కోటి వరకు డిపాజిట్లు, (ఆగస్టు-23-2019 అంకెలు శాతాల్లో)*

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6.6 | 6.8 | 6.75 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.75 | 7.2 | 7 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 6.25 | 6.6 | 6.45 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.5 | 6.5 |
| కెనరా బ్యాంక్ | 6.2 | 6.5 | 6.4 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.25 | 6.6 | 6.45 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.5 | 6.9 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.75 | 7.3 | 7.25 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6.5 | 7.1 | 7 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6.5 | 7.1 | 6.85 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 7 | 7.5 | 7.5 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 6.75 | 6.9 | 6.75 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 6.25 | 6.8 | 6.7 |
| పీఎన్‌బీ | 6.3 | 6.75 | 6.5 |
| ఎస్‌బీఐ | 6.25 | 6.8 | 6.6 |
| సిండికేట్ బ్యాంక్ | 6 | 6.7 | 6.5 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.75 | 7.25 |

*బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...*

# రాబడుల్లో 'డైనమిక్'..

## ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఆల్ సీజన్స్ బాండ్

**ఫండ్ రివ్యూ**




**లాం**గ్ డ్యూరేషన్ గిల్ట్ ఫండ్స్ ఈ ఏడాది ఇప్పటి వరకు మంచి ర్యాలీ చేశాయి. పదేళ్ల జీసెక్ ఈల్డ్స్ 80–90 బేసిస్ పాయింట్ల మేర పడిపోవడం గిల్ట్ ఫండ్స్ రాబడులకు దారితీసింది. అయితే, జూలై నెలలో 60 బేసిస్ పాయింట్ల వరకు ర్యాలీ చేసిన తర్వాత గత వారంలో పదేళ్ల జీసెక్ ఈల్డ్స్ తిరిగి స్వల్పంగా పెరిగాయి. కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు పై నెలకొన్న ఆందోళనలే ఇందుకు కారణం. ఆర్‌బీ ఐ ఇటీవలే రెపో రేటును 35 బేసిస్ పాయింట్ల మేర తగ్గించడం గిల్ట్ ఫండ్స్‌కు అనుకూలించేదే. ఎన్నో అంశాలు బాండ్ మార్కెట్‌పై ప్రభావం చూపిస్తుంటాయి. కనుక వీటి విషయంలో నిర్ణయం తీసుకోవడం రిటైల్ ఇన్వెస్టర్లకు నిజంగా ఓ టాస్క్ అనుకోవాలి. మోస్తరు రిస్క్ తీసుకునేవారు, బాండ్ ధరల ర్యాలీని సొమ్ము చేసుకోవాలనుకునే వారు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఆల్ సీజన్స్ బాండ్ తరహా డైనమిక్ బాండ్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు.

**పనితీరు..:** డైనమిక్ బాండ్ ఫండ్స్ వివిధ కాల వ్యవధులతో కూడిన బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. దీని ద్వారా వడ్డీ రేట్లలో మార్పుల ప్రభావాన్ని ఇవి అధిగమించగలవు. రేట్ల మార్పుల అంచనాల ఆధారంగా ఫండ్ మేనేజర్లు ఒకే కాల వ్యవధితో కూడిన సాధనాల్లో ఇన్వెస్ట్ చేయకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. డైనమిక్ బాండ్ ఫండ్స్ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఆల్ సీజన్స్ బాండ్ పథకం అన్ని రకాల మార్కెట్ పరిస్థితుల్లోనూ స్థిరమైన రాబడులను ఇచ్చిన చరిత్ర కలిగి ఉంది. ఈ పథకం ఏడాది కాలంలో 9.9 శాతం రాబడులను ఇచ్చింది. మూడేళ్ల కాలంలో 7.8 శాతం, ఐదేళ్లలో 10 శాతం వార్షిక సగటు రాబడులను ఇచ్చింది. కానీ, డైనమిక్ బాండ్ ఫండ్స్ విభాగం సగటు రాబడులు ఏడాది కాలంలో 9.3 శాతం, మూడేళ్లలో 6.3%, ఐదేళ్లలో 8.3%గా ఉన్నాయి. ఈ విభాగంతో పోలిస్తే ఒక శాతం అధికంగా ఈ పథకం రాబడులను ఇచ్చినట్టు తెలుస్తోంది.

**పెట్టుబడుల విధానం..:** ముఖ్యంగా 2014–16 మధ్య కాలంలో ఈ పథకం 16–19% వరకు రాబడులను ఇవ్వడం గమనార్హం. ఇక 2017లో బాండ్ మార్కెట్‌కు ప్రతికూలంగా ఉన్న ఏడాదిలో ఈ పథకం 5 శాతం రాబడులను ఇచ్చింది. దీర్ఘకాలిక గిల్ట్ ఫండ్స్ సైతం ఈ కాలంలో కేవలం 2–3 శాతమే రాబడులను ఇచ్చాయి. బాండ్ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా స్పందిస్తూ పోర్ట్‌ఫోలియోలో చేసే మార్పులే ఈ పథకం రాబడులు గొప్పగా ఉండేందుకు తోడ్పడుతున్నాయి. వడ్డీ రేట్లు పెరిగితే బాండ్ ధరలు తగ్గుతాయి. అదే విధంగా వడ్డీ రేట్లు పడిపోతే బాండ్ ధరలు పెరుగుతాయి. వడ్డీ రేట్లు, బాండ్ల ధరలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. గత మూడు సంవత్సరాల్లో ఈ పథకం పెట్టుబడులను గమనిస్తే ఏడాది నుంచి 13 ఏళ్ల కాల మెచ్యూరిటీతో కూడుకుని ఉండడం గమనార్హం. ప్రస్తుత ఈ పథకం పెట్టుబడుల్లో 37 శాతం వరకు ఏఏఏ, వీటికి సమానమైన రేటింగ్ పథకాల్లో, 41 శాతం వరకు ఏఏ రేటింగ్ పథకాల్లో ఉన్నాయి. 19.6% వరకు సార్వభౌమ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసింది.

### టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| 7.17% జీవోఐ 2028 | 7.97 |
| 7.26% జీవోఐ 2029 | 7.35 |
| ఎంబసీ ఆఫీసు పార్క్స్ రీట్2022 | 7.02 |
| 8.85% ఆర్‌ఈసీ 2029 | 5.48 |
| 8.65% రిలయన్స్ ఇండస్ట్రీస్ 2028 | 3.76 |
| 9.5% నయారా ఎనర్జీ 2021 | 3.58 |
| మోతీలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ | 3.58 |
| 8.4% ప్రొమంట్ హిల్‌సైడ్ 2020 | 3.54 |
| 8.5% వేదాంత2021 | 3.49 |
| శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ | 2.83 |



ఉద్యోగుల్లో ఆనందమే...
కంపెనీ అభివృద్ధికి మూలం!
- వాగ్ ఆస్ట్, మేనేజ్‌మెంట్ గురు

## బొమ్మ-బొరుసు



## ఉద్దీపన ప్యాకేజీతో ఎకానమీకి ఊతం: సీఐఐ



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన చర్యలు ఆర్థిక వ్యవస్థను స్థిరపర్చగలవని పరిశ్రమల సమాఖ్య సీఐఐ పేర్కొంది. బహుళ రంగ, బహుముఖ విధానపరమైన చర్యలతో వృద్ధికి ఊతం లభించగలదని సీఐఐ ప్రెసిడెంట్ విక్రమ్ కిర్లోస్కర్ తెలిపారు. అంతర్జాతీయంగా ప్రతికూలతలు, వాణిజ్యపరమైన మందగమనం కారణంగా ప్రపంచ ఎకానమీకి అస్తవ్యస్తంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ ప్రకటన పరిశ్రమలకు ఊరటనిచ్చేవిగా ఉన్నాయని చెప్పారు. 'ద్రవ్య లోటుపై ఒత్తిడి పడకుండా బహుళ రంగాలకు ఊతమిచ్చే ప్రతిపాదనలు రూపొందించిన తీరు ప్రశంసనీయం. ఈ ప్రకటనలతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సిక్సర్ కొట్టారు' అని కిర్లోస్కర్ తెలిపారు. రాబోయే నెలల్లో ఎకానమీ మళ్లీ పుంజుకోగలదని సీఐఐ ఆశాభావం వ్యక్తం చేసింది. 'విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు, దేశీ ఇన్వెస్టర్ల ఆదాయాలపై పెంచిన సర్‌చార్జీలను ఎత్తివేయడం, రెపో రేట్ల తగ్గుదల ప్రయోజనాలను బదలాయించేటువంటి నిర్ణయాలు, సంస్థలకు రీఫండ్స్‌ను వేగవంతం చేయడం వంటి సమగ్రమైన చర్యలతో పెట్టుబడులకు తోడ్పాటు లభించగలదు' అని సీఐఐ ప్రెసిడెంట్-డెసిగ్నేట్ ఉదయ్ కొటక్ పేర్కొన్నారు.

## సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో ఎఫ్‌డీఐ నిబంధనల సడలింపు!



**న్యూఢిల్లీ:** స్థానిక సోర్సింగ్ నిబంధనల నుంచి సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగానికి కేంద్ర ప్రభుత్వం ఊరటనివ్వనుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) ప్రస్తుత నిబంధనల ప్రకారం.. ఈ తరహా వ్యాపారులు తప్పనిసరిగా 30 శాతం వస్తువులను ప్రాంతీయ వ్యాపారుల నుంచి మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ అంశంలో వీరికి ఊరట లభించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆన్‌లైన్ విక్రయాల్లోనూ నిబంధనలు సులభతరం కానున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం.. సింగిల్ బ్రాండ్ రిటైల్ ప్లేయర్లు ముందుగా స్టోర్లను ఏర్పాటుచేసి, ఆ తరువాత మాత్రమే ఆన్‌లైన్ అమ్మకాలను ప్రారంభించాలి. ఈ నిబంధనను ఎత్తివేసి.. ఫిజికల్ స్టోర్స్ కంటే ముందుగానే ఆన్‌లైన్ విక్రయాలు ప్రారంభించే వెసులుబాటును కల్పించే దిశగా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుంటోంది. ఈ రంగానికి ప్రయోజనం చేకూరే విధంగా పలు నిర్ణయాలను తీసుకోనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే.

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 26-8-2019

| | |
|---|---|
| విశాఖ | 361-00 |
| చిత్తూరు | 338-00 |
| వరంగల్ | 313-00 |
| విజయవాడ | 334-00 |
| నమక్కల్ | 340-00 |
| గోదావరి | 334-00 |
| చెన్నై | 345-00 |
| ముంబై | 365-00 |
| 25-8-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 313-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.75 |
| బెంగళూరు | 325-00 |
| ఢిల్లీ | 340-00 |
| కోల్‌కతా | 362-00 |

# మార్కెట్ ర్యాలీ..?

- ఎఫ్‌పీఐ సర్‌చార్జ్ ఉపసంహరణతో మార్కెట్‌కు జోష్..
- సోమవారం గ్యాప్ అప్ ఓపెనింగ్‌కు అవకాశం..
- క్యూ2 జీడీపీ గణాంకాలు శుక్రవారం వెల్లడి
- ఈ వారంలోనే ఆగస్టు సిరీస్ ఎఫ్ అండ్ ఓ ముగింపు
- అమెరికా-చైనా వాణిజ్య యుద్ధంపై ఇన్వెస్టర్ల దృష్టి



**ముంబై:** దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత వారాంతాన పలు కీలక నిర్ణయాలను ప్రకటించారు. శుక్రవారం మార్కెట్ ముగిసిన తరువాత.. భారత ఆర్థిక వ్యవస్థలో ఉత్సాహాన్ని నింపే పలు చర్యలను మంత్రి ప్రకటించారు. తాజా ప్రభుత్వ నిర్ణయాల వెల్లడి నేపథ్యంలో మార్కెట్‌కు జోష్ వచ్చే అవకాశం ఉందని దలాల్ స్ట్రీట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లపై బడ్జెట్‌లో ప్రతిపాదించిన సర్‌చార్జీని ప్రభుత్వం ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించడం సానుకూల అంశంగా ఉందని చెబుతున్నాయి. సర్‌చార్జ్ అంశం ఇటీవల దేశ స్టాక్ మార్కెట్లను తీవ్రంగా నష్టపరచగా.. ఈ కీలక అంశంపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్పష్టంచేయడంతో మళ్లీ ఎఫ్‌పీఐల పెట్టుబడి భారత క్యాపిటల్ మార్కెట్‌కు వచ్చి చేరే అవకాశం ఉందని కోటక్ సెక్యూరిటీస్ మార్కెట్ ఫండమెంటల్స్ రీసెర్చ్ హెడ్ రస్మిక్ ఓజా విశ్లేషించారు. డాలరుతో రూపాయి మారక విలువ బలపడేందుకు కూడా ప్రభుత్వ తాజా నిర్ణయం దోహదపడనుందని అభిప్రాయపడ్డారు. 'ఎఫ్‌పీఐల అమ్మకాల ప్రవాహం ఆగిపోయి.. కొనుగోళ్లు జరిగేందుకు అవకాశం ఉంది. ఇక్కడ నుంచి మార్కెట్ పెరిగేందుకు ఆస్కారం ఉందని భావిస్తున్నాం. అయితే, ఈ ర్యాలీ కొనసాగాలంటే.. కంపెనీల ఆదాయ వృద్ధి పుంజుకుని, ఆర్థిక వ్యవస్థలో మందగమనం తొలగిపోవాలి' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయ్ కుమార్ అన్నారు. భారత జీడీపీలో వృద్ధి వేగంగా కొనసాగుతుందని ఆర్థిక మంత్రి భరోసా, ఎఫ్‌పీఐ సర్‌చార్జ్ ఉపసంహరణ వంటి కీలక అంశాల నేపథ్యంలో సోమవారం మార్కెట్ గ్యాప్ అప్ ఓపెనింగ్‌కు చాన్స్ ఉందని ట్రేడింగ్ బెల్స్ కో-ఫౌండర్, సీఈఓ అమిత్ గుప్తా చెప్పారు.

**పీఎస్‌యూ బ్యాంక్ షేర్లకు మద్దతు..!**

ఆర్థిక వ్యవస్థలో రుణ మంజూరీని పెంచేందుకు ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.70,000 కోట్లను మూలధన సాయంగా అందించనున్నట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. మరోవైపు హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు (హెచ్‌ఎఫ్‌సీలు)కు అదనంగా రూ.20,000 కోట్ల నిధులను ఎన్‌హెచ్‌బీ ద్వారా అందించనున్నట్లు చెప్పారు. ఈ తాజా అంశాల నేపథ్యంలో పీఎస్‌యూ బ్యాంకుల షేర్లకు కొనుగోలు మద్దతు లభించే అవకాశం ఉందని ఎలారా క్యాపిటల్ విశ్లేషకులు గరిమా కపూర్ అన్నారు. ఇక ఆటో రంగానికి ఊతమిస్తూ.. ప్రభుత్వ శాఖలు, విభాగాలు పాత వాహనాల స్థానంలో కొత్త వాహనాల కొనుగోలుపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడం, వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ ఫీజు సవరణను 2020 జూన్ వరకు వాయిదా వేయడం వంటి పలు ప్రోత్సాహక నిర్ణయాలను ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ అంశానికి తోడుగా.. వస్తు, సేవల పన్ను ఊరట లభిస్తే ఆటో రంగ షేర్లలో పతనం ఆగుతుందనేది దలాల్ స్ట్రీట్ వర్గాల అంచనా. ఇక ఈ ఏడాది రెండో త్రైమాసిక (జూలై-సెప్టెంబర్) జీడీపీ అంచనాల గణాంకాలను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించనుంది.

### అంతర్జాతీయ అంశాల ప్రభావం..



అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదురుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలకు ధీటుగా చైనా సవాలు విసురుతోంది. ఇటీవల చైనా దిగుమతులపై 10 శాతం సుంకం విధించాలని అమెరికా తీసుకున్న నిర్ణయానికి ప్రతీకారంగా.. మొత్తం 75 బిలియన్ డాలర్ల విలువగల యూఎస్ వస్తువులపై అదనంగా 10 శాతం టారిఫ్‌లను అమలు చేయనున్నట్టు చైనా శుక్రవారం ప్రకటించింది. దీంతో ట్రంప్ అదేరోజున మరోసారి తీవ్రంగా స్పందించారు. చైనా దిగుమతులపై అదనపు సుంకాలను విధించడంతో పాటు ఆదేశం నుంచి అమెరికన్ కంపెనీలు బయటకు వచ్చేయాలని కోరారు. దీంతో అమెరికా స్టాక్ మార్కెట్లు ఆరోజున భారీ నష్టాలను చవిచూశాయి. నాస్‌డాక్ ఏకంగా 3 శాతం నష్టపోయింది. ఈ ప్రభావం మార్కెట్‌పై ఉండేందుకు ఆస్కారం ఉండనుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

### ఆగస్టులో రూ.3,014 కోట్లు ఉపసంహరణ...



విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఆగస్టు 1-23 కాలానికి ఈక్విటీ మార్కెట్ నుంచి రూ.12,105 కోట్లను ఉపసంహరించుకున్నట్లు డిపాజిటరీల డేటా ద్వారా వెల్లడయింది. అయితే, డెట్ మార్కెట్‌లో రూ.9,091 కోట్లను పెట్టుబడి పెట్టారు. దీంతో క్యాపిటల్ మార్కెట్లో వీరి నికర పెట్టుబడి ఉపసంహరణ ఈనెల్లో ఇప్పటివరకు రూ.3,014 కోట్లకు పరిమితమైంది. ఎఫ్‌పీఐలపై కేంద్ర ప్రభుత్వం సర్‌చార్జ్ ఉపసంహరణతో వీరి పెట్టుబడులు మళ్లీ పెరిగేందుకు ఆస్కారం ఉందని భావిస్తున్నట్లు ఐసీఐసీఐ సెక్యూరిటీ ఎండీ, సీఈఓ విజయ్ చందోక్ అన్నారు. ఆర్థిక మంత్రి ఇచ్చిన భరోసాతో పరిస్థితులు మెరుగుపడే అవకాశం ఉందని వి.కే విజయ్‌కుమార్ విశ్లేషించారు.

## నేటి నుంచే టోరా క్యాబ్స్ సేవలు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** క్యాబ్ అగ్రిగేటర్ టోరా క్యాబ్స్ తన సేవలను నేటి (సోమవారం) నుంచి హైదరాబాద్‌లో ప్రారంభిస్తోంది. 10,000లకు పైగా కార్లతో రంగంలోకి దిగుతున్నట్టు టోరా క్యాబ్స్ టెక్నాలజీ సర్వీసెస్ సీఈవో శ్రీనివాస్ కృష్ణ వెల్లడించారు. మార్కెటింగ్ డైరెక్టర్ కవిత భాస్కరన్‌తో కలిసి ఆదివారమిక్కడ టోరా యాప్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. 'కిలోమీటరుకు రూ.10 చార్జీ ఉంటుంది. ప్రస్తుతం సేవలందిస్తున్న క్యాబ్ అగ్రిగేటర్లు డిమాండ్‌నుబట్టి సర్జ్ పేరుతో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నాయి. జీరో సర్జ్‌తో కస్టమర్లకు చేరువ అవుతాం. డ్రైవర్ల నుంచి ఎటువంటి కమీషన్ వసూలు చేయబోము. డ్రైవర్లు రోజుకు రూ.199 చందా చెల్లిస్తే చాలు. దశలవారీగా ఇతర నగరాలకు కూడా సర్వీసులను విస్తరిస్తాం' అని వివరించారు. వాహనం రకాన్నిబట్టి కిలోమీటరుకు రూ.20 వరకు చార్జీ ఉంటుంది. ట్రావెల్ టైమ్ చార్జీ కిలోమీటరుకు రూ.1.52 అదనం. రూ.45 బేస్ ఫేర్‌పై 3 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు.



కవిత భాస్కరన్, శ్రీనివాస్ కృష్ణ

## గోల్డ్ ఈటీఎఫ్‌లు రయ్‌రయ్...

- నిర్వహణ ఆస్తులు జూమ్
- రూ.5,000 కోట్లను దాటిన ఏయూఎం

**న్యూఢిల్లీ:** గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) నిర్వహణలోని ఆస్తులు అమాంతం పెరిగిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.5,000 కోట్ల మార్కును దాటాయి. జూలైలో ఏయూఎం రూ.5,079.22 కోట్లుగా నమోదైనట్లు మార్నింగ్‌స్టార్ తాజా డేటాలో వెల్లడైంది. ఈ ఏడాదిలో.. ఆగస్టులో రూ. 4,594 కోట్లు, మేలో రూ. 4,607 కోట్లు, జూన్‌లో రూ. 4,931 కోట్లు ఏయూఎం నమోదైంది. స్టాక్ మార్కెట్లు భారీగా పతనం అవుతున్న కారణంగా ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారం, గోల్డ్ ఈటీఎఫ్‌ల వైపు తమ పెట్టుబడులను మళ్లిస్తున్న నేపథ్యంలో గడిచిన నాలుగు నెలలుగా గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణ ఆస్తుల్లో పెరుగుదల నమోదవుతూ వస్తోందని మార్నింగ్‌స్టార్ సీనియర్ విశ్లేషకులు హిమాన్షు శ్రీవాస్తవ విశ్లేషించారు. ఆర్థిక మందగమన భయాలు, వాణిజ్య యుద్ధ ఆందోళన, బాండ్ ఈల్డ్ పడిపోవడం వంటి ప్రతికూల వాతావరణంలో బంగారానికి డిమాండ్ ఊపందుకుందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ హెడ్ వీకే శర్మ అన్నారు.



## బ్యాంకు మోసాలపై సీవీసీ కమిటీ

**న్యూఢిల్లీ:** బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టే మోసం ఉదంతాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) వీటిపై దృష్టి సారించింది. రూ. 50 కోట్ల పైబడిన బ్యాంకు మోసాలను పరిశీలించి, తగు చర్యలు సిఫార్సు చేసేందుకు బ్యాంకింగ్ ఫ్రాడ్స్‌పై అడ్వైజరీ బోర్డు (ఏబీబీఎఫ్) ఏర్పాటు చేసింది. మాజీ విజిలెన్స్ కమిషనర్ టీఎం భాసిన్ దీనికి సారథ్యం వహిస్తారు. గతంలో దీన్ని అడ్వైజరీ బోర్డ్ ఆన్ బ్యాంక్, కమర్షియల్ అండ్ ఫైనాన్షియల్ ఫ్రాడ్స్‌గా వ్యవహరించేవారు. సీవీసీ ఉత్తర్వుల ప్రకారం రూ. 50 కోట్ల పైబడిన ఫ్రాడ్ కేసులను బ్యాంకులు ఈ బోర్డుకు నివేదిస్తాయి. బోర్డు సిఫార్సుల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)కు సంబంధించిన కేసుల్లో సాంకేతికంగానైనా, ఇతరత్రానైనా ఏవైనా సమస్యలు ఎదురైన పక్షంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కూడా బోర్డును సంప్రతించవచ్చు. ఈ ప్యానెల్‌లో నలుగురు సభ్యులు ఉంటారు. పట్టణాభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి మధుసూదన్ ప్రసాద్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ మాజీ డైరెక్టర్ జనరల్ డీకే పాఠక్, ఆంధ్రా బ్యాంక్ మాజీ ఎండీ, సీఈవో సురేష్ ఎన్ పటేల్ ఇందులో సభ్యులుగా ఉంటారు. బోర్డు చైర్మన్, సభ్యుల పదవీకాలం 2019 ఆగస్టు 21 నుంచి రెండేళ్ల పాటు ఉంటుంది.




## థాపర్‌ను తొలగించాలి

**సీజీ పవర్ రుణదాతలు, ఇన్వెస్టర్ల అభిప్రాయం**



**న్యూఢిల్లీ:** భారీ కుంభకోణం బైటపడిన నేపథ్యంలో సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ చైర్మన్ హోదా నుంచి గౌతమ్ థాపర్‌ను తప్పించాలని సంస్థకు రుణాలిచ్చిన సంస్థలు, ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. సంస్థ ఆస్తులను తనఖా పెట్టి రుణాలు పొందిన కొందరు సిబ్బంది, ఆ నిధులను దారి మళ్లించిన తీరు ఇటీవల విచారణలో బైటపడిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో గవర్నెన్స్‌పరమైన లోపాలను బోర్డు గుర్తించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సీజీ పవర్ వెల్లడించింది. మోసానికి పాల్పడిన వారిలో కొందరు ప్రస్తుత, పాత ఉద్యోగులు ఉన్నారని గుర్తించినట్లు తెలిపింది. వీరిలో కొందరు నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కూడా ఉన్నారు. నిధులను దారి మళ్లించడంతో పాటు కొన్ని రుణాల (తీసుకున్నవి, ఇచ్చినవి) పరిమాణం కూడా ఖాతాల్లో తగ్గించి చూపడం జరిగినట్లు సీజీ పవర్ పేర్కొంది. సంబంధిత పార్టీల రుణాలు రూ. 1,990 కోట్ల మేర, ఇతర పార్టీల రుణాలు రూ. 2,806 కోట్ల మేర తగ్గించి చూపించి ఉండవచ్చని (2018 మార్చి 31 నాటికి) విచారణలో అంచనాలు ఉన్నాయని వివరించింది.

**థాపర్ వాటా 8 వేల షేర్లే..**


అనుమానాస్పద లావాదేవీలపై విచారణ సందర్భంగా మే 10న సీఈవో కేఎన్ నీలకంఠ్‌ను సెలవుపై పంపినప్పటికీ, చైర్మన్‌గా థాపర్ కొనసాగుతూనే ఉన్నారు. విచారణ కోసం పట్టుబట్టిన ఇన్వెస్టర్లే.. తాజాగా కంపెనీ వ్యవహారాల ప్రక్షాళన కోసం థాపర్, నీలకంఠ్‌ను వారి హోదాల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కంపెనీకి పటిష్టమైన ఆర్డర్ బుక్ ఉన్నప్పటికీ, భారీ రుణభారం పేరుకుపోయి ఉంటుందని ఇన్వెస్టర్లు, రుణదాతలు భావిస్తున్నట్లు వివరించాయి. చైర్మన్‌ను తొలగించేందుకు, మరికొన్ని వారాల్లో స్వతంత్ర డైరెక్టర్లలో ఒకరిని ఆ హోదాలో నియమించేందుకు కంపెనీ బోర్డుకు అధికారాలు ఉన్నాయని పేర్కొన్నాయి. సీజీ పవర్ మొత్తం 62.6 కోట్ల షేర్లలో థాపర్‌కి ప్రస్తుతం 8,574 షేర్లు మాత్రమే ఉన్నాయి. ఈ షేర్‌హోల్డింగ్‌తో ఆయనకు బోర్డు హోదా కూడా ఉండదు. కానీ షేర్‌హోల్డర్లకు మాత్రమే బోర్డు సభ్యులను తొలగించే అధికారం ఉన్నందున.. ఆయన బోర్డులో కొనసాగే అవకాశం ఉంది. సీజీ పవర్ వ్యవస్థాపక ప్రమోటర్ అయినప్పటికీ గతంలో రుణాల సమీకరణ కోసం ఆయన తనఖా ఉంచిన షేర్లను.. బాకీల వసూలు కోసం బ్యాంకులు విక్రయిస్తూ పోవడంతో థాపర్ వాటా తగ్గిపోయింది.

## సెన్సెక్స్ 37,050 స్థాయిని అధిగమిస్తే...

**మార్కెట్ పంచాంగం**


శుక్రవారం మన మార్కెట్ ముగిసిన తర్వాత దేశీయంగా ఇన్వెస్టర్లు ఆశిస్తున్న సానుకూల ప్రకటన ఆర్థిక మంత్రి నుంచి వెలువడగా, అంతర్జాతీయంగా అమెరికా-చైనాల మధ్య ట్రేడ్‌వార్ మహోద్ధృతరూపం దాల్చింది. బడ్జెట్లో ప్రతిపాదించిన ఆదాయపు పన్ను సర్‌ఛార్జ్ ఉపసంహరణ, వ్యవస్థలో లిక్విడిటీ పెంపు, రుణాల్ని చౌకగా లభింపచేయడం, ఆటోమొబైల్ రంగానికి రాయితీలు వంటి చర్యలన్నీ ఇన్వెస్టర్లకు రుచించేవే. అయితే అమెరికా ఉత్పత్తులపై చైనా టారిఫ్‌లు వేయడం, వెనువెంటనే చైనా నుంచి అమెరికా కంపెనీల్ని వెనక్కురమ్మంటూ ట్రంప్ పిలుపునివ్వడం, చైనా ఉత్పత్తులపై టారిఫ్‌ల్ని పెంచడం వంటి ఆయుధాల్ని వాణిజ్యయుద్ధంలో భాగంగా శుక్రవారం రాత్రే ఇరు దేశాలు ప్రయోగించాయి. ఈ పరిణామం ఇన్వెస్టర్లను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసేదే. ఒక వైపు పెద్ద సానుకూలాంశం, మరోవైపు అనూహ్య ప్రతికూలాంశం....ఈ డైలమాను భారత్ మార్కెట్ ఎలా స్వీకరిస్తుందో అంచనావేయడం కష్టసాధ్యం. ఇక సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే...

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




ఆగస్టు 23తో ముగిసినవారంలో తొలిరోజున 37,119 పాయింట్ల గరిష్టస్థాయివరకూ పెరిగిన బీఎస్ఈ సెన్సెక్స్ చివరి రోజున 36,102 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి కొంతవరకూ కోలుకుని, చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే 649 పాయింట్ల నష్టంతో 36,701 పాయింట్ల వద్ద ముగిసింది. గతవారం చివరిరోజున మార్కెట్ ముగిసిన తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ప్యాకేజి కారణంగా ఈ సోమవారం సెన్సెక్స్ గ్యాప్‌అప్‌తో మొదలైతే 37,050 పాయింట్ల వద్ద తొలి నిరోధం కలగవచ్చు. ఈ స్థాయిపైనే సెన్సెక్స్ మొదలై, స్థిరపడితే 37,400 పాయింట్ల వద్దకు పెరగవచ్చు. అటుపైన 37,720 పాయింట్ల వరకూ రిలీఫ్‌ర్యాలీ కొనసాగే అవకాశాలుంటాయి. అంతర్జాతీయ పరిణామాల కారణంగా సెన్సెక్స్ తొలినిరోధంపైన స్థిరపడలేకపోతే 36,390 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయిని కోల్పోతే 36,100 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఈ లోపున 35,700 పాయింట్ల వరకూ పతనమయ్యే ప్రమాదం వుంటుంది.


**నిఫ్టీ తొలి నిరోధం 10,910**




క్రితం వారం ఎన్ఎస్ఈ నిఫ్టీ 11,147 పాయింట్ల గరిష్టస్థాయి నుంచి వేగంగా 10,637 పాయింట్ల వద్దకు వేగంగా పతనమయ్యింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 219 పాయింట్ల నష్టంతో 10,829 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం నిఫ్టీ గ్యాప్‌అప్‌తో మొదలైతే 10,910 పాయింట్ల స్థాయి తొలుత నిరోధించవచ్చు. ఈ స్థాయిపైనే ప్రారంభమై, స్థిరపడితే 11,035 పాయింట్ల స్థాయిని అందుకోవచ్చు. అటుపైన 11,145 పాయింట్ల వరకూ ర్యాలీ కొనసాగే అవకాశం వుంటుంది. తొలి నిరోధంపైన నిఫ్టీ స్థిరపడలేకపోతే 10,720 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును ముగింపులో కోల్పోతే 10,630 పాయింట్ల వరకూ క్షీణించవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే 10,500 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు.

– పి. సత్యప్రసాద్

# రిటైర్మెంట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చా?




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**ప్ర: నా వయస్సు 25 సంవత్సరాలు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఇటీవలనే ఉద్యోగంలో చేరాను. 10 నుంచి 15 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఇన్వెస్ట్‌మెంట్స్ కోసం ఇండెక్స్ ఫండ్‌ను ఎంచుకోవాలా ? లేక మిడ్ క్యాప్ ఫండ్‌ను ఎంచుకోవాలా ?**

–శివాజీ, హైదరాబాద్

మీరు ఇన్వెస్ట్ చేయడానికి ఈ రెండింటిలో దేనినీ ఎంచుకోవద్దు. మీరు 10-15 ఏళ్లపాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారు. కాబట్టి మల్టీ-క్యాప్ ఫండ్‌ను ఎంచుకోవాలి. మార్కెట్ బాగా లేని పరిస్థితుల్లో మిడ్ క్యాప్ ఫండ్‌ల పనితీరు అధ్వానంగా ఉంటుంది. ఇక ఇండెక్స్ ఫండ్స్ విషయానికొస్తే, ఇప్పుడిప్పుడే ఈ ఫండ్స్ ప్రాచుర్యం పొందుతున్నాయి. అయితే ఎంచుకోవడానికి పరిమిత అవకాశాలు మాత్రమే ఉన్నాయి. మల్టీ-క్యాప్ ఇండెక్స్ ఫండ్ ఉన్నా దాంట్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. కానీ మన దగ్గర ఇండెక్స్ ఫండ్స్ అన్నీ లార్జ్ క్యాప్ ఫండ్సేనని చెప్పవచ్చు. ఇండెక్స్ ఫండ్‌లోని కొన్ని షేర్లు మంచి పనితీరు చూపించడంతో ఇండెక్స్ ఫండ్స్ చెప్పుకోదగ్గ రాబడులనిచ్చాయి. అయితే భారత్‌లో ఇండెక్స్ ఫండ్స్ ఇంకా పుంజుకోలేదని నా భావన. ఇవి మరింత పటిష్టం కావడానికి మరి కొంత కాలం పడుతుంది. ఇక మల్టీ-క్యాప్ ఫండ్స్ విషయానికొస్తే, పూర్తి మార్కెట్ సైకిల్‌లో మల్టీ-క్యాప్ ఫండ్స్ మంచి పనితీరు చూపిస్తాయి. అందుకని మీరు ఇన్వెస్ట్‌మెంట్స్ కోసం ఇండెక్స్, మిడ్ క్యాప్ ఫండ్స్‌ను కాకుండా మల్టీ-క్యాప్ ఫండ్‌ను ఎంచుకోండి. ఈ ఫండ్‌లో 10-15 ఏళ్లపాటు ఇన్వెస్ట్ చేయండి. ఈ లోపున కనీసం రెండేళ్లకొకసారి ఫండ్ పనితీరు సమీక్షించండి. మీరు ఇన్వెస్ట్ చేస్తున్న మల్టీ-క్యాప్ ఫండ్ పనితీరు సరిగ్గా లేకపోయినా, ఇండెక్స్ ఫండ్స్ పనితీరు బాగా ఉన్నా, మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను ఈ మల్టీ-క్యాప్ ఫండ్ నుంచి ఇండెక్స్ ఫండ్‌లోకి మార్చుకోవచ్చు.

**నా వయస్సు 27 సంవత్సరాలు. రిటైర్మెంట్‌కే ప్రత్యేకించి ఉన్న కొన్ని మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయమంటూ మిత్రులు చెబుతున్నారు. నా రిటైర్మెంట్ అవసరాల కోసం ఇలాంటి ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. నాది సరైన నిర్ణయమేనా?**

–కరుణాకర్, విజయవాడ

మీ నిర్ణయం సరైనది కాదు. మీరు క్రమశిక్షణగా ఇన్వెస్ట్ చేసి, మీరు రిటైరయ్యేదాకా, వాడుకోవడానికి వీల్లేనిదే రిటైర్మెంట్ ఇన్వెస్ట్‌మెంట్. ప్రి-ప్యాకేజ్‌డ్ రిటైర్మెంట్ ప్లాన్లన్నీ పెట్టుబడులకు సంబంధించి అడ్డదిడ్డమైన నిబంధనలతో కూడుకొని ఉంటాయి. పూర్తిగా రిటైర్మెంట్ ప్లాన్‌గా పరిగణించే ఎన్‌పీఎస్(నేషనల్ పెన్షన్ సిస్టమ్) కూడా దీనికి మినహాయింపు కాదు. ఎన్‌పీఎస్‌లో ఒక వ్యక్తి గరిష్టంగా తన ఇన్వెస్ట్‌మెంట్స్‌లో 75 శాతం వరకే ఈక్విటీలో ఇన్వెస్ట్ చేయడానికి అవకాశం ఉంది. 25-28 సంవత్సరాల వయస్సున్న వ్యక్తికి ఇది సరైన ఎంపిక కాదు అని నా భావన. మీలాంటి యువజనులు రిస్క్ పూర్తిగా భరించి ఈక్విటీలోనే ఇన్వెస్ట్ చేస్తే మంచిది. ఆదాయపు పన్ను చట్టం, సెక్షన్-80 సీ కింద ఒక్క ఆర్థిక సంవత్సరంలో లభించే పన్ను మినహాయింపు మొత్తం రూ.1.5 లక్షలను ఏదైనా ట్యాక్స్-సేవింగ్ ఫండ్‌లో ప్రతి ఏడాది ఇన్వెస్ట్ చేయండి. ఇదే మీ రిటైర్మెంట్ ప్లాన్‌గా ఎంచుకోండి. లేదా ఏదైనా ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్(ఈఎల్ఎస్ఎస్)లో 30 ఏళ్లపాటు ఇన్వెస్ట్ చేసే మార్గాన్నీ పరిశీలించవచ్చు. ఈ రెండు మార్గాల్లో దేనిని ఎంచుకున్నా, రిటైర్మెంట్ ఫండ్స్ ఇచ్చే రాబడుల కన్నా అధికమైన రాబడులనే మీరు పొందగలరు.

**ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌కు, ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మధ్య తేడా ఏమిటి? ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌పై ఎక్కువ రాబడులు వస్తాయా? ప్రస్తుత పరిస్థితుల్లో ఏ కేటగిరీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే మంచి రాబడులు పొందవచ్చు.?**

–స్వప్న, విశాఖపట్టణం

ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ తమ మొత్తం నిధుల్లో మూడింట ఒక వంతు ఈక్విటీలోనూ, మరో మూడింట ఒక వంతు ఆర్బిట్రేజ్ సాధనాల్లోనూ, మరో మూడింట ఒక వంతు స్థిరాదాయ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. ఈ ఈక్విటీ ఫండ్స్‌ను ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోల్చడానికి లేదు. ఫిక్స్‌డ్ డిపాజిట్లలో అయితే అసలుకు, వడ్డీకి గ్యారంటీ ఉంటుంది. కాలపరిమితి తీరిన తర్వాత ఎంత రాబడులు వస్తాయో ఒక అంచనా ఉంటుంది. ఒక పరిమితి దాటిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల రాబడులపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ రాబడులు స్టాక్ మార్కెట్ పనితీరును బట్టి ఉంటాయి. ఇక ఏ కేటగిరి ఫండ్ ఎలాంటి రాబడులు ఇస్తుందో తెల్సుకోవడానికి పోల్చి చూడడమే సరైన విధానం. ఒక ఏడాది, రెండేళ్లు, మూడేళ్లు... ఇలా కాలపరిమితిని నిర్దేశించుకొని ఆ యా కాలపరిమితుల్లో ఏ యే కేటగిరి ఫండ్ ఎంతెంత రాబడులు ఇచ్చిందో మదింపు చేయాలి. ఇక మీరు ఏడాది కాలం పాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటే, ఆల్ట్రా-షార్ట్ డ్యురేషన్ ఫండ్‌ను ఎంచుకోండి. కనీసం ఐదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటే, ట్యాక్స్ సేవింగ్స్ ఫండ్‌ను కానీ, మల్టీ-క్యాప్ ఫండ్‌ను గానీ ఎంచుకోండి. మార్కెట్ ఒడిదుడుకులున్నప్పటికీ, అధైర్యపడకుండా పదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటే, ఒక మల్టీక్యాప్, స్మాల్-క్యాప్ ఫండ్‌ను ఎంచుకోండి. మార్కెట్ పతన సమయంలో స్మాల్ క్యాప్ ఫండ్స్ నష్టాలను చూపించినా, పదేళ్ల కాలంలో మంచి రాబడులను ఇస్తాయి.

## క్లుప్తంగా...

### నల్సార్‌లో ఏవియేషన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**సాక్షి, హైదరాబాద్:** నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ లాస్‌లో 2019–20 విద్యా సంవత్సరానికిగాను పలు ఏవియేషన్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ రిజిస్ట్రార్ బాలకిష్టారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాలపరిమితి ఉన్న ఎంఏ (ఏవియేషన్ లా అండ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్), సెక్యూరిటీ అండ్ డిఫెన్స్ లాస్‌తోపాటు ఏడాది కాలవ్యవధి ఉన్న అడ్వాన్స్‌డ్ మారిటైమ్ లాస్ పీజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 చివరి తేదీ అని తెలిపారు. బ్యాచిలర్ డిగ్రీ అర్హత ఉన్న వారు ఈ కోర్సులకు అర్హులని, ఫీజు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుందని వెల్లడించారు.

### నేటి నుంచి పీఈసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ), బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించిన టీఎస్ పీఈసెట్‌లో అర్హులైన విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి వెల్లడించింది. హైదరాబాద్‌లోని నిజాం కాలేజ్, వరంగల్ కాకతీయ యూనివర్సిటీ పీజీ అడ్మిషన్ల డైరెక్టర్ కార్యాలయాల్లో ఈ వెరిఫికేషన్ ఉంటుందని మండలి వర్గాలు ఆదివారం తెలిపాయి.

### హెల్త్ వర్సిటీ వీసీని తొలగించాలి

**14 బీసీ సంఘాల డిమాండ్**

**హైదరాబాద్:** కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కరుణాకర్‌రెడ్డిని తొలగించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని 14 బీసీ సంఘాలు హెచ్చరించాయి. ఆదివారం ఇక్కడ విద్యానగర్ బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో 14 బీసీ సంఘాలు వీసీని తొలగించాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశాయి. బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయలేదని, ఫలితంగా 262 మందికి సీట్లు రాకుండా పోయాయని అన్నారు. వీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకిగా మారారని, అన్యాయాన్ని సరిదిద్ద కుండా హైకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని మండిపడ్డారు. మెడికల్ అడ్మిషన్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్య క్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, నర్సింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుమలలో దళారుల అరెస్ట్

**తిరుమల:** శ్రీవారి దర్శనం కల్పించేందుకు భక్తుల వద్ద అధిక మొత్తంలో డబ్బులు తీసుకుంటున్న దళారులను తిరుమల వన్‌టౌన్ పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేశారు. తిరుమలలో నివాసముంటున్న వెంకటరమణ, శ్రీనివాసులు, శశికుమార్, ప్రేమ్ కుమార్‌లు కొంతకాలంగా దళారుల అవతారమెత్తి భక్తుల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. శనివారం పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా 3 సిఫారసు లేఖలపై 18 మందిని దర్శనానికి పంపి ఒక్కొక్కరి నుంచి రూ.5,500 వసూలు చేసిన మరో దళారిని టీటీడీ విజిలెన్స్ అధికారులు ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.



బ్రిటన్‌కు చెందిన రాయల్ ఎయిర్‌ఫోర్స్ ఏరోబాటిక్ టీం విన్యాసం ఇదీ.. దీన్ని సిగ్నెట్ లూప్ అంటారట. చేయడమే కష్టమనుకుంటే.. దాన్ని లిప్తపాటులో కెమెరా కన్నులో బంధించడం ఇంకెంత కష్టమో ఆలోచించండి.. అందుకే ఎయిర్‌ఫోర్స్ ఫొటోగ్రాఫర్ల కోసం ఏటా రాయల్ ఎయిర్‌ఫోర్స్ ఫొటోగ్రఫీ పోటీని నిర్వహిస్తారు. మొత్తం 13 విభాగాల్లో విజేతలను ఎంపిక చేస్తారు. మొత్తం వెయ్యి ఎంట్రీలు రాగా.. తుది జాబితాను తాజాగా విడుదల చేశారు. ఆ జాబితాలో చోటు దక్కించుకున్న చిత్రాల్లో ఇది కూడా ఒకటి.

# వరిలో వృద్ధి... తగ్గిన పప్పు ఉత్పత్తి

- దేశవ్యాప్తంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి 28.49 కోట్ల టన్నులు
- 2018–19 ఖరీఫ్, రబీ వివరాలను వెల్లడించిన కేంద్రం
- అందులో బియ్యం ఉత్పత్తి 11.64 కోట్ల టన్నులు... పప్పుధాన్యాల దిగుబడి 2.34 కోట్ల టన్నులు



**సాక్షి, హైదరాబాద్:** దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. 2018–19 ఖరీఫ్, రబీ సీజన్ల ఉత్పత్తి నాలుగో ముందస్తు అంచనాల నివేదికను కేంద్ర వ్యవసాయశాఖ ఆదివారం విడుదల చేసింది. ఈ ప్రకారం 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 27.74 కోట్ల టన్నులు కాగా, 2018–19 ఆర్థిక సంవత్సరం సీజన్‌లో ఏకంగా 28.49 కోట్ల టన్నులకు పెరిగింది. అంటే అంతకుముందు ఏడాది కంటే అధికంగా ఉత్పత్తి కావడం గమనార్హం. అందులో కీలకమైన వరి 2017–18 ఖరీఫ్, రబీ సీజన్లలో 11.10 కోట్ల టన్నులు కాగా, ఈసారి 11.64 కోట్ల టన్నులకు చేరింది. అంటే అదనంగా 54 లక్షల టన్నులు పెరిగింది. ఇక కీలకమైన పత్తి దిగుబడి పడిపోయింది. 2017–18లో 3.39 కోట్ల బేల్స్ ఉత్పత్తి కాగా, 2018–19లో కేవలం 2.87 కోట్ల బేళ్లకు పడిపోయింది. ఏకంగా 52 లక్షల బేళ్ల ఉత్పత్తి తగ్గిందన్నమాట. ఇక పప్పు ధాన్యాల ఉత్పత్తి కూడా కాస్త మందగించింది. 2017–18లో 2.39 కోట్ల టన్నులు ఉత్పత్తి కాగా, 2018–19లో 2.34 కోట్ల టన్నులకు పడిపోయింది. అంటే 5 లక్షల టన్నులు తగ్గింది. ఇక నూనె గింజల ఉత్పత్తి 2.98 కోట్ల టన్నుల నుంచి 3.22 కోట్ల టన్నులకు పెరగడం గమనార్హం. మొక్కజొన్న 2.72 కోట్ల టన్నులు, సోయాబీన్ 1.37 కోట్ల టన్నులు, వేరుశనగ 66 లక్షల టన్నులకు పెరిగింది. చెరుకు రికార్డు స్థాయిలో 40.01 కోట్ల టన్నులు ఉత్పత్తి కావడం విశేషం. ఇదిలా వుంటే తెలంగాణ రాష్ట్రంలో మూడో ముందస్తు అంచనాల నివేదిక ప్రకారం 2018–19 సీజన్‌లో ఖరీఫ్, రబీ కలిపి ఆహార ధాన్యాల ఉత్పత్తి 91.93 లక్షల టన్నులుగా ఉంది. అంతకుముందు రెండేళ్లతో పోలిస్తే 2018–19 సీజన్లలో ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. 2016–17లో 1.01 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు పండగా, 2017–18 సీజన్‌లో 96.20 లక్షలకు పడిపోయింది. ఈసారి ఇంకాస్త పడిపోవడం గమనార్హం. 2014–15లో తెలంగాణలో ఆహార ధాన్యాల ఉత్పత్తి కేవలం 72.18 లక్షల టన్నులు మాత్రమే. ఆ తర్వాత 2015–16లో ఇంకా తగ్గి 51.45 లక్షల టన్నులకు పడిపోయింది. అయితే అప్పటినుంచి పెరుగుతూనే వస్తుంది. వర్షాలు, సీజన్లను బట్టి ఉత్పత్తి వత్యాసాలు ఉన్నా, పరిస్థితి మెరుగ్గానే ఉందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.

# బీజేపీ, ఆరెస్సెస్‌కు అడ్డుకట్ట వేద్దాం!

- కేడర్‌ను మిలిటరీగా మార్చేందుకు సంఘ్ ప్రయత్నం
- లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తులు ఏకమవ్వాల్సిన తరుణమిదే
- దళితులు, మైనారిటీలపై మూకదాడులు ఆందోళనకరం
- కాంగ్రెస్ కూడా తన విధానాలు మార్చుకోవాలి
- 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా



**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుతం దేశానికి బీజేపీ, ఆరెస్సెస్‌ల నుంచి తీవ్రమైన సవాళ్లు ఎదురవుతున్నాయని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. బీజేపీ పాలనలో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలపై మూకదాడులు, హత్యలు వంటివి నిత్యకృత్యంగా మారడం ఆందోళనకరమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆరెస్సెస్ ముందుండి ప్రభుత్వాన్ని నడిపించడంతోపాటు.. క్షేత్రస్థాయి కేడర్‌ను 'మిలిటరైజేషన్' చేసే దిశగా చర్యలు చేపడుతోందని ఆయన ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ, ఆరెస్సెస్‌లపై పోరుకు విస్తృత స్థాయిలో అన్ని లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాక ఆదివారం తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా డి.రాజాతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు

**దేశప్రయోజనాల దృష్ట్యానైనా..**

లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే నేతృత్వంలో కాంగ్రెస్, వామపక్ష, ఇతర ప్రజాస్వామ్య పార్టీలన్నీ ఐక్యతతో పోటీచేసి సత్ఫలితాలు సాధించాయి. యూపీ, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో విపక్షాల మధ్య ఐక్యత సాధ్యం కాకపోవడంతో బీజేపీ, భాగస్వామ్యపక్షాలు లాభపడ్డాయి. దీనినుంచి అన్ని లౌకిక, ప్రజాతంత్రశక్తులు పాఠం నేర్చుకోవాల్సి ఉంది. బీజేపీ, ఆరెస్సెస్‌లకు వ్యతిరేకంగా ఎన్నికలకు ముందే అన్నిపార్టీలు ఒకే వేదికపైకి రావాలని సీపీఐ కోరినా అది సాధ్యపడలేదు. దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలు, ప్రజల అవసరాలను దృష్టిలోపెట్టుకుని దూరదృష్టితో ఆలోచించాల్సిన అవసరముంది. అన్ని సెక్యులర్, ప్రజాస్వామ్య పార్టీలన్నీ కూడా వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలి. సీట్ల సర్దుబాటు తదితర అంశాల్లోనూ ఇదే వైఖరితో ముందుకు సాగితే సమస్యలుండవు. బీజేపీ, ఆరెస్సెస్ ఓటమి ప్రధానలక్ష్యంగా విపక్షాలు సర్దుబాటు ధోరణితో పనిచేయాలి. ఈ నేపథ్యంలో జాతీయస్థాయిలో వామపక్షాలు నిర్వహించే పాత్ర కీలకంగా మారింది.

**కాంగ్రెస్ విధానాలు మారాలి**

దేశవ్యాప్తంగా ఉనికి ఉన్నపార్టీగా కాంగ్రెస్ ఎలా వ్యవహరిస్తుందనేది కీలకంగా మారింది. ప్రస్తుతం ఆ పార్టీలోనే ఇబ్బందికరపరిస్థితులు తలెత్తడం, కాంగ్రెస్ నేతలు భిన్నాభిప్రాయాలతో పార్టీ అధికారిక వైఖరిని విభేదిస్తున్న పరిస్థితులు చూస్తున్నాం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ తన సొంత విధానాల్లో కొన్నింటిని వదులుకోవాలి. దేశప్రయోజనాల దృష్ట్యా కొన్ని విధానాలను మార్చుకుని నెహ్రూ విధానాల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలి. సెక్యులర్ విలువల పరిరక్షణకు పెద్దపీట వేసి, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, తదితర అంశాల్లో మార్పులు చేపడితే ప్రయోజనం ఉంటుంది.

**ముందుగా మా పార్టీ పునర్వ్యవస్థీకరణ**

ముందుగా మా పార్టీని అన్నిస్థాయిలో పునర్వ్యవస్థీకరించి క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలి. అనునిత్యం ప్రజాసమస్యలపై పోరాడేందుకు సిద్ధం చేయాలి. వామపక్ష, కమ్యూనిస్టు శక్తుల ఐక్యత, పునరేకీకరణ తక్షణ అవసరం. ఈ విషయాన్ని సీపీఐ ఎప్పుడూ ప్రస్తావిస్తూ అందుకోసం ప్రయత్నిస్తోంది. సైద్ధాంతిక ప్రాతిపదికన వామపక్ష ఐక్యతను కోరుకుంటోంది. దీంతో పాటు కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**జెండర్, జనరేషన్ గ్యాప్ అధిగమించాలి**

పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసి యువత, మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెంచడం.. తగిన శిక్షణనివ్వడం ద్వారా సామాజిక మార్పుకు వారధులుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం దళితులు, ఆదివాసీలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల్లో చైతన్యం పెరిగింది. వారి డిమాండ్లను సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఈ వర్గాలకు కమ్యూనిస్టులు దగ్గరకావాల్సిన అవసరముంది. వీరిలో చురుకైన కేడర్‌ను పార్టీలో భాగస్వాములను చేయాలి. జెండర్, జనరేషన్ గ్యాప్‌ను అధిగమించాల్సి ఉంది.

**'లెఫ్ట్'ఐక్యత చారిత్రక అవసరం**

కమ్యూనిస్టుపార్టీల ఏకీకరణకు సంబంధించి గతంలో సీపీఐ ప్రధానకార్యదర్శి ఇంద్రజిత్‌గుప్తా, సీపీఎం ప్రధానకార్యదర్శి హరికిషన్ సూర్జిత్ సమావేశమై ఒక జాయింట్ సర్క్యులర్‌ను విడుదల చేశారు. రాష్ట్ర స్థాయిల్లోని ఉమ్మడి కమిటీలను ఏర్పాటు చేసి వామపక్ష ఐక్యతసాధన దిశలో చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే ఈ ప్రక్రియ ఆ తర్వాత కొనసాగలేదు. వామపక్ష, కమ్యూనిస్టుల ఐక్యత, పునరేకీకరణ నేటి అవసరం.

**సోషల్ మీడియాను ఒక సాధనంగా గుర్తించాం**

సోషల్ మీడియాను బీజేపీ, ఆరెస్సెస్ సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్న తీరును గుర్తించాం. సీపీఐ కూడా జాతీయస్థాయిలో ఒక సోషల్ మీడియా సెల్‌ను ఏర్పాటుచేసింది. రాష్ట్రస్థాయిల్లోనూ దీనిని ఏర్పాటుచేయాలని సూచించాము. బీజేపీ ప్రభుత్వ తప్పుడు విధానాలను ఎండగట్టడంతో పాటు, ముఖ్యమైన అంశాలపై పార్టీ వైఖరిని వివరించేందుకు ఈ మాధ్యమాన్ని ఉపయోగించుకోవాలని రాష్ట్ర పార్టీలకు తెలియజేశాం.

# ఎంబీబీఎస్ కన్వీనర్ సీట్లకు చివరి నోటిఫికేషన్

- నేడు 5 గంటల వరకు వెబ్ కౌన్సెలింగ్
- కన్వీనర్ కోటాలో 100 సీట్లకు జరుగనున్న ప్రక్రియ



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు తుది విడత కౌన్సెలింగ్‌కు (మాప్ అప్ రౌండ్) కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద సీట్ల భర్తీకి ఇప్పటికే మొదటి, రెండు, మూడో విడత వెబ్ కౌన్సెలింగ్ పూర్తి అయింది. కన్వీనర్ కోటలో ఇంకా 100 ఎంబీబీఎస్ సీట్లు మిగిలిపోవడంతో వాటిని ఈ మాప్ అప్ రౌండ్ ద్వారా భర్తీ చేయనుంది. కాలేజీల వారీగా ఖాళీలను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. మొదటి ర్యాంక్ నుంచి చివరి ర్యాంక్ వరకు ఉన్న అభ్యర్థులందరూ ఆదివారం సాయంత్రం 6 నుంచి సోమవారం సాయంత్రం 5 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని పేర్కొంది. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లను ( www. knruhs.in, www.knruhs.telangana.gov.in) సంప్రదించవచ్చని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా అగ్రవర్ణ పేదల (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ల కోసం 190 సీట్లు అదనంగా భర్తీ అయ్యాయి. ఒక్క కౌన్సెలింగ్‌లోనే ఆ సీట్లన్నీ భర్తీ కావడం గమనార్హం. అగ్రవర్ణ పేదల్లో మొదటి రెండు విడతల కౌన్సెలింగ్‌లలో అన్ రిజర్వుడు కోటా కింద సీట్లు పొందిన వారంతా మూడో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొని మంచి కాలేజీల్లో సీట్లు పొందారు. ఇదిలావుండగా ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మిగిలిపోయిన యాజమాన్య సీట్ల చివరి విడత కౌన్సెలింగ్ ఈ నెల 28న నిర్వహించే అవకాశాలున్నాయి. ఈ నెలాఖరుకు కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.

# టాయిలెట్ రూంలో 2.99 కేజీల బంగారం

- తనిఖీల భయంతో పడేసిన ప్రయాణికుడు
- స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు



**శంషాబాద్:** విమానాశ్రయంలో అధికారులు తనిఖీలు చేస్తున్నారనే భయంతో బంగారాన్ని అక్రమ రవాణా చేస్తున్న ఓ ప్రయాణికుడు దాన్ని టాయిలెట్ రూంలో పడేశాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. 6 ఈ 1406 విమానంలో షార్జా నుంచి నగరానికి వస్తున్న షేక్ అబ్దుల్ సాజిద్ అనే ప్రయాణికుడు అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్నాడని కస్టమ్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో కస్టమ్స్ అధికారులు అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. విషయాన్ని గ్రహించిన షేక్ అబ్దుల్ సాజిద్ తన వద్దనున్న బంగారం బిస్కెట్లను టాయిలెట్ రూంలో పడేశాడు. సాజిద్‌ను తనిఖీ చేసిన అధికారులకు అతడి వద్ద బంగారం బయటపడలేదు. అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకున్న అధికారులు విచారించడంతో అసలు విషయం వెల్లడించాడు. అధికారులు టాయిలెట్ రూం నుంచి 26 బంగారు బిస్కెట్లను (2.99కేజీలు) స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,11,60,160 ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.


# పాస్‌పోర్ట్ దరఖాస్తుకు ఈ-టోకెన్!

- అమీర్‌పేట్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో ప్రయోగాత్మకంగా ప్రారంభం
- తాజాగా 4 పాస్‌పోర్ట్ కేంద్రాలు, 23 పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ కేంద్రాల్లోనూ షురూ
- కాగిత రహితం దిశగా పాస్‌పోర్ట్ కేంద్రాల సేవలు
- గడువు తీరిన పాస్‌పోర్టు వినియోగదారులకు ఎస్‌ఎంఎస్ అలర్ట్స్

**సాక్షి, హైదరాబాద్:** పాస్‌పోర్ట్ సేవలకు ఈ–టోకెన్ విధానం సత్ఫలితాన్నిస్తోంది. ఆన్‌లైన్‌లో పాస్‌పోర్ట్ పొందేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ–టోకెన్ నంబర్ ఎస్‌ఎంఎస్ రూపంలో మొబైల్‌కు అందుతుంది. దీంతో పాస్‌పోర్ట్ సేవా కేంద్రానికి అన్ని డాక్యుమెంట్ల జిరాక్స్ ప్రతులను తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. అక్కడి సిబ్బందికి మీ సెల్‌ఫోన్‌కు అందిన మీ దరఖాస్తు రిఫరెన్స్ నంబర్ (ఏఆర్‌ఎన్) చూపితే చాలు. ఈ పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియను అక్కడి సిబ్బంది నిమిషాల్లో పూర్తి చేస్తారు. అమీర్‌పేట్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో అమలు చేసిన ఈ ప్రయోగాత్మక విధానం సఫలీకృతం కావడంతో ఇటీవల మరో 4 పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు, 23 పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల్లోనూ అమలు చేస్తున్నట్లు ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం వర్గాలు తెలిపాయి. దేశంలో ఢిల్లీ తర్వాత ఈ విధానాన్ని మన నగరంలో అమలు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఇక ఏఆర్‌ఎన్ ద్వారా తమ పాస్‌పోర్ట్ అప్లికేషన్ ఏస్థాయిలో ఉందన్న అంశాన్ని ఈ–ట్రాకింగ్‌తో తెలుసుకునే సౌలభ్యాన్ని విదేశాంగ శాఖ కల్పించడం విశేషం.

**6 నెలల ముందే అలర్ట్..**

పాస్‌పోర్టు గడువు తీరిన వినియోగదారుల మొబైల్ నంబర్లకు ఎస్‌ఎంఎస్ అందించే సేవలను ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం ప్రారంభించింది. వినియోగదారులకు 6 నెలల ముందుగానే ఈ సమాచారాన్ని తెలియజేయడం ద్వారా వారు రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందుకోసం వినియోగదారులందరి పాస్‌పోర్ట్ డేటాను డిజిటల్ మాధ్యమంలోభద్రపరిచామని పేర్కొన్నారు. ఎస్‌ఎంఎస్ అలర్ట్ సైతం కంప్యూటర్ ద్వారా ఆటోమేటిక్‌గా వినియోగదారులకు చేరేలా ఏర్పాట్లు చేయడం విశేషం.



**దరఖాస్తు సమయంలో జాగ్రత్త..**

పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకునే వినియోగదారులు విధిగా కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ https://www.passportindia.gov.in/ నుంచే చేసుకోవాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో ఇతర లింక్‌లను ఆశ్రయించి మోసపోవద్దని హెచ్చరిస్తున్నారు.

**రోజూ 3 వేల దరఖాస్తులు..**

విద్య, ఉద్యోగం, వ్యాపారం, పర్యాటకం, మెడికల్ టూరిజం ఇలా విదేశాలకు వెళుతోన్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోన్న నేపథ్యంలో పాస్‌పోర్ట్ దరఖాస్తులు సైతం అంతకంతకు పెరుగుతూనే ఉన్నాయి. నిత్యం పాస్‌పోర్ట్ కార్యాలయాలకు సుమారు 3 వేల దరఖాస్తులు అందుతున్నట్లు ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పోలీస్ క్లియెరెన్స్ అందిన 3–4 రోజుల్లో పాస్‌పోర్టును జారీ చేస్తున్నామని, పోలీసులు సైతం వెరిఫికేషన్‌ను సత్వరం పూర్తి చేస్తున్నారన్నారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

epaper.sakshi.com